: fb.com/vaartha Digital

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నిజామాబాద్
7-11-2026
శనివారం సంపుటి: 32
సంచిక: 278
పేజీలు: 8+4
వెల: 6.50

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Karimnagar, Khammam, Nalgonda, Nellore, Tadepalligudem, Srikakulam



బియ్యం 'బొక్కితే' కటకటాలే!



• ధరల నియంత్రణకు రాష్ట్ర వ్యాప్తంగా 2686 ఆకస్మిక తనిఖీలు • అక్రమ నిల్వలు, తూకాల్లో మోసాలపై 371 కేసులు నమోదు • 35 మంది వ్యాపారులపై క్రిమినల్ చర్యలకు పౌర సరఫరాల కమిషనర్ సిఫారసు



సూపర్ మార్కెట్లలో తనిఖీలు జరుపుతున్న దృశ్యం

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: తెలంగాణలో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుకొనడంతో పౌర సరఫరాలశాఖ కృత్రిమ కొరత సృష్టించి నిత్యవసరాలు ముఖ్యంగా బియ్యం ధరలు పెంచి ప్రజలను దోచుకొనే వ్యాపారులపై ఆకస్మిక తనిఖీలు చేస్తూ క్రిమినల్ కేసులు వంటి కఠిన చట్టాలను మోపి కటకటాల వెనక్కు పంపిస్తుండటంతో వినియోగదారులు ఊపిరి తీర్చుకొంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యక్ష పర్యవేక్షణలో గత ఎనిమిది రోజులు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్ ఫోర్స్,తూనికలు కొలతలు అధికారులు 2686 చోట్లరైసుమిల్లులు, వ్యాపార సంస్థలను ఆకస్మికంగా తనిఖీచేసి వ్యాపారుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించారు. బియ్యం అక్రమ నిల్వలు, ధరలు పెంచి విక్రయించే వ్యాపారులు, తూనికల్లో మోసాలు చేసే వారిపై నేరతీవ్రతను బట్టి 371కేసులు నమోదుచేశారు. ఇందులో సుమారు 35 >>2

మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

ఓల్డ్‌సిటీ అభివృద్ధికి భారీగా నిధులు: డి.సిఎం భట్టి



హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త : మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధితో పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హైదరాబాద్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులు వెచ్చిస్తోందన్నారు. మైనార్టీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసే దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మైనార్టీలకు విద్యా అవకాశాలను మరింత విస్తృతం చేసేందుకు నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం, ఆంక్షలు ఉండబోవని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హజ్‌హౌస్ పక్కన కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన బహుళఅంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. వివిధ రహదారుల విస్తరణ పనుల కోసం వినియోగించిన వక్ఫ్ భూములకు సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన నిధుల్లో రూ. 25 కోట్లను ఈ భవన నిర్మాణం కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. విద్యాసంస్థల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం చేశారు. మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే పాఠశాలలు, స్టడీ సర్కిళ్లు, ఇతర విద్యాసంస్థలకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులుఅంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పరిధిని విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమానికి సంబంధించిన షాదీ ముబారక్ పథకం, ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు, రాజీవ్ యువ వికాసం పథకం కింద మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విడుదల తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. క్రైస్తవ మైనార్టీలకు సంబంధించిన సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. మైనార్టీల విద్యా, సామాజిక, ఆర్థికఅభివృద్ధితోపాటు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మౌలిక వసతుల మెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి. షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో రూ.275 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

పంట నష్టాల పరిహారంపై రైతుల ఎదురు చూపు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. దాదాపు యేడాది కాలం గడచినా రూ.275 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత యేడాది మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టాలకు ఇంకా పరిహారం అందుకోని రైతులకు మళ్లీ ఇటీవల కురిసిన వర్షాలతో కొత్త నష్టాలను ఎదుర్కొంటున్నారు. గత యేడాది ఏప్రిల్ నెలలో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రాష్ట్ర ప్రభుత్వం మే 2025లో రూ.28 కోట్లు మంజూరు చేసింది. అలాగే మార్చి నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల కలిగిన పంట నష్టాలకు మరో రూ.8 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వుల జారీ చేసింది.

అలాగే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో, రైతులకు నష్టపరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. రూ. 109 కోట్లకు పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. వీటితో పాటు, గత యేడాది అక్టోబరు నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల వ్యవసాయ, ఉద్యానవన పంటలకు కలిగిన నష్టానికి గాను, తెలంగాణలోని 27 జిల్లాలకు చెందిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద చెల్లించేందుకు రూ.122 కోట్ల మేర ఆర్థిక శాఖ పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ విధంగా గత యేడాది కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టానికి ప్రభుత్వం మొత్తం సుమారు రూ. 275 కోట్ల పరిహారం ఇచ్చేందుకు అనుమతులు మంజూరు చేసి రెండేళ్ల అయినా ఇప్పటి వరకూ పంట నష్ట పరిహారాన్ని విడుదల చేయాలేని బాధిత రైతాంగం వాపోతోంది.

11 రెస్టారెంట్ల లైసెన్సులు సస్పెన్షన్

565 కిలోల నాసిరకం ఆహార పదార్థాల తొలగింపు

భద్రాచలం, నవంబరు 6 ప్రభాతవార్త: ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో టిజి సేఫ్ ఆధ్వర్యంలో ఆహార భద్రతా శాఖ అధికారులు భద్రాచలంలోని హోటళ్లు, రెస్టారెంట్లపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించని 11 రెస్టారెంట్ల లైసెన్సులను సస్పెండ్ చేయగా, మరో నాలుగు సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

వినియోగానికి అనర్హమైన 565 కిలోల నాసిరకం ముడి ఆహార పదార్థాలను గుర్తించి తొలగించారు. హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రత, నాణ్యత, ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. లోపాలను సరిదిద్ది, తిరిగి తనిఖీల్లో ప్రమాణాలు నిర్ధారణ అయిన తర్వాతే లైసెన్సులు పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటినుంచి సిఎం కొడంగల్ పర్యటన

3 రోజులు అక్కడే..

రూ. 9,100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు6: శనివారం నుంచి మూడు రోజులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటన చేయనున్నారు.రైతుమేళా, ఇండస్ట్రియల్‌ఎక్స్‌పో ప్రారంభించనున్నారు. రూ.9,100 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకు >>2

ఓటర్లకు మరో ఛాన్స్!

మళ్లీ ఫారాల సమర్పణకు ఇసి అనుమతి

తెలంగాణ, ఎపి సహా ఏడు రాష్ట్రాలకు వర్తింపు



న్యూఢిల్లీ, నవంబరు 6: కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ముసాయిదా ఓటర్ల జాబితాల నుండి పేర్లు మినహాయించబడిన ఓటర్లకు మరో అవకాశం కల్పించాలని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, నాగాలాండ్, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారులకు (సిఇఒలకు) ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం ఇసి లేఖలురాసింది. గణన పత్రాలు జారీ చేయబడినప్పటికీ, వారి పేర్లు ఎఎస్‌డిడి (గైర్హాజరు, స్థానభ్రంశం, మరణం లేదా నకిలీ)గా గుర్తించబడి మినహాయించబడిన ఓటర్లు, తుది ఓటర్ల జాబితాలో చేర్చబడటానికి తమ పత్రాలను మళ్లీ సమర్పించడానికి అనుమతించబడతారని కమిషన్‌పేర్కొంది. ఈఓటర్లు తమ ప్రస్తుత సాధారణ నివాసానికి సంబంధిం >>2




శుక్రవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న విహెచ్

సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విహెచ్

హైదరాబాద్ నవంబర్ 6,ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో వీహెచ్ ముఖ్యమంత్రికి ముందస్తు దీపావళి పండుగ శుభాకాంక్షలతో పాటు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాతో సిఎం రేవంత్‌రెడ్డిని సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. విహెచ్‌తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు రోహిణ్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్ తదితరులు కూడా సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ భేటీ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సంక్షేమ కార్యక్రమాలపై నేతలు కాసేపు చర్చించారు. నేతల శుభాకాంక్షలకు సిఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

సిఎం కొడంగల్ పర్యటన

>> స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రైతులు, పారిశ్రామిక వేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశాల్లో సిఎం పాల్గొననున్నారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలోని యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించ నున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించను న్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో సిఎం పాల్గొననున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు హకీంపేటఎడ్యుకేషన్ హబ్ పనులను సిఎం పరిశీలించనున్నారు. అనంతరం రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి సిఎం చేరుకోనున్నారు. శనివారం రాత్రి కొడంగల్‌లోనే సిఎం బస చేయనున్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటలనుంచి 10.20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సిఎం సమావేశం కానున్నారు. ఉదయం 10.20 గంటలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. ఉదయం 10.30 కు ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.45 కు హకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు రూ.2.35 కోట్లతో నిర్మిం చిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11.30 గంటలకు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించనున్నారు. ఉదయం 11.45 గంటలకు రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించను న్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, 1.15 గంటలకు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు కోస్గి మండలం నాచారం గ్రామంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2కు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మిం చిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2.45 గంటలకు దౌల్తాబాద్‌మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మిం చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించనున్నారు. ఈనెల 9 న సాయంత్రం 5 గంటలకు హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో సిఎం పాల్గొననున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లపై కొనసాగుతున్న టిజి సేఫ్ దాడులు

అనేక అక్రమాలు గుర్తింపు, పిస్తా హౌస్. కెఎఫ్‌సి సహా మూడు ప్రముఖ హోటళ్ల లైసెన్స్ సస్పెన్షన్

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ఏ ర్పాటైన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) శుక్రవారం నాడు సంగారెడ్డి కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలలో పలు హోటళ్లపై దాడులు నిర్వహించింది. ఈ సందర్భగా అపరిశుభ్రంగా వున్న వంటశాలలు, పరిశుభ్రంగా లేకుండా వుండి తుప్పుపట్టిన యంత్రాలు, రి యూజ్డ్ వంట నూనె, లేబుల్స్‌లేని ఆహార పదార్థాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, రికార్డులు సరిగ్గా లేక పోవడం, వంటలు చేసేవారు పరిశుభ్రంగా వుండక పోవడం, బొద్దింకలు, ఈగలు ముసురుతుండడం, వాటి పక్కనే కాలం చెల్లిన ఆహార వస్తువులు, కుళ్లిపోయిన కూరగాయలు వాడుతుండడం అధికారులు గుర్తించారు. దీంతో పాటు తప్పుడు లేబు లింగ్, ఆహార పదార్థాల్లో బొద్దింకలు, ఈగలు, దోమలు వాలుతున్నట్లు టిజి సేఫ్ బృందాలు గమనించాయి. ఆహార పదార్థాలను నేలపైనే నిలువ చేయడమే కాకుండా ఆహార ఆహారేతర వస్తు వులను కలిపి ఉంచడం పట్ల ఆహార పదార్థాల తయారీ కేంద్రాల యాజమానులపై టీజీ సేఫ్ బృందాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ క్రమం లో కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలో గల దేవయాని ఇంటర్నేషనల్ పేరిట వున్న అంతర్జాతీయ హోటల్ కెఎఫ్‌సి, పటాన్‌చెరు మండలంలోని ముత్తంగిలో గల పిస్తా హౌస్, పటాన్‌చెరు బస్టాండ్‌లోగల గణపతి హోటెల్, మెస్, మాదన్నాపేట్‌లోని నవాబ్ డిలైట్స్ హోటల్, మెహదీపట్నంలోని అయోధ్యనగర్ కాలనీలో గల ఎస్‌కె బేకర్స్ అండ్ ఫాస్ట్ ఫుడ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు.

రామప్ప ఆలయం వద్ద బొగ్గు గనిపై ఎన్‌జిటి సుమోటోగా విచారణ

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: రాష్ట్రంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్పఆలయం, చెరువు సమీపంలో ప్రతిపాదిత బొగ్గుగని ప్రాజెక్టుపై నేషనల్‌గ్రీన్‌ట్రిబ్యునల్(ఎన్‌జిటి)సుమోటోగావిచారణ చేపట్టింది. సింగరేణి కాలరీస్ చేపట్టనున్న ఈ ప్రాజెక్టుతో చారిత్రక కట్టడం,చెరువుకు ముప్పు పొంచి ఉందని యాక్టివిస్టులు ఆందోళన చెందుతున్నారు. 300 మీటర్ల దూరంలో తవ్వకాలు చేపడితే ఆలయ పునాదులపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులకు ఎన్‌జిటి నోటీసులు జారీ చేసింది.

బియ్యం 'బొక్కితే' కటకటాలే!

>> మంది వ్యాపారు లపై క్రిమినల్‌కేసులు నమోదు చేయడం విశేషం. ప్రజలకు తక్కువ ధరకు బియ్యం అందించేందుకు ధరలపై పరిమితులు విధించడంతో పాటు, వ్యాపా రుల దోపిడీనీ నియంత్రించడానికి రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ కమి షనర్, ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్ మెంట్ టాస్క్ ఫోర్స్ తూనికలు కొలతలు అధికారులు అక్టోబరు 29 నుంచి నవంబరు 5, 2026 వరకు వారం రోజుల పాటు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమ వ్యాపారాలు, ధరల దోపిడీ నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ దాడులు చేపట్టారు.మార్కెట్లో ధరల పెరుగుదల నుంచి వినియోగదారులను రక్షించడానికి, ప్రజలు ఎక్కువగా వాడే బియ్యం రకాలపై గరిష్ట అమ్మకం ధరలను కచ్చితంగా ముద్రించాలని కూడా వ్యాపారులకు ఆదేశాలు జారీచేశారు. బిపిటి కెఎన్ఎం రకం బియ్యం ధరను కిలోకు రూ66గా నిర్ణయించారు. ఆర్ఎన్ఆర్ తెలంగాణ సోనా బియ్యం కిలో రూ74 , అలాగే హెచ్ఎంటి జెఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ79కి మించకూడదని స్పష్టం చేశారు. మార్కెట్లో పారదర్శకత కోసం, మిల్లర్లు, వ్యాపారులు ప్రతి 26 కిలోల బియ్యం బస్తాపై ఈ నిర్ణయించిన గరిష్ట అమ్మకం ధరలను తప్పనిసరిగా ముద్రించాలని ఆదేశించారు.వినియోగదారులను మోసం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టమైన సంకేతాలు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలతో ఇచ్చారు. టాస్క్ ఫోర్స్ బృందాలు 1141 రైస్ మిల్లులు, హోల్ సేల్ డీలర్లు, రిటైల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని వారిపై ఈ తనిఖీల ద్వారా 55 కేసులు, 35 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. మరోవైపు, తూనికలుకొలతల శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 1,545 తనిఖీలు నిర్వహించి, ప్రజలను మోసం చేయాలని చూసిన వారిపై 280 కేసులు నమోదు చేశారు. సామాన్య ప్రజలను మోసం చేసేందుకు వ్యాపారులు చేస్తున్న అనేక అక్రమాలను ఈ తనిఖీల్లో అధికారులు గుర్తించారు. బస్తాలో 25 కిలోల బియ్యం మాత్రమే ఉంచి, పైన 26 కిలోల లేబుల్ అతికించి తూకాల్లో మోసం చేస్తున్న వ్యాపారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. అంతేకాకుండా, అసలు ధరలు కనిపించకుండా వాటిపై ఎక్కువ ధరల స్టిక్కర్లు అంటించడం, పిడిఎస్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, జిఎస్‌టి లేదా ఎఫ్ఎస్ఎస్ ఎఐ లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు.రేషన్ బియ్యాన్ని పదే పదే అక్రమంగా నిల్వ చేసే వారిపై, అలాగే మార్కెట్ ధరలను పెంచే వారిపై పిడి చట్టం ప్రయోగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పదే పదే ఇలాంటి తప్పులు చేసే ఈ నేరస్థులు నిత్యావసర సరుకుల చట్టం, బిఎన్ఎస్ కింద కఠిన విచారణ, జైలు శిక్షను ఎదుర్కోనున్నారు. ఈ వారం రోజుల దాడులు కేవలం తాత్కాలికం మాత్రమే కాదు, ఎప్పుడూ కొనసాగేప్రక్రియఅని అధికారులుతెలిపారు. మార్కెట్లలో అక్రమాలకు పాల్పడే వారికి తగిన శిక్ష పడేలా చూస్తూ, సాధారణ వినియోగదారులను రక్షించడానికి పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం తన నిఘాను కొనసాగిస్తుంది.

ఓటర్లకు మరో ఛాన్స్!

>> చిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్ఒ) లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఎఇఆర్ఒ)కు, సరిగ్గా నింపిన తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించడానికి అనుమతించబడ తారని కమిషన్ తెలిపింది.

ఓటర్ల జాబితాలను మళ్లీ ప్రదర్శించాలి:
ఈ ఆదేశాలలో భాగంగా, ఎఎస్‌డిడి కేటగిరీల కింద గుర్తించబడిన ఓటర్ల బూత్‌వారీ జాబితాలను ఆయా పోలింగ్‌కేంద్రాలు, పంచా యతీ భవనాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాల నోటీసు బోర్డులపై మళ్లీ ప్రదర్శిస్తారు. ఈ జాబితాలను సంబంధిత ముఖ్య ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో సులభంగా చదవగలిగే పిడిఎఫ్ ఫార్మాట్‌లో కూడా అప్‌లోడ్ చేస్తారు. ఈ జాబితాలలో, ముసా యిదా ఓటర్ల జాబితాలో ఓటర్ల పేర్లను చేర్చకపోవడానికి గల సంభావ్య కారణాలు కూడా ఉంటాయి. జిల్లా ఎన్నికల అధికా రులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు తమ ఇసిఐఎన్ఇటి డాష్ బోర్డ్‌ల ద్వారా పాక్షికంగా నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను మళ్లీ రూపొందించాలని కూడా ఇసిఐ ఆదేశించింది. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒలు) సంబంధిత ఓటర్లను సంప్రదించి, సంప్రదింపు వివరాలు అందుబాటులో ఉన్నచోట, ఫారమ్‌లను భౌతికంగా లేదా వాట్సాప్, ఇమెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా అందేలా చూడవలసిందిగా కోరబడతారు. తమ పేర్లు తొలగించ బడటానికి ముందు ఉన్న అదే ఇపిఐసి నంబర్‌ను ఉపయోగించి, ఓటర్లు ఇసిఐ వెబ్‌సైట్ లేదా ఇసిఐఎన్ఇటి యాప్ ద్వారా కూడా తమ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని నింపగలరు.

నివాసం మార్చిన ఓటర్ల కోసం ప్రత్యేక నిబంధనలు:
నివాసం మార్చని ఓటర్లకు, ఒకే రాష్ట్రంలో నివాసం మార్చిన వారికి కమిషన్ వేర్వేరువిధానాలను నిర్దేశించింది. ఒకే చిరునా మాలో నివసిస్తున్న ఓటర్లు, తాము ఇంతకుముందు ఫారాన్ని ఎందుకు సమర్పించలేకపోయారో వివరిస్తూ ఒక ప్రకటనతో పాటు, తాము నింపి, సంతకం చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాల్సి ఉంటుంది. వారు ఈ పత్రాలను స్వయంగా గానీ లేదా కుటుంబ సభ్యుల ద్వారా గానీ సమర్పించవచ్చు, లేదా ఇసిఐఎన్ఇటిలో ఇసైన్‌తో ఆన్‌లైన్ సదుపాయాన్ని ఉపయోగించు కోవచ్చు. ఒకే రాష్ట్రంలో నివాసంమార్చినవారు ఫారం8 సమర్పిం చాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా, వారు తమ కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గాన్ని పేర్కొంటూ ఒక ప్రకట నతో పాటు, చిరునామా రుజువును జతచేసి, ఎన్యూమరేషన్ ఫారాన్ని సంబంధిత ఇఆర్ఒ లేదా ఎఇఆర్ఒకు సమర్పించాల్సి ఉంటుంది. చిరునామా పత్రాలు లేని నిరాశ్రయ ఓటర్లు, తమ నివాసానికి రుజువుగా బూత్ స్థాయి అధికారి (బిఎల్ఒ) ఇచ్చే క్షేత్రస్థాయి ధ్రువీకరణ నివేదికను ఉపయోగించుకోవచ్చని ఇసిఐ కూడా తెలిపింది. ఓటర్లను గుర్తించేందుకు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకోవాలని, ఇంటింటికీ వెళ్లి పర్యటించాలని, అలాగే ఇరుగుపొరుగు వారిని, కుటుంబ సభ్యులను, నివాసి సంక్షేమ సంఘాలను సంప్రదించాలని బూత్ స్థాయి అధికారులను (బిఎల్ఒ) ఆదేశించింది. ఈ చర్యలకు విస్తృత ప్రచారం కల్పించాలని, అర్హులైన ఓటర్లు తుది ఓటర్ల జాబితాలో చేరే అవకాశాన్ని కోల్పోకుండా ఉండేందుకు పర్యవేక్షణ యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కమిషన్ సిఇఒలను కోరింది. నకిలీ నమోదులను నివారించడానికి రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించింది.

ఓట్ చోరీతోపాటు ప్రజల పథకాలపైనా కుట్రలే

ఆధార్‌కు బదులు ఓటర్ ఐడి లింకుపై రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ, నవంబరు 6: కేంద్రంలో బిజెపి శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను నిర్ధారించడానికి ఆధార్ కార్డుకు బదులు ఓటర్ ఐడిని ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ ఎక్స్‌లో స్పందించారు. మోడీ ప్రభుత్వ మంత్రి తన ప్రకటనలో పథకాల ప్రయోజనాలు ఇకపై ఆధార్‌తో కాకుండా ఓటర్ ఐడితో నిర్ణయిస్తారని చెప్పటం ఒక కుట్ర అని, ఇది చాలా చాలా తీవ్రమైన నిర్ణయం అవుతుందని అన్నారు. కాస్త సమయం కేటాయించి ప్రజలు ఈ కుట్రను అర్థం చేసుకోండి అని రాహుల్ ట్వీట్ చేశారు. ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో లక్షలాది మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని, ఇంకా మరిన్ని పేర్లు తొలగించే అవకాశం ఉందని ఆయన అన్నారు.
పేరు తొలగిస్తే ఓటుపోయినట్లే. ఓటు పోతే హక్కులు పోయినట్లే. మీరు హైజాక్ చేసిన ప్రజాస్వామ్యంలో అదృశ్య పౌరులుగా మారిపోతారన్నారు. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం లేదు.. ప్రభుత్వమే తనకు అనుకూలమైన వ్యక్తులను ఎన్నుకుంటోంది అని రాహుల్ విమర్శించారు. ఓటర్ల జాబితాలు నిష్పక్షపాత ఎన్నికల సంఘం చేతిలో ఉండాల్సింది కానీ ప్రస్తుతం మోడీ ప్రభుత్వ ఉద్యోగి జ్ఞానేశ్ కుమార్ చేతిలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. కేంద్ర మంత్రి లలన్ సింగ్ వీడియోలో .. ఇకపై లబ్ధిదారులకు చెల్లింపులకు ఆధార్ కార్డు ప్రాతిపదిక కాదు. ఆధార్ కార్డు ఇప్పుడు ప్రతి వీధిలో అందుబాటులో ఉంది. అడిగితే ఐదు నిమిషాల్లో సిద్ధం చేస్తారు. కాబట్టి ఆధార్‌కాదు. లబ్ధిదారులందరికీ బయో మెట్రిక్, ఓటర్‌ఐడీ ఎపిక్ నంబర్ ప్రాతిపదికగా ఉంటాయన్నారు. వాటి ఆధారం గానే చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. దీంతో రాహుల్ గాంధీ ఇది వచ్చే ఎన్నికలు గెలవడానికి చేస్తున్న రాజకీయం కాదు. ఎన్నికలనే పూర్తిగా హైజాక్ చేసి శాశ్వతంగా అధికారంలో ఉండే ఏర్పాటు అని ఆరోపించారు. పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిస చేయలేంఅని స్పష్టం చేశారు.

హైదరాబాద్ హైటెక్స్‌లో 12 నుంచి 'భారత్ సమ్మిట్'

100 దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు

హైదరాబాద్,నవంబరు6, ప్రభాతవార్త: అంతర్జాతీయ స్థాయిలో మరో భారీ సదస్సుకు హైదరాబాద్ వేదిక కాబోతోంది. ప్రపంచ దేశాలతో భారత్ సంబంధా లను మరింత బలోపేతం చేయడం, వివిధ రంగాల్లో అంతర్జాతీయ సహకా రాన్ని విస్తరించడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా 'భారత్ సమ్మిట్' నిర్వహించ నున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ప్రాంగ ణంలో 3 రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. కేంద్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాలకు చెందిన ప్రతినిధు లకు ఆహ్వానాలు పంపించారు. మొత్తం 450 మంది ప్రముఖ అతిథులు ఈ సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్ సమ్మిట్‌ను అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దాదాపు 100 దేశాల నుంచి దౌత్యవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

వారం - వర్జ్యం

07-11-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, విశాఖ కార్తె
తి. త్రయోదశి ఉ.10.50. న. చిత్త తె.5.52
వ.మ.1.06 -మ. 2.47.
దు.1. ఉ.06.07 - ఉ.7.41.
రాహు. ఉ.9.00-10.30 వరకు
శుభ స. ఉ.9.00 - ఉ. 10.00.

వార్తాఫలం

మేషం : చాల విషయాలు ఈ రోజు మీకు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగాలలో బదిలీలు వుంటాయి .

వృషభం : ఉన్నత స్థాయి వర్గం వారి అండదండలు లభిస్తాయి. శుభ ప్రదమైన ప్రసంగాలు ప్రశాంతతను చేకూరుస్తాయి.

మిథునం : వివాదాలు పరిష్కారించుకోవడానికి గాను మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. నిజమైన మిత్రులు ఎవరో తెలుసుకుంటారు.

కర్కాటకం : అవసరాలకు సరిపడా ధనాన్ని సమకూర్చుకోగలుగుతారు . రహస్య చర్చలు ఫలిస్తాయి.

సింహం : మిమ్మల్ని మీరు ఒంటరి వారుగా భావిస్తారు . బరువు బాధ్యతలును సక్రమంగా నిర్వహిస్తారు.

కన్య : పనులలో మీరు ఊహించని ఆటంకాలు ఎదుర్కొనవలసి వచ్చినప్పటికి అది ప్రయోజ నాలకు ముప్పు వుండదు.

తుల : ఈ రోజు అనుకులంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితిపై శ్రద్ధ ఎక్కువగా చూపించండి అన్ని విధాలా మంచిది. అలసటకు గురవుతారు

వృశ్చికం : వ్యాపారంలో లోక్యం ప్రదర్శించండి. బంధువుల కలయిక. పెట్టుబడులకు దూరంగా ఉండండి.

ధనుస్సు : కోపతాపాలకు దూరంగా ఉండటానికి ప్రయత్నించండి. సంతాన సంతోషంకోసం కొన్ని కొనుగోలు చేస్తారు.

మకరం : ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుంది. వృత్తి పరంగా కనబరచే ఓర్పు మంచి ఫలితాలను ఇస్తుంది.

కుంభం : ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. క్షణం తీరిక లేకుండా హడావుడిగా కాలాన్ని గడుపుతారు .

మీనం : ముఖ్యమైన అన్ని విషయాల పట్ల జాగ్రత్తగా వుండండి. చికాకు అసహనం అధికంగా ఉంటాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సూర్యకుమార్ యాదవ్ కుటుంబసభ్యులు

కుటుంబంతో ప్రధానిమోడీని కలిసిన సూర్యకుమార్ యాదవ్

న్యూఢిల్లీ, నవంబరు 6: భారత్‌కు టి20 వరల్డ్ కప్ అందించిన రెండో కెప్టెన్, ఆ తర్వాత జట్టుకు అనూహ్యంగా దూరమైన టీమిండియా మాజీ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ ఇవాళ ప్రధాని మోడీని కలిశారు. ధంతేరాస్ సందర్భంగా ప్రధాని మోడీని సూర్య కుటుంబంతో సహా వెళ్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా మోడీ సూర్య, ఆయన భార్య, పిల్లల్ని పలకరించి ఆహ్లాదంగా గడిపారు. ఈ వీడియో రీల్‌ను ప్రధాని మోడీ స్వయంగా షేర్ చేశారు. దీంతో మోడీసూర్య భేటీ వెనుక కారణాలపై చర్చ జరుగుతోంది. టీమిండియాకు దూరమైన తర్వాత ఎక్కువగా బయట కనిపించని సూర్య కుమార్ యాదవ్ ఇవాళ హఠాత్తుగా ప్రధాని మోడీని కుటుంబంతో సహా వచ్చి కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. సూర్యకుమార్ యాదవ్‌తో పాటు వచ్చిన తన పిల్లలతోనూ మోడీ చక్కగా సంభాషిస్తూ కనిపించారు. అలాగే సూర్య కూతురు పాటపాడుతుంటే, దానికి మురిసిపోతూ ప్రధాని చప్పట్లు కొడుతున్న దృశ్యాల వీడియోలు సోషల్ మీడియాలో నిమిషాల్లోనే వైరల్ అయ్యాయి.


మంటల్లో దగ్ధమవుతున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

అమృత్‌సర్, నవంబరు 6: పంజాబ్ నుంచి బిహార్ వెళ్తున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరే గాయి. పంజాబ్‌లోని పటియాలా జిల్లా రాజ్‌పురా సమీపంలో ఉన్న సరాయ్ వంజారా గ్రామం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రైలు ప్రయాణి స్తున్నసమయంలోనే ఒక్కసారిగాపొగలు, మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు తీవ్ర భయాందో ళనకు గురై ప్రాణభయంతో అటూ ఇటూ పరుగులు తీశారు.
రైలును వెంటనే నిలిపివేసి ప్రయాణి కులంతా సురక్షితంగా కిందకు దిగిపోవ డంతో ఎవరికీ ఎలాంటి గాయాలుకాలేదని, అందరూ సురక్షితంగా ఉన్నా రని అధికారులు వెల్లడించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు ఐదు బోగీలు మంటల్లో తగులబడినట్లు తెలుస్తోంది. రైలులోని ప్యాంట్రీ కార్ నుంచే మొదట మంటలు ప్రారంభమై, ఆ తర్వాత పక్కనే ఉన్న ఇతర భోగీ లకు విస్తరించినట్లు పటియాలా డిప్యూటీ కమిషనర్ హిమాంశు అగర్వాల్ తెలిపారు. మంటలు చెలరే గిన వెంటనే ఫైర్ అలారంమోగడంతో ప్రయాణికు లందరూ సమయస్పూర్తితో వ్యవహరించి వెంటనే అప్రమత్తమయ్యారని ఆయన పేర్కొన్నారు. సమా చారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘ టనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

కొత్త సంస్థల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం : మంత్రి శ్రీధర్ బాబు

ప్రిసమ్మిట్‌గా ఇండియన్ రోడ్ కాంగ్రెస్: మంత్రి కోమటి రెడ్డి

హైదరాబాద్,నవంబరు 6,ప్రభాతవార్త: తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచ స్థాయి పారిశ్రామిక సంస్థలకు ఆకర్షణీయమైన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.పికో టెక్నాలజీ ఇండియా ప్రధాన కార్యాలయాన్ని పిఐసిఒ ఫౌండర్ సీఈఓ జారోడ్ యస్టర్, ఎపిసిఒ సీతారాం,రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శుక్రవారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రారంభించారు.మంత్రి శ్రీధర్‌బాబుమాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణ వైపు చూసేలా రాష్ట్రంలో అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తూ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. కొత్త సంస్థల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమే కాకుండా యువతకు మెరుగైన భవిష్యత్తు అందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా గ్లోబల్ సమ్మిట్ పాలసీని తీసుకొచ్చామని, రాష్ట్ర పెట్టుబడుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలచిందని తెలిపారు. ఈ సారి డిసెంబర్ 7,8,9 తేదీల్లో హైదరాబాద్‌వేదికగా ఇన్వెస్ట్‌తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించను న్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు,పారిశ్రామిక దిగ్గజాలను తెలంగాణకు ఆహ్వానించి,రాష్ట్రంలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను పరిచయం చేసి పెట్టుబడులను ఆహ్వానించనున్నట్టు తెలిపారు. సినిమాటోగ్రఫి ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను పెట్టుబడుల,నూతన ఆవిష్కరణలకు,అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి ఐటీ,సాంకేతిక సంస్థలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, ప్రపంచస్థాయి కంపెనీలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకు రావడం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.పికో టెక్నాలజీ ఇండియా వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు.ఇలాంటి సంస్థల రాకతో తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పెట్టుబడుల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బాటలు పడతాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా,నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు,అత్యాధునిక సాంకేతికతకు అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నదే మా ప్రభుత్వ అని తెలిపారు.గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీసమ్మిట్ కార్యక్రమంగా ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

మెడికల్ షాపులపై మళ్లీ కొరడా

117 దుకాణాల లైసెన్స్ సస్పెన్షన్

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ఏర్పాటైన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మెడికల్ షాపులపై మరోసారి కొరడా ఝుళిపించింది. గత అక్టోబరు నెల 24 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేబట్టిన స్పెషల్ డ్రైవ్ దరిమిలా నకిలీ మందులు, నాణ్యతలేని మందులు, కాలం చెల్లిన మందులను విక్రయిస్తుండడంతో పాటు వైద్యుల సిఫార్సు లేకుండానే ఔషధాలు అమ్ముతున్న 117 మెడికల్ షాపుల లైసెన్స్‌లను సస్పెండ్ చేసింది. ఇందులో 84 దుకాణాల లైసెన్స్‌లను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మరో 33 దుకాణాలకు నిర్దేశిత కాల పరిమితి వరకు సస్పెండ్ చేశారు. దీంతో పాటు నాలుగింటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల మూడవ తేదీన 138 మెడికల్ షాపుల లైసెన్స్‌లను సస్పెండ్ చేయడం తెలిసిందే. ఇందులో 98 దుకాణాల లైసెన్స్‌లను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మరో 40 దుకాణాలకు నిర్దేశిత కాలపరిమితి వరకు సస్పెండ్ చేయడం, రెండింటికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం విదితమే. తాజాగా మరో 117 దుకాణాల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. దీంతో మూడు రోజుల వ్యవధిలో 255 మెడికల్ షాపుల లైసెన్స్‌లపై వేటుపడింది. కాగా మనుషుల ప్రాణాలు కాపాడాల్సిన ఔషధాల విషయంలో మెడికల్ షాపుల నిర్వాహకులు ఉదాసీనంగా వుంటే కఠినంగా వ్యవహరిస్తామని టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఈ సందర్భంగా హెచ్చరించారు.

కామారెడ్డి జిల్లాలో విషాదం

చెరువులో మునిగి తండ్రి, కూతురు మృతి

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: కామారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చెరువులో ప్రమాదవశాత్తు పడిన కుమార్తెను కాపాడబోయి తండ్రి కూడా నీట మునిగాడు. ఈ క్రమంలో తండ్రి, కుమార్తె ఇద్దరూ నీటిలో మునిగి మృత్యువాతపడ్డారు. కామారెడ్డి మండలం కోటాల్ పల్లిలోని గోరిగారి చెరువులో చోటుచేసుకుంది. కోటాల్‌పలి గ్రామానికి చెందిన సంకరి పెద్ద నర్సింలు (60), అతని కుమార్తె సోమిశెట్టి రజిత (40) శుక్రవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో రజిత ప్రమాదవశాత్తు చెరువులో జారిపడింది. గమనించిన తండ్రి ఆమెను కాపాడేందుకు వెంటనే నీటిలోకి దిగాడు. అయితే, కుమార్తెను రక్షి ంచే ప్రయత్నంలో నర్సింలు కూడా నీటిలో మునిగిపోయాడు. దీంతో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి, తండ్రి, కుమార్తె మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోలీసులు మృతదేహాలను కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అయ్యాక కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనతో కోటాల్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై దేవునిపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది?

విడాకులు తీసుకుని 14 యేళ్లు గడిచినా పవన్‌కల్యాణ్ మాజీ భార్యగానే చూస్తున్నారు

సినీనటి రేణుదేశాయ్



హైదరాబాద్, నవంబర్ 6,ప్రభాతవార్త: నటి రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. విడాకులు తీసుకుని 14 ఏళ్ల గడిచినా.. ఇప్పటికీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఇవ్వకుండా, పవన్‌కల్యాణ్ మాజీ భార్యగానే చూస్తున్నారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితం, ఎదుర్కొంటున్న విమర్శలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఓ ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు."తెలుగు వాళ్లందరికీ ఒక విషయం చెప్పాలి. "బద్రి" సినిమాతోనే నా జీవితం మొదలైందని చాలామంది అనుకుంటారు. అంతకుముందు నాకు ఎలాంటి జీవితమే లేనట్టుగా చూస్తున్నారు. మాకు విడాకులు వచ్చి 14 ఏళ్లు గడిచిపోయాయి. శ్రీరాముడు కూడా వనవాసం 14 ఏళ్లే చేశాడు. మరి నా వనవాసం ఎప్పుడు ముగుస్తుంది? అని ప్రశ్నించారు. విడాకుల తర్వాత తాను సాధించిన విజయాల గురించి మాట్లాడుతూ.. '2012లో విడాకులు మంజూరు అయ్యాక.. నేను ఒక మరాఠీ సినిమా నిర్మించాను. అది సూపర్ హిట్ అయింది. మరో సినిమాకు కథ రాసి, నిర్మించి, దర్శకత్వం కూడా వహించాను. డ్యాన్స్ షోలకూ వర్క్ చేశాను. కవితలూ రాశాను. ఇప్పుడూ సినిమాల్లో నటిస్తున్నాను. నాకంటూ ప్రత్యేక వ్యక్తిగత గుర్తింపు లేకపోతే నాకు ఈ అవకాశాలు ఎందుకు వస్తాయి' అని అన్నారు. ఇక సోషల్ మీడియాలో విమర్శలపై స్పందిస్తూ.. 'నేను కుక్కను కాపాడినా నన్ను తిడుతున్నారు. ఆయన లేకపోతే ఆమెకు జీవించే అర్హతే లేదు అన్నట్లుగా మాట్లాడుతారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రేణూ దేశాయ్ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నటి ప్రగ్యాజైస్వాల్ తదితరులు

వైభవోపేతంగా దిల్‌సుఖ్‌నగర్ వేగా జ్యుయెలర్స్

నూతన షోరూమ్ ప్రారంభం

సందడి చేసిన ప్రముఖ సినీనటి ప్రగ్యాజైస్వాల్

హైదరాబాద్ (ఎల్.బి.నగర్), నవంబరు 6, ప్రభాతవార్త: ప్రముఖ ఆభరణాల సంస్థగా పేరొందిన వేగా జ్యువెలర్స్ తమ నూతన షోరూంను నగరంలోని దిల్ సుఖ్ నగర్ చైతన్యపురిలో శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. వేగా జ్యువెలర్స్ ప్రచారకర్త, సంస్థకు అత్యంత ఆత్మీయులు నందమూరి బాలకృష్ణ (బాలయ్య బాబు) శుభాశీస్సులతో నూతన షోరూంను ప్రముఖ సినీ నటి ప్రగ్యా జైస్వాల్ ప్రారంభించారు. నూతన షోరూం ప్రారంభోత్సవం కార్యక్రమంలో చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరక్టర్ నవీన్ వనమా, ఎగిక్యూటివ్ డైరక్టర్ సుధాకర్ వనమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఇది 7వ షోరూం అని, హైదరాబాద్ నగరంలో రెండవదని తమ ఖాతాదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టామని చెప్పారు. ప్రారంభోత్సవ శుభ సందర్భంగా బంగారు ఆభరణాలు వేస్టేజీ 2.99 శాతం నుంచి 11.99 శాతం వరకు ఉంటుందని, తయారీ (మేకింగ్) చార్జీలు ఉండవని తెలిపారు. వజ్రాల ఆభరణాల క్యారట్ ధర రూ.47,999 ఉంటుందని, ఈ ప్రత్యేక ఆకర్షణీయమైన ఆఫర్లు 6 నవంబర్ నుంచి 30 వరకు మాత్రమే ఉంటుందన్నారు.

నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా అద్భుతమైన మెగా గోల్డ్ లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని మొత్తం 100 మంది విజేతలకు ఒక్కొక్కరికి 5 గ్రాముల 24 క్యారట్ బంగారం చొప్పున మొత్తం 500 గ్రాముల బంగారం విజేతలకు అందించనున్నామన్నారు.ఈ నూతన షోరూమ్లో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త డిజైన్లతో కూడిన బంగారు, వజ్రాభరణాలు, సంప్రదాయ , ఆధునిక నగల కలెక్షన్లు అందుబాటులో ఉంచామని, బంగారు, వజ్రాభరణాల కొనుగోలుపై ప్రత్యేక ప్రయోజనాలు, ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ,ఇతర ప్రత్యేక ఆఫర్లు తెలుసుకుని, అందరు ఈ సువర్ణ అవకాశం వినియోగించుకోవాలన్నారు. వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సందర్భాలకు తగిన విభిన్నమైన ఆభరణాల కలెక్షన్లతో వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించడమే తమ లక్ష్యమన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, ఆభరణాల ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వేగా జ్యువెలర్స్ నూతన షోరూమ్ ను సందర్శించి ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లను పొందాలని సంస్థ రాబోయే వివాహాల సీజన్ కొరకు ప్రత్యేకమైన డిజైన్స్ లో అపురూపమైన బ్రైడల్ కలెక్షన్స్ ఈ ఆఫర్ కాలంలో అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

కామారెడిడ్డి ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్

ఐదుగురు కార్మికులకు తీవ్రగాయాలు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: కామారెడ్డి జిల్లాలో పారిశ్రామిక ప్రమాదం కలకలం రేపింది. భిక్కనూరు శివారులో ఉన్న ఎంఎస్‌ఆర్ ఫార్మా కంపెనీలో శుక్రవారం ఉదయం రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భిక్కనూరు శివారులో ఉన్న ఎంఎస్ ఆర్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో భారీ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కంపెనీలో పనిచేస్తున్న ఐదుగురు కా ర్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి కార్మికులు గాయ పడటంతో కంపెనీ ప్రాంగణంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చి చికిత్స మొదట స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఐదుగురిలో ముగ్గురు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కాగా, మరో ఇద్దరు స్థానికులుగా గుర్తించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు వైద్యులు, అధికారులు వారిని హైదరాబాద్‌కు తరలించారు. అయితే గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

పోలీసుల ఆరోగ్య భద్రతకు ఫిట్‌కాప్ యాప్ ఏర్పాటు

హెల్పింగ్‌హ్యాండ్ ఫౌండేషన్ సభ్యులతో డిజిపి ఆనంద్ భేటీ

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్ర పోలీసు సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు కొత్తగా ఫిట్ కాప్ యాప్ పేరిట మరో పథకం అమలు కానుంది. ఇందుకు సంబంధించి డిజిపి ఆనంద్ శుక్రవారం తన కార్యాలయంలో ఈ పథకం అమలుకు సహకరిస్తున్న హెల్పింగ్ ఫౌండేషన్ సహా మరికొందరు ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ నిరంతర విధులు, పని ఒత్తిడి కారణంగా పోలీసులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, పోలీ సులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సమర్థవంతంగా చేయగలరని అన్నారు. ఇందు కోసం పోలీసుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఫిట్ కాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు, దీనికి హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహా ఇతర సంస్థలు సహకరిస్తున్నాయని ఆయన తెలిపారు. పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్ట ఏర్పాటు చేసిన ఈ విధానం ప్రత్యేక యాప్ ఆధారంగా రూపొందించామని ఆయన తెలిపారు. ఈ యాప్‌లో ఎనిమిది ప్రధాన ఆరోగ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలతోపాటు వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసే అవకాశం కల్పించామని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 90 వేల మందికి పై గా పోలీసు సిబ్బంది తమ సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా వివరాలు నమోదు చేసుకోవచ్చని డిజిపి తెలిపారు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్, ఇతర ఆరోగ్య సమస్యలు, జీవనశైలి అలవాట్లు, శారీరక శ్రమ, ధూమపానం, మద్యపానం వంటి అంశాలపై ఈ యాప్ ద్వారా సమాచారం సేకరిస్తారని. ఈ వివరాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా గుర్తిస్తారని ఆయన తెలిపారు. ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్ సెంటర్ ద్వారా సంబంధిత సిబ్బందికి ఫోన్ ద్వారా అప్రమత్తం చేస్తామని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఫౌండర్ సల్మాన్ వివరించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రుల ద్వారా చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అంది ంచేలా చర్యలు తీసుకుంటారు. కిడ్నీ సంబంధిత సమస్యలు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఈ విధానం ఉపయోగపడు తుందని డిజిపి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ సజ్జన్నర్, అదనపు డిజి అకున్ సబర్వాల్, క్రీడల విభాగం ఐజి గజరావు భూపాల్, భద్రత అండ్ ఆరోగ్య భద్రత సెక్రెటరీ ఉదయ్‌కుమార్ రెడ్డి, టి స్పార్క్ ఎస్పీ రూపేష్, ఎస్పీ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం హెల్పింగ్ ఫౌండేషన్ సహా మరికొందరు ప్రతినిధులతో మాట్లాడుతున్న డిజిపి సివి ఆనంద్

మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం దీపావళి కానుక

రూ.8,500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ.4,000కు తగ్గింపు: మంత్రి పొన్నం



హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యం తీసుకుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ప్రయాణ ఖర్చుల భారం తగ్గించి, ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో ప్రజా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజు వారి మెట్రో, ఆర్టీసి ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.275కు తగ్గించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో రూ.200 మెట్రో ప్రయాణానికి, రూ.75 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుందని వివరించారు. అదేవిధంగా ప్రస్తుతం రూ.8,500లుగా ఉన్న నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను ఏకంగా రూ.4,000కు తగ్గించినట్లు తెలిపారు. ఇందులో రూ.3,000 మెట్రో ప్రయాణానికి, రూ.1,000 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పాస్ ద్వారా నెలలో గరిష్టంగా 50 సింగిల్ ట్రిప్పులకు అనుమతి ఉంటుందని వెల్లడించారు.ఆర్టీసీ బస్సులో ప్రయాణానికి ఎలాంటి పరిమితులు లేవని తెలిపారు. ఈ ధరల తగ్గింపుతో నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతుందని, సాధారణ ఉమ్మడి పాస్ వినియోగదారులకు రూ.125 ఆదా అవుతుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన తగ్గింపు ధరలు ఈ నెల 8వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత సంస్థలను ప్రభుత్వం ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఊరటనిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

81.12 లక్షల విద్యుత్ సర్‌చార్జిపై డిస్కంకు ఊరట

మార్గదర్శి పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త :విద్యుత్ ఉత్పాదక సంస్థ నుండి తీసుకున్న విద్యుత్‌పై క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ కింద రూ.81.12 లక్షల డిమాండ్‌ను సవాలు చేస్తూ మార్గదర్శి చిట్ ఫండ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. సంప్రదాయేతర ఇంధన ఉత్పాదక సంస్థలు మూడవ పక్షాలకు విద్యుత్‌ను విక్రయించడానికి అనుమతిస్తూ 1997, 1998లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను, క్రాస్ సబ్సిడీ నుండి మినహాయింపు కోరేందుకు విద్యుత్ (సరఫరా) చట్టం, 1948లోని సెక్షన్ 43తి(1) కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరును సమ్మతిగా పరిగణించలేమని జస్టిస్ నాగేష్ భీమపాక పేర్కొన్నారు. 2005-06 నుంచి 2014-15 ఆర్థిక సంవత్సరాలకు గాను క్రాస్ సబ్సిడీ కింద రూ.81,12,110 కోరుతూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ గత ఏడాది జనవరి 31న జారీ చేసిన డిమాండ్ నోటీసును మార్గదర్శి సవాలు చేసింది.

మార్గదర్శి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కె. గోపాల్ చౌదరి, తమ కంపెనీ మెస్సర్స్ సుధా ఆగ్రో అండ్ కెమికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నుండి విద్యుత్‌ను కొనుగోలు చేసిందని, పాత నియంత్రణ చట్రం ప్రకారం మూడవ పక్షానికి విద్యుత్ అమ్మకాలు చేపట్టడానికి ఆ సంస్థకు అధికారం ఉందని వాదించారు. విద్యుత్ (ఇబ్బందుల తొలగింపు) రెండవ ఉత్తర్వు ప్రకారం అటువంటి వినియోగదారులకు క్రాస్ సబ్సిడీ చెల్లింపు నుండి మినహాయింపు ఇచ్చిందని వాదించారు. అయితే, మార్గదర్శి ఆధారపడిన ప్రభుత్వ ఉత్తర్వులు కేవలం సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహకాలను మాత్రమే అందించాయని, 1948 చట్టంలోని సెక్షన్ 43 తి(1) కింద అవి సమ్మతిగా పరిగణించబడవని విద్యుత్ పంపిణీ సంస్థ వాదించింది. ప్రతివాదుల వాదనను అంగీకరిస్తూ, సదరు నిబంధన ప్రకారం అవసరమైన నిర్దిష్ట సమ్మతి తమ విద్యుత్ ఉత్పాదక సంస్థ వద్ద ఉందని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని కోర్టు పేర్కొంది. మార్గదర్శి అటువంటి సమ్మతిని అధికారుల ముందు గానీ, హైకోర్టు ముందు గానీ సమర్పించడంలో విఫలమయ్యారని కూడా కోర్టు గమనించింది. తదనుగుణంగా, కోర్టు రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది.

నకిలీ తాళంచెవితో ఇంట్లో దొంగతనం

నిందితుడి అరెస్ట్.. పరారీలో మరో నిందితుడు

రూ.లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

నేరెడ్‌మెట్, నవంబరు 6, ప్రభాతవార్త : నకిలీ తాళంచెవితో తాళంవేసి ఉన్న ఫ్లాట్‌ను తెరిచి భారీగా బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలను అప హరించిన ఇంటిదొంగతనం కేసును నేరెడ్‌మెట్ పోలీసులు ఛేదించారు. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాల దృశ్యాలు, నిరంతర దర్యాప్తుతో ఒక నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి 429.92 గ్రాముల బంగారు ఆభరణాలు, 2,974 గ్రాముల వెండి వస్తువులు, ముత్యాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మల్కాజ్‌గిరి జోన్ డిసిపి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసించే మనె పద్మావతి ఈ నెల 20న తన పనిమనిషితో కలిసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. ఇదేఅదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ తాళం చెవితో ఫ్లాట్ తాళం తెరిచి లోపలికి ప్రవేశించి 556 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.9 కిలోల వెండి వస్తువులు, ముత్యాల ఆభరణాలను అపహరించారు. ఈ ఘటనపై బాధితురాలు అక్టోబరు 21న ఫిర్యాదు చేయడంతో నేరెడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఈ నెల 5న తిరుమలగిరి సమీపంలో కారులో వేచి ఉన్న రేగుల చంద్రశేఖర్(31)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తన సహచరుడు షాజీతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. మరో నిందితుడు షాజీ పరారీలో ఉన్నాడు.చోరీ సొత్తు విక్రయించిన నిందితుడుచోరీ చేసిన బంగారంలో సుమారు 13 తులాలను గుంటూరులో, మరో 25 తులాలను హైదరాబాద్‌లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మిగిలిన సుమారు 18 తులాల బంగారాన్ని తన వద్ద ఉంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి ప్రస్తుతం 429.92 గ్రాముల బంగారం, 2,974 గ్రాముల వెండి వస్తువులతో పాటు ముత్యాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజలకు ఉపయోగపడే సాహిత్యానికే సార్థకత

తెలుగు అకాడమీ సంచాలకుడు ఆచార్య భట్టు రమేష్

వైభవంగా తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం



తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కార గ్రహీతలతో భట్టురమేష్, నిత్యానందరావు, హనుమంతరావు తదితరులు

హైదరాబాద్ (నాంపల్లి), నవంబరు 6, ప్రభాతవార్త : సమాజంలో ప్రజలకు ఉపయోగపడే సాహిత్య రచనలకే పేరు ప్రఖ్యాతులు, సార్థకత చేకూరుతుందని తెలుగు అకాడమీ సంచాలకుడు, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అన్నారు. గతంలో సాహితీ ప్రక్రియలు నిర్దిష్ట భాషా ప్రాతిపదికన కొనసాగేవని, బిరుదురాజు రామరాజు తర్వాతితరం రచయితలు సమకాలీన అంశాలపై పరిశోధనలు జరిపి వాటిని సమాజానికి అందిస్తున్నారని తెలిపారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఆవరణలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో విశ్వవిద్యాలయ విస్తరణ సేవావిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో ఆచార్య నిత్యానందరావు తెలుగు సాహిత్యంలో విశేష కృషిచేసిన ప్రముఖులను సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆచార్య కోట్ల హనుమంతరావు 1986లో ప్రారంభమైన సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఇప్పటివరకు 400మంది ప్రముఖ సాహితీవేత్తలను సగౌరవంగా సన్మానించినట్లు పేర్కొన్నారు. తెలుగు భాషా సాహిత్యరంగాల్లో విశేష కృషిచేసిన రచయితలను గుర్తించి గౌరవించే సంప్రదాయాన్ని విశ్వవిద్యాలయ కొనసాగిస్తోందని చెప్పారు. అనంతరం ఆచార్య భట్టు రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆత్మీయ అతిథి ఆచార్య కోట్ల హనుమంతరావుతో కలిసి 2025 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఎంపికైన ఉత్తమ గ్రంథాల రచయితలకు సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో పద్యకవితా ప్రక్రియల్లో దోరవేటి–దోస్తానా; వచన కవితలో బాణాల శ్రీనివాసరావు– రిత్రి సింఫణి; బాలసాహిత్యంలో పుల్లా రామాంజనేయులు– స్వర్ణగిరి కథలు; నవలలో చింతకింది శ్రీనివాసరావు–మున్నీటి గీతలు; సాహిత్య విమర్శలో ఏల్చూరి మురళీధరరావు–వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు; నాటకంలో కెకెఎల్.స్వామి–కొత్త పరిమళం; అనువాదంలో కోడిహళ్లి మురళీమోహన్– పోరాటపథం; వచన రచనలో డా. వి.వి. వెంకటరమణ–వావిళ్ల సాహితీ వికాసం; రచయిత్రి ఉత్తమ గ్రంథంలో ధూళి పాళ అరుణ–జ్ఞాపకాల సంతకం ఉన్నారు. పురస్కార గ్రహీతలను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116నగదు బహుమతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళి పండగ భద్రతా ఏర్పాట్లపై ఫైర్ సర్వీస్ డిజి సమీక్ష

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్రంలో దీపావళి పండగ సందడి మొదలవడంతో భద్రతకు సంబంధించి ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్ శుక్రవారం నాడు తన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పండగ సమయంలో ప్రజలు తీసుకో వాల్సిన భద్రత గురించి ఆయన పలు సూచనలు చేశారు. టపాసులు కాల్చే సమయంలో అందరు అప్రమత్తంగా ఉండాలని కోరారు. దీంతో పా టు పండుగ సమయంలో అగ్నిప్రమాదాల ముప్పును తగ్గించేందుకు, నిర్దేశించిన భద్రతా నిబంధనలు అమలయ్యేలా శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటుందని, ప్రజలు వీటికి సహకరించాలని ఆయన కోరారు. ప్రజలు బాధ్యతాయుతంగా దీపావళి జరుపుకోవాలని, అగ్నిమాపక భద్రతా జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు భద్రతా చర్యలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు.దీపావళి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్య క్రమాలు నిర్వహించామని, ఇందులో బాణసంచాను సురక్షి తంగా వినియోగించడం, వాటిని కాల్చే సమయంలో తీసుకోవాల్సి న జాగ్రత్తలపై వి ద్యార్థులకు వివరించామని ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో చిన్నారులకు బాణసంచా భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా అగ్నిప్రమాదా లు, గాయాల నివారణకు చర్యలు చేపట్టామని విక్రం సింగ్ మాన్ తెలిపారు. రాష్ట్రంలో బాణసంచా విక్రయాలకు సంబంధించి 7,601 లైసెను ్సలు జారీ చేశామని ఆయన తెలిపారు. బాణసంచాను లైసెన్స్ షాపుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో కాల్చాలని, తగినంత సురక్షి త దూరం పాటించాలని ఆయన సూచించారు. పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాల ని, సమీపంలో నీరు లేదా ఇతర అగ్నిమాపక ఏర్పాట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

గుడ్లతో తయారుచేసే మయోనైజ్‌పై నిషేధం పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: రాష్ట్రంలో పచ్చిగుడ్లతో చేసే మయోనైజ్‌పై నిషేధాన్ని మరో ఏడాదిపాటు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) కమిషనర్ అవినాష్ మొహంతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. యేడాది క్రితం హైదరాబాద్‌లో మయోనైజ్‌తో తయారైన మోమోలు తిని ఓ మహిళ మృతిచెందగా, పలువురు అస్వస్థతకు గురవడం తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. మయోనైజ్‌తో తయారైన ఆహార పదార్థాల వల్ల ఫుడ్ పాయిజన్ అయినట్టు నిర్ధారణ అవడంతో నాటి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దీనిని విక్రయించిన వారిని అరెస్టు చేశారు. దీని తరువాత మయోనైజ్‌పై ఏడాది పాటు నిషేధం విధించారు. తాజాగా ఈ నిషేధాన్ని మరో ఏడాది పొడిగించారు. అయితే పచ్చి గుడ్లతో తయారుచేసే మయోనైజ్ ఉత్పత్తి, విక్రయం మరియు నిల్వపై మాత్రమే ఈ నిషేధం వర్తిస్తుంది. అన్ని రకాల మయోనైస్‌లపై నిషేధం లేదని అధికారులు తెలిపారు.

గచ్చిబౌలి హోటల్‌లో అమెరికా వ్యాపారవేత్త అనుమానాస్పద మృతి

వ్యాపార పనుల నిమిత్తం నగరానికి వచ్చిన కాలిఫోర్నియా వాసి

హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 6, ప్రభాతవార్త: వ్యాపార పనుల నిమిత్తం నగరానికి వచ్చిన ఓ అమెరికా వ్యాపారవేత్త నగరంలోని ఓ హోటల్‌లో అనుమానస్పద స్థితిలో మ ృతిచెందాడు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన వ్యాపారవేత్త నగరంలోని గచ్చిబౌలిలో గల మారియాట్ హోటల్‌లో నివాసం ఉంటుండగా, గురువారం రాత్రి హోటల్ గదిలో నిర్జీవంగా పడి ఉన్న అతని మ ృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన మిచెల్ బ్రియాన్ లీ(41) తన వ్యాపార పనుల నిమిత్తం భారత్‌కు వచ్చాడు. తన స్నేహితుడు డేవిడ్ వుతో కలిసి ఈనెల 2వ తేదీ నుంచి గచ్చిబౌలిలోని హోటల్ మారియాట్ ఎక్జిక్యూటివ్ అపార్టుమెంటులో నివాసం ఉంటున్నాడు. కాగా ఈనెల 4వ తేదీ సాయంత్రం నుంచి మిచెల్ బ్రియాన్ ఫోన్‌లో కుటుంబ సభ్యులకు అందుబాటులోకి రాలేదు. దీంతో వారు భారత్‌లో ఉన్న అమెరికా దౌత్య కార్యాలయానికి సమాచారం అందించారు. వారు మారియాట్ హోటల్ నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించగా, గురువారం రాత్రి హోటల్ సిబ్బంది మిచెల్ బ్రియాన్ బస చేస్తున్న గది తలుపులు తెరిచి చూశారు. కాగా గదిలో కుర్చీలో కూర్చొని ఉన్న మిచెల్ బ్రియాన్ అసస్మారక స్థితిలో కనిపించడంతో వారు వెంటనే 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న 108 సిబ్బంది మిచెల్ బ్రియాన్‌ను పరిక్షించి అప్పటికే మ ృతిచెందినట్లు ద ృవీకరించారు. హోటల్ నిర్వాహకుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా మిచెల్ బ్రియాన్ మ ృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ సైదులు తెలిపారు.

ధాన్యం పండే రాష్ట్రంలోనే బియ్యం కొనలేని దుస్థితి

బియ్యం ధరలపై ఎమ్మెల్సీ విజయశాంతి ఆగ్రహం

హైదరాబాద్, నవంబరు 6,ప్రభాతవార్త: రాష్ట్రంలో పెరిగిన బియ్యం ధరలపై ఎమ్మెల్సీ విజయశాంతి ధర్మాగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం పండించే రాష్ట్రంలోనే బియ్యం కొనలేని దుస్థితి ఎందుకు వచ్చింది? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాములమ్మ అంతటితో ఆగలేదు 'పెరుగుతున్న ధరలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి' డిమాండ్ చేశారు. ఒకప్పుడు రూ.1,500 ఉన్న 25 కిలోల బియ్యం బస్తా ఇప్పుడు రూ.2,500కు ఎలా పెరిగింది?అని నిలదీశారు. కిలో సన్నబియ్యం ధర రూ.85 నుంచి రూ.100కు చేరడం ఆందోళనకరమని ఆవేదన చెందారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల విభాగం
నిట్ నెం. PA/DB/T1/08/2026-27, తేది: 04.11.2026
క్ర.సం.1, పని యొక్క పేరు: సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, హుస్నాబాద్ & చేర్యాలలో కోర్ట్ కాంప్లెక్స్‌కు (03) నం.ల వేర్వేరు వాష్‌రూమ్‌లు. అంచనా విలువ: రూ.60.50 లక్షలు. 1) బిడ్ దాఖలు ముగింపు తేది: 16.11.2026 మ.3.00 గం. వరకు. 2) సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యొక్క పేరు & చిరునామా: ది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్, సిద్దిపేట, సిద్దిపేట జిల్లా, ఫోన్: 9440818096. 3) తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్, సిద్దిపేట
DIPR.No.13228-PP/CL/Advt/1/2026-27, తేది: 06.11.2026

దూరదృష్టి లేని వ్యక్తి ఉన్నతాశయాలు సాధించలేడు. గొప్ప పనులు చేపట్టలేడు.

- ఉడ్రోవిల్సన్

నరక సంకేతం!

రాజధాని నగరానికి ఎప్పుడూ ఉన్న సంకటమే! ఇప్పుడు కాస్త ముందుగా పలుకరిస్తోంది...అంతే! ఏలిన వారు కూడా ఢిల్లీకాలుష్య నివారణకు ముందుగానే ప్రణాళికలు తలపెట్టారు.అయినా అనుకోనిఅవాంతరంమీదొచ్చి పడింది. ప్రతి ఏటా శీతాకాలం ఆరంభంలో రాజధాని ఢిల్లీ ఎదుర్కొనే వాయు కాలుష్య సంక్షోభం ఈసారి దీపావళి పండుగకు ముందే తీవ్రరూపం దాల్చింది. గాలి నాణ్యత సూచీ 387 పాయింట్లకు చేరుకోవడంతో రాజధాని నగరం అత్యంత ప్రమాదకరమైన తీవ్ర ప్రమాదకరం స్థాయిలోకి అడుగుపెట్టింది. దీపావళి టపాసుల కాల్పులు ప్రారంభం కాకముందే ఈ స్థాయి కాలుష్యం నమోదు కావడం నగరంలో నెలకొన్న పర్యావరణ అత్యవసర స్థితికి స్పష్టమైన నిదర్శనంగా భావించాలి. గాలి నాణ్యత సూచీ 050 మధ్య ఉంటే సురక్షితమని, 300 దాటితే 400 దాటితే 'తీవ్ర ప్రమాదకరం' అని వర్గీకరిస్తారు. ఢిల్లీలోని జహంగీర్ పురి,రోహిణి వంటి పలు లొకేషన్లలో కయూఐ ఇప్పటికే 400మార్కునుదాటింది. వాయువులో తేలియాడే అత్యంత సూక్ష్మ ధూళి కణాలు (పి.ఎం2.5) ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్దేశించిన క్షేమకరమైన పరిమితుల కంటే 25నుండి 30రెట్లు ఎక్కువగా నమోదవుతున్నాయి.పండుగ సమయానికి ముందే గాలి నాణ్యత పడిపోవడానికి పొరుగున ఉన్న పంజాబ్, హర్యానా వ్యవసాయ క్షేత్రాలలో వరి కోతల అనంతరం రైతులు మిగిలిన పంటవ్యర్థాలను పెద్దఎత్తున తగటబెట్టడంతో వెలువడే పొగ ఢిల్లీ వాతావరణంలోకి వేగంగా చేరుతోంది. శీతాకాలంలో చల్లని గాలులవల్ల ఉష్ణోగ్రతల వ్యత్యాసం ఏర్పడుతుంది. గాలి వేగం 1గంటకు వేగం కిలోమీటర్‌కు పడిపోవడం, వెంటిలేషన్ ఇండెక్స్ తగ్గడం వల్ల కాలుష్య కణాలు గాలిలో కొట్టుకుపోకుండా దిగువ పొరల్లోనే నిలిచిపోతున్నాయి. కొత్తగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు. పండుగ 2 రోజులకు గ్రీన్ క్రాకర్స్ ను అనుమతించారు. ఇది శీతాకాలంలో ఢిల్లీ ఎదుర్కొనే వాయు సంక్షోభానికి సంపూర్ణ పరిష్కారం కాదు, కేవలం నష్ట నివారణ మార్గంమాత్రమే. పంట వ్యర్థాల కాల్చివేత ,వాహన కాలుష్యం తగ్గడంతో పాటు, గ్రీన్ క్రాకర్స్ వినియోగం సమర్థవంతంగా అమలైతేనే ఢిల్లీ పౌరులకుకొంత ఊరట లభిస్తుంది.కానీ పరిస్థితి అలా కన్పించడం లేదు. పండుగ కొనుగోళ్ల వేళ పెరిగిన ట్రాఫిక్ నిరోధం, పారిశ్రామిక పొగ, నిర్మాణ రంగధూళి కణాలు స్థానికవాయు కాలుష్యాన్ని మరింత పెంచుతున్నాయి. శ్వాసకోశ వ్యాధులు (ఆస్తమా, బ్రోంకిటిస్), కళ్లమంటలు, గుండెజబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రతికూల ప్రభావం. పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం. ఢిల్లీ వాయు కాలుష్యం అనేది కేవలం శీతాకాలంలో ఒక నెల రోజులు చర్చించి వదిలేసే తాత్కాలిక సమస్య కాదు. ఇది తీవ్రమైన ప్రజాఆరోగ్య సంక్షోభం. పండుగలకు ముందే సూచీ 387 కి చేరిందంటే మన పర్యావరణ విధానాలలో స్పష్టమైన లోపాలున్నాయని అర్థం. తక్షణ చర్యలతో పాటు ప్రాంతీయ సమగ్ర వ్యూహం ద్వారా మాత్రమే మన పౌరులకు స్వచ్ఛమైన గాలిని అందించడం సాధ్యమవుతుంది. ఢిల్లీలోని ప్రధాన ఆసుపత్రులలో నెబ్యులైజేషన్, ఆక్సిజన్ సపోర్ట్ అవసరమయ్యే ఓపిడి రోగుల సంఖ్య సగటున30 నుండి 40 పెరిగింది. వాయు కాలుష్యం కారణంగాపని సామర్థం తగ్గడం, వైద్య ఖర్చులు పెరగడం, పర్యాటక రంగం దెబ్బతినడం వల్ల జాతీయ రాజధాని ప్రాంతానికి ఏటా బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోంది. ఢిల్లీ ప్రాంతంలో ప్రతి ఏటా పెరుగుతున్న వాయు కాలుష్య నివారణలో భాగంగా సాంప్రదాయ టపాసులకు ప్రత్యామ్నాయంగా గ్రీన్ క్రాకర్స్ వినియోగిస్తారు. కేంద్ర పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ వీటిని అభివృద్ధి చేసింది. గ్రీన్ క్రాకర్స్ కాలుష్యాన్ని తగ్గిస్తాయి, కానీ సంపూర్ణంగా నివారించవు. సుప్రీంకోర్టు ఇటీవల పండుగ వేళ సమయ పరిమితులతో కూడిన అనుమతులు ఇచ్చినప్పటికీ, సాంప్రదాయ టపాసులతో పోలిస్తే గ్రీన్ క్రాకర్స్ కొంతవరకైనా ఊరటనిస్తాయి. సాధారణ టపాసుల నుంచి వెలువడే అత్యంత ప్రమాదకరమైన ధూళి కణాలు (పిఎం 2.5, పిఎం 10) పొగలో 30వరకు తగ్గింపు ఉంటుంది.పర్యా వరణానికి మరియు శ్వాసకోశ వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగించే బేరియం నైట్రేట్, అల్యూమినియం వంటి ప్రమాదకర రసాయనాలను గ్రీన్ క్రాకర్స్లో వాడరు. శబ్ద తీవ్రతను సాధారణంగా 125 డెసిబెల్స్ కంటే తక్కువ ఉండేలా నియంత్రిస్తారు. ఆస్తమా, దీవీశిదీ, ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, చిన్న పిల్లలకు గ్రీన్ క్రాకర్స్ పొగ కూడా హాని కలిగిస్తుంది. అయితే సాంప్రదాయ టపాసుల వల్ల వచ్చే తీవ్ర కళ్ల మంటలు, శ్వాస ఆడకపోవడం వంటి అత్యవసర సమస్యల తీవ్రతను ఇది కొంతవరకూ నిరోధించగలదు. ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్లు, విద్యాసంస్థలు వృద్ధాశ్రమాలకు 300 మీటర్ల పరిధిలోని ప్రాంతాలను'నోక్రాకర్ జోన్లు'గా ప్రకటించి, అక్కడ ఎలాంటి టపాసులు కాల్చకుండా ఆంక్షలు విధించింది. గ్రీన్ క్రాకర్లు వాయు కాలుష్యాన్ని దాదాపు 30 వరకు తగ్గిస్తాయి. ఇవి కాలుష్య రహితం కావు అని, ఇప్పటికే నగరంలో వాయు నాణ్యత అత్యంత క్షీణించిన పరిస్థితులలో పరిమిత వినియోగం మాత్రమే సురక్షితమని కోర్టు అభిప్రాయపడింది. గ్రీన్ క్రాకర్లు ఢిల్లీ వాయు సంక్షోభానికి శాశ్వత పరిష్కారం కావు. కానీ, అక్రమ సాధారణ టపాసుల వినియోగాన్ని అరికట్టే నిరోధక సాధనంగా తాత్కాలిక నష్ట నివారణ చర్యగా ఉపయోగపడతాయి. కాలుష్యాన్ని అదుపులోకి తెచ్చేందుకు పంట వ్యర్థాల నివారణ, వాహన కాలుష్య నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

రాక్షసత్వాన్ని మించిన ఉన్మాదం!

రాజకీయ అండ, ధనబలం ఉంటే ఎంతటి నేరం చేసి అయినా బయటపడవచ్చుననే నమ్మకం పెరిగిపోతున్నది. ఈ పరిస్థితి మారాలి. ముందుగా అధికార వర్గాల్లో మార్పు రావాలి. అందుకు కొంత ధైర్యం కావాలి. రాజకీయ ఒత్తిడిలకు లొంగని దృఢచిత్తం ఉండాలి. ఇప్పుడున్న అధికారుల్లో ఎంత మందికి ఈ లక్షణాలున్నాయి? ఈ నేరాలే కాదు హత్యలు, ప్రమాదాలు, ఘర్షణలకు మద్యం, మాదకద్రవ్యాల వినియోగం మరొక కారణంగా చెప్పచ్చు. ఢిల్లీలో జరిగిన నిర్భయ ఉదంతంతోపాటు దేశంలో జరుగుతున్న మానభంగాలు, హత్యలు తదితర ఘరానా నేరాల నిందితుల్లో అధికశాతం ఈ మత్తులో ఉన్నవారేననే విషయం తెలియంది కాదు. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. పోలీసుశాఖలో మితిమీరిపోతున్న రాజకీయ జోక్యానికి కొంతవరకైనా పుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేయాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగిననాడు ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, మరెన్ని పథకాలు అమలు చేసినా అరాచకం ప్రబలి నిరుపయోగం అవుతాయనే విషయం విస్మరించరాదు.

దామెర్ల సాయిబాబ

చదువు సంధ్యలు పెరిగే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పురావాలి. సంస్కారం, సభ్యతలు మరింత పెరగాలి. సాంకేతికాభివృద్ధి చెంది విజ్ఞానం ఆర్జించే కొద్దీ మంచి ఏదో, చెడు ఏదో గ్రహించే విచక్షణజ్ఞానం పెరగాలి. కానీ దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నదేమోననిపిస్తున్నది. జరిగిన, జరుగుతున్న సంఘటనలు ఆవేదనే కాదు, ఆందోళన కలిగిస్తున్నాయి.మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులు సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్నాయి. గత శనివారం ఆంధ్రప్రదేశ్, అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సంఘటన తీవ్రదిగ్భ్రాంతికి గురి చేసింది. రాప్తాడు మండలం అయ్యవారి పల్లెకు చెందిన గోపిక అనే బాలిక రోజుమాదిరే పాఠశాలకు వెళ్లి తరగతిలో కూర్చొని ఉపాధ్యాయురాలు చెప్పున్న పాఠాన్ని శ్రద్ధగా వింటున్న సమయంలో వరుసకు బాబాయ్ అయ్యే హేమంత్ (20) ఒక్కసారిగా ఎలక్ట్రిక్ రంపంతో లోపలికి ప్రవేశించి కర్కశంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక ముఖం, తల, వీపు భాగాలపై లోతైన రంపపు కోతతో లోతైన గాయాలయ్యాయి. ప్రత్యక్షంగా తరగతి గదిలోనే జరుగుతున్న ఈ దారుణాన్ని చూసి పిల్లలతోసహా ఉపాధ్యాయురాలు ఒక్కసారిగా నిశ్చేష్టులై భయాందోళనకు గురయ్యారు. అయితే పక్కనే ఉన్న లక్ష్మి అనే బాలిక ఈ దారుణ సంఘటనను చూసి చెలించి అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయితే ఆమెపై కూడా ఆ రాక్షసుడు దాడికి తెగబడడంతో రెండు కాళ్లకు గాయాలయ్యాయి. రక్తపు మడుగులో మృత్యువుతో తరగతి గదిలోనే కొట్టుమిట్టాడుతున్న ఆఇద్దరు బాలికలను స్థానికులు, ఉపాధ్యాయులు కలిసి అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి బెంగళూరుకు తరలించగా మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అయితే ఈ దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్ నేరప్రవృత్తి ఉన్నవ్యక్తిగా చెప్తున్నారు. గతంలో రాప్తాడులోనే ఉన్న బాలుర వసతి గృహంలో ఉన్న విద్యార్థులపై దాడి చేయడంతో పోలీసులు హెచ్చరించి వదిలిపెట్టినట్లు చెప్తున్నారు. ఈ బాలిక వెంటపడి వేధింపులకు గురి చేస్తున్న విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు హేమంత్‌ను గట్టిగా మందలించారు. కూతురు వరుస అవుతుందని హెచ్చరించినట్లు ఈ సంఘటన తర్వాత వివరిస్తూ ఇంతటి ఘోరానికి పాల్పడతాడని అనుకోలేదని బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సంఘటన తర్వాత పరారైన హేమంత్ కొరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలుచేపట్టారు. అయితే ఆత్మకూరు సమీపంలో అడవిలో ఉన్నట్లుఆదివారం సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు చెట్ల పొదల్లో దాక్కున్న నిందితుడిని పోలీసులు పట్టుకునే క్రమంలో ఇనుప ముక్కతో రాప్తాడు సిఐపై దాడికి యత్నించినట్లు పోలీసు వర్గాలు వివరించాయి. ఈ క్రమంలో లొంగిపోవాలని హెచ్చరిస్తూ పోలీసులు మొదట గాలిలో కాల్పులు జరిపినా ఎదురుదాడి చేయడంతో ఆత్మరక్షణ కోసం నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపినట్లు పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఆరు బుల్లెట్లు రెండు మోకాళ్ల కింది భాగంలో దూసుకుపోవడంతో గాయపడ్డాడు. ఆతర్వాత శస్త్రచికిత్స చేసికుడికాలు తొలగించారు. ఎడమ కాలుకు చికిత్స అందిస్తున్నారు. ఏదిఏమైనా మాటల్లో వర్ణించలేని పైశాచికత్వం ఇది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు మానవ సమాజాన్ని దిగ్భ్రాంతిపరిచిన ఉదంతమిది. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.తనకు పరిచయం ఉన్న యువతికి మరొకరితో పెళ్లి కుదిరిందని పగతో ఇటీవల రాజమండ్రిలో ఒక యువకుడు ఆమె గొంతు కోసి హతమార్చాడు. కర్ణాటకలో

ఒక్క మాట


మరో నరరూప రాక్షసుడు తన ప్రేమను నిరాకరించిందని కత్తితో పొడిచి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమె మెడలో తాళి కట్టాడు. తనతో మాట్లాడడం లేదని కక్షతో ఒక ఉన్మాది జంగారెడ్డి గూడెంలో ప్రాణం తీశాడు. రాప్తాడులో జరిగిన సంఘటనతో ఒక్కసారిగా సమాజం ఉలిక్కిపడింది. ఏమిటిది? ఈ దారుణాలను నిరోధించలేమా? ఇవి నిరాటంకంగా జరగాల్సిందేనా? ఇంకా ఎంత మంది బలికావాలి? తదితర ప్రశ్నలకు జవాబులు లేకుండానే మిగిలిపోతున్నాయి. ఎంతోమంది అమాయక యువతులు బలైపోతున్నారు. రక్తాన్ని పంచి పెంచిన బిడ్డలు ఇలా అర్థరహిత ఉన్మాదానికి బలైతే ఆ తల్లుల గర్భశోకాన్ని తీర్చేదెవరు? ఏమిచ్చి ఓదార్చగలరు? ఇక వేధింపుల పర్వం గురించి చెప్పాల్సిన పనేలేదు. రానురాను ఈ విషసంస్కృతి పెరిగిపోతుందనేందుకు జరుగుతున్న సంఘటనలు అద్దంపడుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపైవేధింపులకు అంతేలేకుండా పోతున్నది. చాలా వరకు అవి పోలీసు రికార్డుల్లోకి ఎక్కడం లేదు. సంఘట నలు జరిగి ప్రాణంపోయినప్పుడో, గాయపడినప్పుడో తప్ప పోలీసుల దృష్టికివెళ్లడం లేదు. ఇప్పుడు గోపిక విషయంలో కూడా అదే జరిగింది. ఏ యువతితాను వేధింపులకు గురవుతున్నానని పోలీసు స్టేషన్ మెట్లెక్కి ఫిర్యాదు చేయడానికి సాహసించడం లేదు. పోలీసులు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబు చెప్పడం, సాక్ష్యాలతో రుజువు చేయడం సాధ్యమయ్యేపనికాదని ఒకవేళ అన్ని సమకూర్చినా వారుతీసుకునే చర్యలతో ఈ వేధింపులు ఆగిపోతాయని ఏ ఆడపిల్ల నమ్మేస్థితిలో లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అంతేకానీ వారి మీద విశ్వాసంతో కాదు. అందుకే చాలా వేధింపులు వెలుగు చూడడం లేదు. వేధింపులు భరించలేక అటు బయటకు చెప్పుకో లేక తమలో తాము కృంగికృషించి ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కోకొల్లలు. ఏదిఏమైనా మహిళలపై అఘాయిత్యాలకు మానభంగాలకు, బలత్కారాలకు, హత్యలకు, వెంటపడి వేధించే కీచకులు పెచ్చరిల్లిపోతున్నారు. వీరిని రాక్షసులతో పోల్చడం రాక్షసులకే అవమానం. మన పురాణాల్లో రాక్షసులు మహిళలను చెరబట్టిన మాట వాస్తవమే అయినా,చరిచిన దాఖలాలు లేవు.చంపిన సంఘటనలు కూడా లేవనే చెప్పొచ్చు. బతిమాలో, భంగపడో ఒప్పించడానికి ప్రయత్నించారే తప్ప శీలభంగానికి పాల్పడలేదు. ప్రాణాలు తీయలేదు. కొందరు యువకులు పాశ్చాత్య మోజులోపడి మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించి మంచిచెడులను పట్టించుకోకుండా, మద్యం, మాదకద్రవ్యాల మోజులో పడి జోగుతూ ఏం చేస్తున్నారో దిక్కుతెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సంఖ్య రానురాను పెరుగుతుండడం ఆందోళన కలిగించే పరిణామం. చేయరాని, చేయకూడని పనులు చేస్తూ పతనం అంచుకు చేరుకుంటున్నారు. అదే జీవితమనే భ్రమలో పడివిహరిస్తూ సభ్యసమాజం తలవంచుకునేలా ప్రవర్తిస్తున్నారు. దీనిని నివారించాల్సిన బాధ్యత అటు పాలకులపైనే కాదు ఇటు సమాజంపైన కూడా ఉంది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచే విధంగా పోలీసుయంత్రాంగం వ్యవహరించాలి. పోలీసులపాత్ర ఎంతో కీలకమైంది. ఈ విషయంలో వారు ఆశించిన మేరకు సమర్థవంతంగా వ్యవహరించడం లేదేమోననిపిస్తున్నది. అందుకు ఎన్నో కారణాలున్న మాటవాస్తవమే కావచ్చు. ఎవరు అంగీ కరించినా అంగీకరించకపోయినా గతంలో పోలీసులపై ఉన్న భయభక్తులు, విశ్వాసం, నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి. రాజకీయ జోక్యం, అవినీతి పెరిగిపోవడం ఒక కారణంగా చెప్పచ్చు. కొందరు అధికారులు మరికొందరి రాజకీయ నాయకులతో మమేకం అయిపోతున్నారు. ఫలితంగా రాజకీయ అండ, ధనబలం ఉంటే ఎంతటి నేరం చేసి అయినా బయటపడవచ్చుననే నమ్మకం పెరిగిపోతున్నది. ఈ పరిస్థితి మారాలి. ముందుగా అధికార వర్గాల్లో మార్పు రావాలి. అందుకు కొంత ధైర్యం కావాలి. రాజకీయ ఒత్తిడిలకు లొంగని దృఢచిత్తం ఉండాలి. ఇప్పుడున్న అధికారుల్లో ఎంత మందికి ఈ లక్షణాలున్నాయి? ఈ నేరాలే కాదు హత్యలు, ప్రమాదాలు, ఘర్షణలకు మద్యం మాదకద్రవ్యాల వినియోగం మరొక కారణంగా చెప్పచ్చు. ఢిల్లీలో జరిగిన నిర్భయ ఉదంతంతోపాటు దేశంలో జరుగుతున్న మానభంగాలు, హత్యలు తదితర ఘరానా నేరాల నిందితుల్లో అధికశాతం ఈ మత్తులో ఉన్నవారేననే విషయం తెలియంది కాదు. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. పోలీసు శాఖలో మితిమీరిపోతున్న రాజకీయ జోక్యానికి కొంతవరకైనా పుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేయాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగిననాడు ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, మరెన్ని పథకాలు అమలు చేసినా అరాచకం ప్రబలి నిరుపయోగం అవుతాయనే విషయం విస్మరించరాదు. ●

ఒకరితో స్నేహం చేసేటప్పుడు నెమ్మదిగా ప్రారంభించాలి. స్నేహం కలిసిన తర్వాత మరెన్నడూ విడిచిపెట్టకూడదు.



సోక్రటీస్

యుద్ధానికి ఎవరూ కారణాలను అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

ప్రజావాక్కు

ప్రయాణికులు జాగ్రత్త

బస్సులో టిక్కెట్‌కు సరిపడా డబ్బులివ్వమని మీరిచ్చే వంద రూపాయల నోటుకు చిల్లరలేదని చెప్పినందుకు ఓ మహిళా ప్రయాణికురాలుమహిళా కండక్టరును బస్సులో నుంచి కిందకు తోసేసిన కారణంగా అదే బస్సు చక్రాల క్రిందపడగా కాళ్లనుజ్జునుజ్జు అయాయి.దరిమిలా వైద్యం చేసినా ప్రవళిక పేరుగల 24 సంవత్సరాల అవివాహిత మరణించడం చదువరులకు కన్నీరు తెప్పించింది. తోసేసిన ప్రయాణీకురాలిపై హత్యకేసును నమోదు చేయడం జరిగిందని న్యూస్‌రిపోర్టు.తాత్కాలికకోపంతో కాకతాళీయంగా జరిగిన సంఘటనే కాని కావాలని చేసినదికాదు. కాబట్టి పెద్దశిక్ష పడకపోవచ్చు. ప్రవళిక తల్లికి ఉద్యోగం, పది లక్షలనగదు తెలంగాణా రోడ్డురవాణా శాఖ ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలను, ఇందిరమ్మ ఇంటిని ఇస్తామని హామీ యిచ్చింది. తాను మరణించి తన వారిని ఐశ్వరవంతులను చేసిన ప్రవళికకు నివాళి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

ట్రంప్ వ్యతిరేక నిరసనలు

ఇరాన్ యుద్ధం వల్లనే ఓడిపోయాం అని ట్రంప్ అన్నారంటే అమెరికాపౌరులు మాత్రమే కాదు ప్రపంచం పౌరులు అంతా వద్దు అనిఅరుస్తున్నా ఎందుకు మొనగాడుగా ట్రంప్ యుద్ధం వైపుమళ్లారు.అంటే ఆయుధం వ్యాపారం కోసం,చైనాకు మేమే ప్రపంచ అధినాయకులం అని చెప్పడానికి మాత్రమే. అయితే ఇప్పుడు అమెరికా పౌరులు యుద్ధం కోరుకోవడం లేదు అనిఎన్నికల ఫలితాల ద్వారా రుజువు చేసినట్టు అయింది. అభివృద్ధి చెందిన దేశాలు అని ఆర్థికఅభివృద్ధి సాధించామని ఎలా లెక్కకడతాం అంటే పౌరుల వినియోగశక్తి పెరిగినప్పుడు,మరి యుద్ధం వల్ల సరఫరా గొలుసులు చిన్నభిన్నం అయ్యాయి.

- భారత అవినాష్, జనగామ

గ్రామ సభ సమాచారం ఇవ్వాలి

రాష్ట్రంలో చాలా గ్రామాల్లో అధికారులు గ్రామ సభ నిర్వహణ తేదీ,సమయం, వేదికపట్ల అకస్మాత్తుగా సమచారం ఇవ్వడంపట్ల చదువుకున్న యువత, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామ సభ నిర్వహించే రెండు రోజులు ముందుగానే గ్రామ ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. పారదర్శకతతో కూడిన సమాచారం ఇస్తేనే గ్రామ యువత, ప్రజలు వాళ్ల సమస్యల పట్ల, గ్రామ సమస్యల పట్ల ప్రశ్నించే అవకాశం ఉంటుంది.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గుణపాఠం

అర్బన్ లోకల్ ఎన్నికలు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫలితాలు ప్రతిపక్షమైన వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీకి గట్టి గుణపాఠం చెప్పాయనిపిస్తోంది. కూటమి పార్టీలైన తెలుగు దేశం, జనసేన,బిజెపిలు అఖండ విజయంసాధించాయి. ఈ గెలుపును బలుపుగా భావించి ప్రజాసమస్యల మీద నిర్లక్ష్యం వహించినట్లయితే ప్రజలు అమెరికామార్గంలో పయనించి రాబోయే ఎసెంబ్లీఎన్నికలలోఫలితాలు తారుమారుచేయవచ్చు. ముఖ్య విపక్ష పార్టీ అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ దెబ్బతిన్న పులిలా విజృంభించే అవకాశాలను తోసిపుచ్చలేము. నలభై శాతం ప్రజలు ఈపార్టీని ఇప్పటికి ఆదరిస్తున్నారు.ప్రజలలో, సొంత కూటమిలో కొంత అసంతృప్తి సెగలు వ్యాపిస్తున్నాయని వింటున్నాం. కష్టపడి సంపాదించిన ప్రభుత్వాన్ని ఐకమత్యంతో కాపాడుకోవాలి. కూటమి వారు తస్మాత్ జాగ్రత్త.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

కరవు ముప్పుతో నీటి సంక్షోభం

తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు నీటి భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు బలహీనపడటం,భూగర్భజలాల వినియోగంపెరగడం, కరవు ముప్పును మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఖరీఫ్ 2026లో రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు వార్తలు వెలువడ్డాయి. వీటిలో 111 మండలాల్లో తీవ్రంగా, 254మండలాల్లో మధ్యస్థంగా కరవు నెలకొన్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూగర్భ జలాలు పడిపోవడం నగరవాసులను కలవరపెడుతోంది.గతంలో తక్కువ లోతులో నీరందించిన బోరుబావులు ఇప్పుడు మరింత లోతుకు వెళ్లినా ఫలితం ఇవ్వని పరిస్థితులు కనిపిస్తున్నాయి. జలాశయాల్లో నిల్వలు తగ్గడం, కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా పరిమితం కావడం ప్రజల ఇబ్బందులను పెడుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

స్మార్ట్ రేషన్ కార్డు పెద్ద సమస్యే

తెలంగాణా ప్రభుత్వం సివిల్ సప్లైస్ డిపార్టుమెంటువారు రేషన్ స్మార్ట్ కార్డులను జారీ చేసారు. ఇవి ఎ.టి.ఎమ్. కార్డు సైజులో ముద్రింపబడ్డాయి.వీటిలో కుటుంబ సభ్యుల పేర్లను పూర్తిగా రాయలేదు. ఆధార్ కార్డులో ఉన్నట్టు అడ్రసు లేదు. కార్డులో ఇచ్చిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ కావడం లేదు. రేషన్ కార్డునెంబరు ఒక్కటేసరిగాఉంది.త్వరలో ఇయ్యబోయే రేషన్ బియ్యం ఈ కార్డు ద్వారా ఇస్తే సరిలేకపోతే ఇదొక సమస్యే.

-ఎ.నాగరాజు, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

శిశువు సంరక్షణతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

అప్పుడే జన్మించిన సుందర, చిరుదరహాస నవజాత శిశువు సంరక్షణ మనందరి అతి పెద్ద బాధ్యత.పుట్టిన బిడ్డ సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, పౌర సమాజం, ప్రభుత్వాల సమిష్టి బాధ్యత అని నమ్ముకొంటేనే రేపటి ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుంది. శిశు ఆరోగ్య ప్రాధాన్యాన్ని గుర్తించిన అమెరికా, యూరోప్ దేశాలు 1990ల్లో ప్రారంభించిన 'శిశు సంరక్షణ దినం లేదా ఇన్ఫాంట్ ప్రొటెక్షన్ డే'ను ప్రతి ఏటా 7 నవంబర్‌న ప్రపంచవ్యాప్తంగా పాటించుట ఆనవాయితీగా మారింది. అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో నేటికీ నవజాత శిశు మరణాల రేటు అధికంగా నమోదు కావడం కలవరపరుస్తున్నది.నవజాత శిశువు శరీరం సున్నితంగా ఉంటుందని గమనించి ఆరోగ్యకర వాతావరణంలో పెంచడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి. శిశువులో రోగనిరోధకశక్తి పెంచడం, సరైన సమయాల్లో టీకాలు ఇప్పించడం, పోషకాహారాన్ని అందించడం, ఇంటి పరిసరాల్లో పారిశుద్ధం పాటించడం, తరుచుగా పిల్లలవైద్యుల సలహాలను తీసుకోవడం, పిల్లల పెంపకం పట్ల తగు అవగాహన కల్పించడం లాంటి లక్ష్యాలతో శిశు సంరక్షణ దినం పాటించడం జరుగుతోంది. ఈ ఏడాది శిశుసంరక్షణ దినం 2026 ఇతివృత్తంగా శిశువుల సంరక్షణ, శారీరక పెరుగుదల, సంపూర్ణ అభివృద్ధి (ప్రొటెక్టింగ్, ప్రమోటింగ్, డెవలపింగ్ ఇన్ఫాంట్స్) అనే అంశాన్ని తీసుకున్నారు. శిశు సంరక్షణ దినం వేదికగా పిల్లల భద్రత, క్రమ పద్ధతిలో పెంపకం, నవజాత శిశు హక్కులను కాపాడడం, అన్ని రకాలైన టీకాలను సరైన సమయాల్లో అందించడం, సమాజ బాధ్యతగా గుర్తించడం, తల్లితండ్రులకు సరైన అవగాహన కల్పించడం లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలి. తల్లితండ్రులు ఆదర్శ జీవన విధానాలను పాటించడం, వైద్యుల సలహాలను క్రమం తప్పకుండా తీసుకొని పాటించడం లాంటి టిప్స్ పాటిస్తే నేటి శిశువులు రేపటి ఆరోగ్యకర తరంగా మారతారని నమ్మాలి.తల్లి గర్భంలోంచి పేగుబంధాన్ని తెంచుకొని జన్మించిన చిన్నారి అనారోగ్యంతో బాధపడితే ఏ తల్లితండ్రులు భరించలేరు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది చిన్నారులు మరణిస్తున్నారు. వీరిలో 95 శాతం వరకు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే నమోదు అవుతున్నాయి. భారత్ లాంటి దేశాల్లో నవజాత శిశువులు ప్రతి ఏటా 2.5 కోట్లు జన్మిస్తుండగా, అందులో 10లక్షల వరకు మరణించడం కడు విచారకరం. మన దేశంలో నేటికీ అధిక మొత్తంలో శిశు జననాలు ఇంట్లో లేదా సరైన వసతులు లేని ఆసుపత్రుల్లోనేపురుడు పోసుకుంటున్నారు. శిక్షణ పొందిన వైద్య సిబ్బంది లేదా మంత్రసానుల కొరతతో ప్రసవ సమయాల్లోనే మరణించడం గమనిస్తున్నాం. అత్యాధునిక వైద్య ఆరోగ్యపరిజ్ఞానం ఉన్న నేటి డిజిటల్ యుగంలో శిశుమరణాలు ప్రభుత్వాలకే కాకుండా మానవాళికి కూడా సిగ్గు చేటు. నివారించదగిన శిశు మరణాలకు అవగాహన అనే ఔషధంతో పెంచడం తల్లితండ్రుల ప్రధాన కర్తవ్యం. భారత్‌లో శిశు మరణాల రేటు(ప్రతి వెయ్యికి 30 మంది)ను 30 లోపుకు తగ్గించడానికి ప్రభుత్వాలు ప్రణాళికలు అమలు పరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, కుటుంబ ఆరోగ్యం, సంక్షేమ శాఖ, యూనిసెఫ్‌తో కలిసి 'నేషనల్ నియోనాటాలజీ ఫోరమ్' ప్రతి ఏటా నవంబర్ 15-21 వరకు వారోత్సవాలనుకూడా నిర్వహిస్తున్నారు. తల్లి ఆరోగ్య ప్రభావం పిల్లలపై ప్రత్యక్షంగా పడుతుంది. తల్లులు సరైన పోషకాహారం తీసుకోవడం, రక్తహీనత లేకుండా జాగ్రత్త పడడం, పిల్లల్లో టీకాలతో రోగనిరోధకశక్తిని పెంచడం, శిక్షణ పొందిన మంత్రసానులతో ప్రసవం చేయించడం, నవజాత శిశువును వెచ్చని ప్రదేశంలో ఉంచడం, శిశువు వ్యాధి లక్షణాలను గమనిస్తూ వైద్యం చేయించడం, ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించడం, కనీసం తొలి ఏడాది వరకు తల్లిపాలతోనే శిశువును పెంచడం, తల్లిబిడ్డలకు ఇన్ఫెక్షన్ కలుగకుండా చూడడం, తల్లితండ్రులకు పిల్లల పెంపకం పట్ల సంపూర్ణ అవగాహన కలిపించడం లాంటి టిప్స్ పాటించే విధంగా 'శిశు సంరక్షణ దినం' వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. శిశు సంరక్షణ దినం వేదికగా పిల్లల పెంపకం పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలి. ●

సీతాఫలానికి అంతర్జాతీయ గుర్తింపు ఇంకా ఎప్పుడు?

శ్రీశైలం దూడం

ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లోని గుట్టలు, బంజరు భూములు, అడవుల అంచుల్లో సహజంగా లభించే సీతాఫలం నేడు పట్టణ మార్కెట్లలో ఖరీదైన పండుగా మారుతోంది. పేదలకు అందుబాటులో ఉండే ప్రకృతి సంపద వినియోగదారులకు భారంగా మారడం వెనుక వాతావరణ మార్పులు, దిగుబడి, సరఫరా, నిల్వ సదుపాయాల కొరత వంటి అనేక కారణాలున్నాయి. అయిత ఇంతటి పోషక విలువలు, వాణిజ్య అవకాశాలున్న సీతాఫలాన్ని రైతులకు ఆదాయ వనరుగా మార్చడంలో ప్రభుత్వాలు ఎందుకు వెనుకబడ్డాయి? తెలంగాణలో బాలానగర్ సీతాఫలం వంటి స్థానిక రకాల ప్రత్యేకతలను గుర్తించి పరిశోధించడం, వాటికి తగిన గుర్తింపు తీసుకురావడం అవసరం. సీతాఫలంలో సహజ చక్కెరలు, పీచు, మాంసకృత్తులు, విటమిన్ సి, విటమిన్ బి6, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలుంటాయి. పీచు జీర్ణక్రియకు, విటమిన్ సి సాధారణ రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు, పొటాషియం కండరాలు, నరాల సాధారణ పనితీరుకు తోడ్పడతాయి.అయితే, ఇది ఏ వ్యాధికీ మందు కాదు. సమతుల ఆహారంలో భాగంగా తీసుకోవాల్సిన పండు మాత్రమే. మధుమేహం ఉన్నవారు కూడా తమ రక్తంలో చక్కెర స్థాయిలు, ఆహార ప్రణాళికను బట్టి పరిమితంగా తీసుకోవచ్చు. పండులో సహజ చక్కెరలు, పిండిపదార్థాలు ఉన్నందున పరిమాణంపై శ్రద్ధ అవసరం. మూత్రపిండాల సమస్యలతో పొటాషియం పరిమితం చేయాలని వైద్యులు సూచించినవారు జాగ్రత్త వహించాలి. గర్భిణులు, పిల్లలు సహా అందరూ శుభ్రంగా కడిగిన పండులోని గుజ్జును మాత్రమే తీసుకోవాలి. గింజలను నమలకూడదు. వాటిలో హానికర పదార్థాలుంటాయి. ఆకులు, బెరడును వైద్యుల సలహా లేకుండా ఔషధాలుగా వాడటం సరికాదు. సీతాఫలం తక్కువ వర్షపాతం ఉన్నప్రాంతాల్లోనూ పెరిగే సామర్థ్యం కలిగిన పంట. రాతి నేలలు, పొడి వాతావరణ పరిస్థితులను కొంతవరకు తట్టుకోగలదు. అందుకే తెలంగాణలోని అనేక గ్రామాల్లో సహజంగా పెరుగుతోంది. కానీ సహజంగా చెట్లకు కాసిన పండ్లను ఏరి అమ్ముకోవడం, శాస్త్రీయ పద్ధతుల్లో తోటల సాగు చేయడం రెండూ వేర్వేరు. నాణ్యమైన మొక్కలు, పూత సమయంలో సరైన పరాగసంపర్కం, నేలలో తేమ సంరక్షణ, తెగుళ్ల నివారణ వంటి అంశాల్లో రైతులకు శిక్షణ అవసరం. మరోవైపు, సీతాఫలం త్వరగా పక్వానికి వచ్చి పాడయ్యే స్వభావం కలిగి ఉంటుంది. నిల్వ, రవాణా సదుపాయాలు లేకపోతే రైతు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుంది. వినియోగదారుడు అధిక ధర చెల్లించినా ఆ



ప్రయోజనం పూర్తిగా రైతుకు చేరుతుందనే హామీ లేదు. మధ్యవర్తుల పాత్ర, రవాణా ఖర్చులు, మార్కెట్ ధరల వ్యత్యాసాలను పరిశీలించి పారదర్శక విక్రయ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. జాతీయ ఉద్యాన మిషన్ వంటి పథకాల ద్వారా సీతాఫలం సాగుకు కూడా నిర్దేశిత నిబంధనల ప్రకారం సహాయం పొందే అవకాశం ఉంది. అయితే, తెలంగాణలో ఈ పంట కోసం ఇప్పటివరకు ఎంత నిధి ఖర్చు చేశారు? ఎన్ని ఎకరాల్లో సాగు విస్తరించింది? ఎంతమంది రైతులు లబ్ధి పొందారు? పరిశోధన, మొక్కల పంపిణీ, ప్రాసెసింగ్ కోసం ఎన్ని చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు ఉద్యాన శాఖ వెల్లడించాలి. సాధారణ ఉద్యాన పథకాల్లో ఒక పంటను చేర్చడం మాత్రమే సరిపోదు. దాని ప్రత్యేక సమస్యలను పరిష్కరించే కార్యాచరణ అవసరం. రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి అనుబంధ సంస్థలు కలిసి స్థానికరకాల దిగుబడి, నాణ్యత, వాతావరణ ప్రభావం, నిల్వ సామర్థ్యాలపై పరిశోధనలు చేయాలి. బాలానగర్ సీతాఫలం ప్రత్యేకతలను శాస్త్రీయంగా నిర్ధారించి, అర్హత ఉంటే భౌగోళిక గుర్తింపు కోసం కృషి చేయాలి. సీతాఫలాన్ని పండుగా విక్రయించడానికే పరిమితం కాకుండా దాని గుజ్జుతో ఐస్ క్రీమ్, పానీయాలు, ఇతర ఆహార ఉత్పత్తులు తయారు చేసే చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలి. గ్రామీణ మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పల్ప్‌తయారీ, ప్యాకేజింగ్, నిల్వ సాంకేతికత అందించాలి. ఆహార భద్రత ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఉత్పత్తులను దేశీయ మార్కెట్లకు తీసుకెళ్లాలి. అనంతరం వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ సహకారంతో విదేశీ మార్కెట్ అవకాశాలను పరిశీలించాలి. అదే సమయంలో సహజంగా పెరుగుతున్న సీతాఫలం చెట్లను కాపాడాలి. గుట్టల తవ్వకాలు, భూముల వినియోగ మార్పుల వల్ల ఈ సంపద అంతరించకుండా అటవీ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలి. కోతుల వల్ల పంట నష్టాన్ని తగ్గించేందుకు మానవీయ పరిష్కారాలు అన్వేషించాలి.చిన్న ఉద్యాన పంటలకు పంట బీమా, నష్టపరిహారం వర్తించేలా ప్రభుత్వాలు విధానాలను సమీక్షించాలి. సీతాఫలం కేవలం ఒక పండు కాదు.కరువు ప్రాంతాల్లో గ్రామీణ కుటుంబాలకు ఆదాయం అందించగల అవకాశమున్న ఉద్యాన సంపద. దీనికి అవసరమైన పరిశోధన, నాణ్యమైన మొక్కలు, రైతు శిక్షణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలను ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలో భాగం చేయాలి. సాగు విస్తీర్ణం, దిగుబడి, నిధుల వినియోగం, రైతులకు అందిన ప్రయోజనాలపై ఏటా శ్వేతపత్రం విడుదల చేయాలి.ప్రకృతి సీతాఫలం చెట్లను పెంచింది. కానీ వాటిని రైతుల ఆదాయ వనరులుగా మార్చే బాధ్యత ప్రభుత్వానిదే. ప్రకృతి ఇచ్చిన సంపదను నిర్లక్ష్యం చేస్తే అది అడవుల్లోనే మిగిలిపోతుంది. శాస్త్రీయ పరిశోధన, ప్రభుత్వ ప్రోత్సాహం, రైతుల భాగస్వామ్యం కలిస్తే అదేసంపద జాతీయ,అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురాగలదు. ●

ఇంత వాయు కాలుష్యమా?



- రాజధానిలో గాలి నాణ్యత ప్రమాదకరస్థాయికి చేరడంపై సిజె ఆందోళన
- ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరచాలి..
- డీజిల్ రిక్షాలు దశలవారీగా తొలగింపు
- కాలుష్యం 400 స్థాయికి చేరడంపై సుప్రీం సిజె ఆందోళన

న్యూఢిల్లీ, నవంబరు 6: దేశ రాజధాని ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది సుప్రీంకోర్టు.. నగరంలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరుకుంటుండటంతో ఈ అంశంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా ఢిల్లీలో గాలి పీల్చడం రోజుకు 30 సిగరెట్లు తాగడంతో సమానమని అమికస్ క్యూరీ అపరాజితా సింగ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు. ఢిల్లీలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో వాహనాల నుంచి వెలువడే కాలుష్యం ఒకటని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ రహదారులపై వాహనాలు బంపర్ టు బంపర్‌గా కదులుతున్నాయని సీజేఐ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ తగినంతగా లేదని, వాహనాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఢిల్లీ సరిహద్దుల్లోని టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా చూడాలని గతంలో ఇచ్చిన ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని అమికస్ క్యూరీ అపరాజితా సింగ్ వెల్లడించారు. సరిహద్దుల్లో వాహనాలు నిలిచిపోవడం వల్ల కాలుష్యం మరింత పెరుగుతోందని వివరించారు. కోర్టు ఆదేశాల అమలులో లోపాలున్నాయని అదనపు సొలిసిటర్ జనరల్ కూడా అంగీకరించారు. ఢిల్లీ వాయు కాలుష్యానికి పంట వ్యర్థాల దహనం కూడా ఒక కారణంగా మారుతోంది. నవంబర్ 5న ఢిల్లీలో నమోదైన కాలుష్యంలో పంట వ్యర్థాల దహనం వాటా 14 శాతంగా ఉందని విచారణ సందర్భంగా వెల్లడించారు. ఈ సమస్యను అరికట్టేందుకు రైతులకు మరింత అవగాహన కల్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. పంట వ్యర్థాలను కొనుగోలు చేసే ధరను ముందుగానే ప్రకటిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని సీజేఐ అభిప్రాయపడ్డారు. పంట వ్యర్థాల నిర్వహణకు అవసరమైన యంత్రాలను వ్యక్తిగత రైతులకు అందించడం కంటే గ్రామ పంచాయతీలకు అందించడం మంచిదని సూచించారు. ఖరీదైన వ్యవసాయ యంత్రాల వ్యయాన్ని చిన్న, సన్నకారు రైతులు భరించలేరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇక, పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలను ఉపయోగించడం రైతులకు భారంగా మారుతోందని అమికస్ క్యూరీ కోర్టుకు వివరించారు. ముఖ్యంగా ఇంధన ధరలు పెరగడంతో ఈ యంత్రాల నిర్వహణ ఖర్చులు అధికమవుతున్నాయని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలతో పాటు వాటిని సేకరించడం, నిల్వ చేయడం, విక్రయించడం ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలను రైతులకు వివరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పంట వ్యర్థాల నిల్వ కోసం అందుబాటులో ఉన్న గిడ్డంగుల సదుపాయాలను ఉపయోగించుకోవాలని పేర్కొంది. ఈ ఏడాది పంట వ్యర్థాల దహనం ఘటనలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. ముఖ్యంగా హర్యానాలో ఈ ఘటనలు భారీగా తగ్గినట్లు వివరించింది. రైతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పంట వ్యర్థాల దహనాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. ఈ అంశంపై సుప్రీంకోర్టు చేసిన సూచనలను వ్యవసాయ మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్తామని కేంద్రం తరఫున వెల్లడించారు. ఢిల్లీలో వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్‌తో నడిచే రిక్షాలను దశలవారీగా తొలగించే చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇప్పటికే అనేక చర్యలు అమలు చేస్తున్నట్లు వివరించింది. నగరంలో వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని మరింత సమర్థవంతమైన రవాణా వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మరోవైపు వేసవిలో కాలుష్య కారకాలు గాలిలో వ్యాపించి కొంతవరకు బయటకు వెళ్లిపోతాయని, శీతాకాలంలో మాత్రం వాతావరణ పరిస్థితుల కారణంగా అవి గాలిలోనే చిక్కుకుపోతాయని అమికస్ క్యూరీ వివరించారు. దీనివల్ల ఢిల్లీ ప్రజలు తీవ్ర కాలుష్యాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. వర్షాల కారణంగా ప్రస్తుతం ఢిల్లీలో కాలుష్య తీవ్రత కొంత తగ్గిందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయినప్పటికీ, వాయు నాణ్యత సూచీ 400 స్థాయికి చేరుకుంటుండటం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. దీపావళి సమయంలో కాలుష్యం పెరగడం వల్ల పేద ప్రజలే ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అమికస్ క్యూరీ అపరాజితా సింగ్ కోర్టుకు తెలిపారు. కాలుష్యం కారణంగా కొందరు పేదలు పండుగ సమయంలో ఢిల్లీని విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. దీనిపై స్పందించిన సీజేఐ.. దీపావళి పండుగ పేదలకు ఉపాధి కల్పించే ముఖ్యమైన సమయమని వ్యాఖ్యానించారు. పండుగలను సామాజిక హోదాకు చిహ్నంగా మార్చుకునే సంపన్న వర్గాల వైఖరి వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు.

అమెరికాతో చర్చలకు ఇరాన్ ఏడు షరతులు

ఖతార్ మధ్యవర్తిత్వంతో చర్చలు ముమ్మరం



టెహ్రాన్, నవంబరు 6: అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ, ఇరాన్ దౌత్యపరంగా ఒక కీలక ముందడుగు వేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాకు ఒక అణు ప్రతిపాదనను పంపింది. అయితే, చర్చలు ప్రారంభించాలంటే ముందుగా తమ ఏడు షరతులను వాషింగ్టన్ నెరవేర్చాలని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌ను నాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక సీనియర్ ఇరాన్ అధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇరాన్ పంపిన ప్రతిపాదనను అమెరికా పరిశీలిస్తోందని, అయితే ప్రతిపాదనలోని వివరాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. అంతకుముందు ఇరాన్ భద్రతా అధికారి మొహసెన్ రెజాయీ మాట్లాడుతూ మేం అమెరికా ముందు ఏడు షరతులు ఉంచాం. అవి నెరవేర్చే వరకు హర్మూజ్ జలసంధిని తెరవబోం, చర్చలు కూడా జరపమని స్పష్టం చేశారు. ఇరాన్ అధికారికంగా తమ షరతుల జాబితాను ప్రకటించనప్పటికీ, మీడియా కథనాల ప్రకారం ఈ డిమాండ్లలో పలు కీలక అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. లెబనాన్ సహా తమపై అన్ని రకాల శత్రుత్వాలను అమెరికా నిలిపివేయడం, ఇరాన్ ఓడరేవులపై విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, అన్ని ఆర్థిక ఆంక్షలను తొలగించడం, స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయడం, పశ్చిమాసియా ప్రాంతంలో అమెరికా సైనిక ఉనికిని తగ్గించడం, యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించడం, తమ భూభాగంపై దాడులను ఆపడం వంటివి ఈ షరతులలో ఉన్నట్లు సమాచారం. అయితే, ఎలాంటి చర్చలు మొదలైనా అందులో అణు అంశాలే ప్రధానంగా ఉండాలని వాషింగ్టన్ పట్టుబడుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేయడంతో ఈ ఘర్షణ మొదలైంది. దీనికి ప్రతిగా ఇరాన్ ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా సైనిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై దాడులు చేసింది. ఈ వివాదం లెబనాన్‌కు కూడా పాకింది.

పుణే ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టివేత



పూణె, నవంబరు 6: పూణే అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా డ్రగ్స్ రవాణా కుట్రను భగ్నం చేశారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఒక భారతీయ ప్రయాణికుడి వద్ద నుంచి 10.642 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.3.72 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వివరాల్లోకి వెళితే పక్కా సమాచారంతో బ్యాంకాక్ నుంచి విమానంలో వచ్చిన ప్రయాణికుడి చెక్ ఇన్ బ్యాగేజ్‌ను కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల ప్యాకెట్లతో పాటు ఫ్రీజ్ డ్రైడ్ మొంతోంగ్ దురియన్ పేరుతో లేబుల్ చేసిన తొమ్మిది వాక్యూమ్ సీల్డ్ ప్యాకెట్లలో హైడ్రోపోనిక్ గంజాయిని అత్యంత తెలివిగా దాచారు. నూడుల్స్ ప్యాకెట్లు, ఇతర వాణిజ్య ఆహార పదార్థాల మధ్య ఈ డ్రగ్స్ ప్యాకెట్లను దాచి రవాణా చేస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. నిందితుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీసీ) యాక్ట్ కింద అరెస్ట్ చేసినట్లుగా కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి నవంబర్ 18 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. డ్రగ్స్ స్మగ్లింగ్ సిండికేట్ వెనుక ఉన్న మిగతా ముఠా సభ్యులను పట్టుకోవడానికి అధికారులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.



అధ్యక్ష ఎన్నికల రేసులోకి జార్జియా సెనేటర్ జాన్ ఓసాఫ్!

అట్లాంటా, నవంబరు 6: అమెరికా రాజకీయాల్లో ఇప్పుడు ఒక వ్యక్తి పేరు మారుమోగిపోతోంది. అతనే డెమోక్రటిక్ పార్టీ యువ సంచలనం జాన్ ఒసాఫ్. 2024 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ తిరుగు లేని విజయం సాధించిన జార్జియా గడ్డపైనే ఇప్పుడు ఏకంగా ట్రంప్ వర్గానికే దిమ్మతిరిగే షాకిచ్చారు ఒసాఫ్. తాజాగా ముగిసిన యూఎస్ మిడ్‌టర్మ్ పోరులో అత్యంత కీలకమైన సెనేట్ స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా, కాంగ్రెస్ ఉభయ సభలపై డెమోక్రాట్లు పైచేయి సాధించడంలో వెన్నెముకలా నిలిచారు. ఈ దెబ్బతో 39 ఏళ్ల ఈ యువ నేతను రాజకీయ విశ్లేషకులు మరో బరాక్ ఒబామాగా అభివర్ణిస్తు న్నారు. రాబోయే 2028 అధ్యక్ష ఎన్నికల రేసులో డెమోక్రాట్ల తరఫున వైట్ హౌస్ బరిలో దిగే ప్రధాన నాయకుడు ఇతనేనంటూ జోరుగా చర్చ మొదలైంది. 2021లో మొదటిసారి గెలిచినప్పుడు జాన్ ఒసాఫ్‌ను చాలామంది యాక్సిడెంటల్ సెనేటర్ అని కొట్టిపారేశారు. కానీ ఐదేళ్ల తర్వాత, పూర్తి రిపబ్లికన్ అనుకూల వాతావరణం ఉన్న జార్జియాలో మళ్లీ జెండా పాతడం చిన్న విషయం కాదు. ప్రచారంలో ట్రంప్‌ను ఆయన ఏకిపారేసిన విధానం అమెరికా అంతటా వైరల్ అయింది. ట్రంప్ బృందాన్ని నేరుగా ఎపిస్టీన్ క్లాస్, మారలాగో మాఫియా అంటూ తీవ్ర పదజాలంతో ఒసాఫ్ విరుచుకు పడ్డారు. విజయానంతరం అట్లాంటాలో మాట్లా డుతూ కూడా అమెరికన్ ప్రజలు ట్రంప్ అవి నీతిని, అసమర్థతను తిరస్కరించారు. కేవలం అధ్యక్షుడి దుర్మార్గాలను అడ్డుకోవడమే కాదు, సమాజంలో ఏర్పడిన చీలికలను పూడ్చడమే మన లక్ష్యంఅంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రత్యర్థులు ఎంత రెచ్చగొట్టినా ఏమాత్రం తొణకకుండా, నిలకడగా ఎదురుదాడి చేయడంలో ఒసాఫ్ సిద్ధహస్తుడని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. ఒసాఫ్ ప్రసంగాల తీరు, బాడీ లాంగ్వేజ్ అచ్చం బరాక్ ఒబామాను పోలి ఉంటాయి. వేదికపైకి రాగానే షర్ట్ చేతులు పైకి మడిచి, అద్భుతమైన గొంతుతో ప్రజల్లో ఉత్తేజాన్ని నింపే ఆయన స్టైల్ 2008 నాటి యువ ఒబామాను కళ్లముందుంచుతోంది. ఒబామా సైతం స్వయంగా రంగంలోకి దిగి ఒసాఫ్ తరఫున ప్రచారం చేశారు. పౌరహక్కుల నేత జాన్ లూయిస్ వద్ద 17 ఏళ్ల వయసులోనే శిష్యరికం చేసిన ఒసాఫ్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసి, ఇన్వెస్టిగేటివ్ డాక్యుమెంటరీల కంపెనీ సీఈఓగా పనిచేశారు. మానవ అక్రమ రవాణా, యుద్ధ నేరాలపై పరిశోధనలు చేసిన అనుభవం ఆయనకు రాజకీయాల్లో ఎంతగానో అక్కర కొచ్చింది. ప్రస్తుతానికి తనకు ప్రెసిడెంట్ రేసుపై ఆసక్తి లేదని చెబుతున్నప్పటికీ బైడెన్, ట్రంప్ వంటి వయోవృద్ధ నాయకులతో విసిగిపోయిన అమెరికన్ ఓటర్లకు ఒసాఫ్ రూపంలో ఒక బలమైన ప్రత్యామ్నాయం కనిపిస్తోంది. ఒబామా తర్వాత అంతటి ప్రజాకర్షణ, యువతను ఆకట్టుకునే మాటతీరు ఉన్న లీడర్ మరొకరు లేరన్నది డెమోక్రాట్ల భావన. ట్రంప్ కంచుకోటలోనే విజయఢంకా మోగించిన ఈ యంగ్ సెనేటర్ 2028లో అమెరికా అధ్యక్ష పీఠం వైపు అడుగులు వేస్తారా అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

5.3 అంగుళాల గడ్డంతో గిన్నిస్ రికార్డు



కాన్సాస్, నవంబరు 6: ప్రపంచంలో ఎందరో వింతైన అలవాట్లు, రూపాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. సరిగ్గా ఇలాంటి కోవలోకే వస్తారు అమెరికాకు చెందిన 54 ఏళ్ల మాథ్యూ హే. తన అసాధారణమైన గడ్డంతో ఏకంగా గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సహజ గడ్డం జడ కలిగిన వ్యక్తిగా ఆయన రికార్డు పుటల్లోకి ఎక్కారు. ఆయన గడ్డం పొడవు ఏకంగా 5 అడుగుల 3 అంగుళాలు (1.603 మీటర్లు) ఉండటం విశేషం. అమెరికాలోని కాన్సాస్‌కు చెందిన మాథ్యూ, ఈ ఘనతతో గత రికార్డును సునాయాసంగా అధిగమించారు. ఇంతకుముందు రుడాల్ఫ్ మార్టినో పేరిట 3 అడుగుల 6 అంగుళాల పొడవుతో ఈ రికార్డు ఉండేది. సహజంగా పెరిగిన గడ్డం జడకు, సాధారణ గడ్డానికి మధ్య తేడా ఉందని గిన్నిస్ రికార్డ్స్ స్పష్టం చేసింది. అత్యంత పొడవైన గడ్డం రికార్డు ఇప్పటికీ కెనడాకు చెందిన సర్వాన్ సింగ్ పేరిట (8 అడుగుల 3 అంగుళాలు) ఉంది. మాథ్యూ హే సుమారు 20 ఏళ్లుగా ఈ గడ్డాన్ని పెంచుతున్నారు. మొదట్లో చిన్న గడ్డంతోనే ఉండే ఆయన, ఒసారి కొందరు పిల్లలు తన గడ్డాన్ని జడలా అల్లమని అడగడంతో సరదాగా అంగీకరించారు. ఆ తర్వాత ఆ లుక్ ఆయనకు నచ్చడంతో గడ్డం కత్తిరించడం మానేశారు. కాలక్రమేణా అది సహజంగానే ఒకే జడగా మారిపోయింది. ప్రతి ఏటా సుమారు 3 నుంచి 4 అంగుళాల మేర పెరుగుతూ వచ్చింది. చివరికి అది ఎంత పొడవుగా పెరిగిందంటే, దాన్ని నడుము చుట్టూ బెల్టులా చుట్టుకునే స్థాయికి చేరుకుంది. ఈ రికార్డుపై మ్యాథ్యూ స్పందిస్తూ, తన గడ్డం తనను నిర్వచించదని స్పష్టం చేశారు. ఈ అరుదైన గడ్డం కారణంగా బయట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నప్పటికీ, తనకు అంతకుమించి ఎన్నో ఇష్టాలు ఉన్నాయని మాథ్యూ తెలిపారు. ఆయనకు కార్లు, కంప్యూటర్ల పట్ల అమితమైన ఆసక్తి ఉంది. ముఖ్యంగా మజ్దా ఆర్‌ఎక్స్ 7 స్పోర్ట్స్ కార్లు, అమిగా కంప్యూటర్లంటే ఆయనకు ఎంతో ఇష్టం. వీటితో పాటు వెయిట్‌లిఫ్టింగ్, వీడియో గేమ్స్ ఆడటం, కుటుంబ సభ్యులతో సమయం గడపడం వంటివి ఆయన హాబీలు. "నా స్నేహితులు నన్ను గడ్డం కంటే ఎక్కువగా ఈ హాబీల ద్వారానే గుర్తుపడతారు" అని ఆయన అన్నారు.

సంక్షిప్త వార్తలు

బిగ్‌బి ఇల్లు సహా పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు



ముంబయి, నవంబరు 6: ముంబై మహానగరంలో మరోసారి బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ నివాసం జల్సా సహా నగరంలోని పలు కీలక ప్రాంతాలను పేల్చివేస్తామంటూ ఆగంతుకులు ఈమెయిల్ ద్వారా హెచ్చరించారు. ఈ మెయిల్ నేరుగా బాంబే హైకోర్టుకు రావడంతో భద్రతా ఏజెన్సీలు తక్షణమే అప్రమత్తమయ్యాయి.

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, వర్లీ రేస్‌కోర్స్, అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చివేస్తామని ఈమెయిల్‌లో పేర్కొన్నారు. ఈ బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నాం. ముంబై పోలీసులు, ఇతర భద్రతా ఏజెన్సీలు దీనిపై దర్యాప్తు చేస్తున్నాయి.

ట్రంప్ బెదిరింపులు.. ఇరాన్ కొత్త ప్రతిపాదనలు

వాషింగ్టన్, నవంబరు 6: యుద్ధం వల్ల రాజకీయంగా నష్టం జరిగినా.. ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో వెనక్కి తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త అణు ప్రతిపాదనను అగ్రరాజ్యానికి ఇరాన్ పంపింది. శాంతి చర్చలు కొనసాగాలంటే తాము అమెరికాకు పంపిన ఏడు డిమాండ్లు అంగీకరించాల్సిందేనని టెహ్రాన్ తేల్చిచెప్పింది. అప్పుడే అణు చర్చలు జరుపుతామని స్పష్టం చేసింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ డిమాండ్లు అమెరికాకు చేరాయి. ఇరాన్ పంపిన డిమాండ్ల జాబితా అధికారికంగా బయటకు వెల్లడి కాలేదు. అయితే వాటి గురించి అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.

కుటుంబంపై కక్షతో ఏడుగురి హత్య

బెంగళూరు, నవంబరు 6: కుటుంబ కలహాలు ఏడుగురి ప్రాణాలను బలిగొన్నాయి. భార్యతో తరచూ గొడవలు పడుతున్న ఓ క్యాబ్ డ్రైవర్ ఆమె కుటుంబంపై కక్ష పెంచుకుని ఏకంగా ఏడుగురిని హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం భార్యతో పాటు అత్త, ఇద్దరు బావమరుదులు, వారి భార్యలు, ఏడేళ్ల బాలుడిని కూడా వదలకుండా కిరాతకంగా చంపాడు.

ఈ దారుణ ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు ఇందుశేఖర్‌ను రాజాజీనగర్ పోలీసులు అరెస్టు చేశారు.


జార్ఖండ్ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురి మృతి

రాంచి, నవంబరు 6: జార్ఖండ్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. లారీ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖుంటి జిల్లాలోని తోర్పా రోడ్డుపై ఉన్న బార్టోలి వద్ద ఒక స్కూటీ ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో అక్కడ ఏమి జరిగిందో చూసేందుకు, క్షతగాత్రులకు సహాయం చేసేందుకు స్థానిక ప్రజలు రోడ్డుపై గుమిగూడారు. సరిగ్గా అదే సమయంలో గురువారం రాత్రి అతివేగంగా దూసుకొచ్చిన లారీ రోడ్డుపై ఉన్న ప్రజలపైకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

ప్రకృతి విపత్తుల పరిహారం పెంచిన యోగి సర్కార్

లక్నో, నవంబరు 6: ప్రకృతి విపత్తులతో నష్టపోయే రైతులు, బాధిత కుటుంబాలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం విపత్తు సహాయ నిబంధనల్లో కీలక మార్పులు చేస్తూ పరిహారాన్ని భారీగా పెంచింది. ప్రకృతి విపత్తుల్లో మరణించిన వారి కుటుంబాలకు ఇప్పటివరకు అందిస్తున్న రూ.4 లక్షల పరిహారాన్ని రూ.8 లక్షలకు పెంచింది. అదేవిధంగా పంట నష్టపరిహారాన్ని 25 నుంచి 30 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పశువులు, కోళ్లు, వ్యవసాయ భూములు, ఇళ్లు, విద్యాసంస్థలు, ఇతర ఆస్తులకు కలిగే నష్టాలకు కూడా అదనపు ఆర్థిక సాయం అందించనుంది.

ఇ20 పెట్రోల్‌లో పరిమితికి మించిన ఇథనాల్ - కేంద్రానికి ఫిర్యాదు



బెంగళూరు, నవంబరు 6: దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్‌పై చర్చ కొనసాగుతున్న వేళ తాజా వ్యవహారం దుమారమే రేపుతోంది ఈ20 పెట్రోల్‌పై కర్ణాటక ప్రభుత్వం సంచలన విషయాలను వెల్లడించింది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాల్సి ఉండగా, కొన్ని చమురు కంపెనీలు నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నట్లు ఆరోపించింది.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సేకరించిన పెట్రోల్ నమూనాలను ప్రైవేట్ ల్యాబ్‌లలో పరీక్షించగా ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు ప్రకటించింది. కొన్ని నమూనాల్లో ఇథనాల్ శాతం ఏకంగా 31.2 శాతానికి చేరినట్లు తెలిపింది.

రోడ్డుపక్కన నిలుచున్న వారిపై దూసుకెళ్లిన భారీ ట్రక్కు

ముగ్గురు పిల్లలు సహా ఏడుగురు మృతి

కుంతి, నవంబరు 6: ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కుంతి జిల్లాలో గురువారం రాత్రి వేగంగా వచ్చిన 18 చక్రాల భారీ ట్రక్కు రోడ్డు పక్కన నిలబడి ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. ఆ ఘటనలో నలుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్కూటర్‌పై వెళ్తూ ప్రమాదానికి గురైన వ్యక్తికి సాయం చేసేందుకు వచ్చిన గ్రామస్థులు ఈ దుర్ఘటనలో బలయ్యారు. దీంతో స్థానికంగా విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి10.15 గంటల సమయంలో ఓ వ్యక్తి స్కూటర్‌పై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొదల్లో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అతడికి సాయం చేసేందుకు తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కొందరు యువకులు పొదల్లో పడిపోయిన వ్యక్తిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. మరోవైపు మహిళలు, పిల్లలు రోడ్డు పక్కన నిలబడి అక్కడ జరుగుతున్న దృశ్యాన్ని గమనిస్తున్నారు. అదే సమయంలో తోర్పా వైపు నుంచి అతివేగంగా వచ్చిన 18 చక్రాల భారీ వాహనం అక్కడ గుమిగూడిన వారిపైకి దూసుకెళ్లింది. ట్రక్కు వేగంగా రావడంతో అక్కడున్న వారికి ప్రమాదాన్ని గుర్తించి పక్కకు తప్పుకునే అవకాశం కూడా దక్కలేదు. వాహనం ఢీకొనడంతో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.

చీఫ్‌జస్టిస్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు!

కేరళ పిసిసిపై సుప్రీంకోర్టు సీరియస్

న్యూఢిల్లీ, నవంబరు 6: చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ను లక్ష్యంగా చేసుకుని ఎక్స్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలతో కూడిన పోస్టును ప్రచురించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికారిక ఖాతా నుంచి వెలువడిన ఈ పోస్టును సుమోటోగా స్వీకరించిన దేశ అత్యున్నత న్యాయస్థానం కమిటీ పదాధికారులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానాల ప్రతిష్టను దిగజార్చేలా సాగే ఇటువంటి చర్యలను ఏమాత్రం సహించేది లేదని విస్పష్టంగా ప్రకటించింది. ఈ అంశంపై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎమ్ పంచోలీతో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం కొద్దిసేపటి కిందటే విచారణను చేపట్టింది. కాంగ్రెస్ తరఫున సీనియర్ అడ్వొకేట్ పార్టీ వాదనలను వినిపించారు. పార్టీ అగ్రనాయకత్వం అనుమతి లేకుండానే ఆ పోస్టు సామాజిక మాధ్యమంలో పోస్ట్ అయిందని, విషయం తెలిసిన వెంటనే దానిని తొలగించడమే కాకుండా బేషరతుగా క్షమాపణ కోరామని బెంచ్ కు కోర్టుకు విన్నవించారు. ఈ క్షమాపణపై జస్టిస్ అరవింద్ కుమార్ స్పందించారు. ఆ క్షమాపణ పత్రం కాగితంపై నుంచి వచ్చిందా లేదా హృదయపూర్వకంగా కోరిందా అనే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైనదని, ఏ ఒక్క వ్యక్తి లేదా రాజకీయ పార్టీ కూడా దీనికి గానీ, చట్టానికి గానీ ఎంతమాత్రం అతీతం కాదని బెంచ్ తేల్చి చెప్పింది. న్యాయవ్యవస్థ స్వతంత్రత అనేది రాజకీయ లబ్ధి కోసమో, ఒకరి సౌలభ్యం కోసమో ఉపయోగపడేది కాదని స్పష్టం చేసింది.

పురుషులకోసం సిద్ధం అవుతున్న గర్భనిరోధకమాత్ర!

వీల్‌కార్నెల్ మెడిసిన్ పరిశోధనల్లో సత్ఫలితాలు

న్యూయార్కు, నవంబరు 6: సంతాన నియంత్రణ రంగంలో ఒక విప్లవాత్మక మార్పుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటివరకు మహిళలకే పరిమితమైన గర్భనిరోధక మాత్రలను పురుషుల కోసం కూడా అందుబాటులోకి తెచ్చే దిశగా పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. అమెరికాలోని వీల్ కార్నెల్ మెడిసిన్ పరిశోధకులు హార్మోన్లతో సంబంధం లేని (నాన్‌హార్మోనల్) ఒక ప్రయోగాత్మక మాత్రను అభివృద్ధి చేస్తున్నారు. ఇది కేవలం 30 నిమిషాల్లోనే పనిచేయడం దీని ప్రత్యేకత. ఈ మాత్ర సొల్యుబుల్ అడినైలిల్ సైక్లేస్ అనే ఎంజైమ్‌ను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుంది. శుక్రకణాలు చురుగ్గా కదులుతూ అండం వైపు ఈదుకుంటూ వెళ్లడానికి ఈ ఎంజైమ్ చాలా కీలకం. ఈ మాత్రను తీసుకున్నప్పుడు, అది ఫ్రతిది ఎంజైమ్ పనితీరును తాత్కాలికంగా నిలిపివేస్తుంది. ఫలితంగా శుక్రకణాలు తమ కదలిక సామర్థ్యాన్ని కోల్పోయి స్తంభించిపోతాయి. దీంతో అవి గర్భధారణకు కారణం కాలేవు. లైంగిక చర్యకు సుమారు అరగంట ముందు ఈ మాత్రను వేసుకుంటే సరిపోతుంది. దీని ప్రభావం సుమారు 6 నుంచి 8 గంటల పాటు ఉంటుందని, ఆ తర్వాత శుక్రకణాలు తిరిగి తమ సహజమైన కదలిక సామర్థ్యాన్ని పొందుతాయని పరిశోధకులు వివరిస్తున్నారు.

ఇజ్రాయెల్ ప్రధాని రేసులో ఐసెన్‌కోట్ : అరబ్ పార్టీల మద్దతు



జెరూసలెం, నవంబరు 6: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఆయన ప్రభుత్వం మళ్లీ ఏర్పడే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఇజ్రాయెల్‌లో అతిపెద్ద అరబ్ రాజకీయ కూటమి అయిన జాయింట్ లిస్ట్, రామ్ పార్టీలు మాజీ మిలిటరీ చీఫ్ గడి ఐసెన్‌కోట్‌కు మద్దతు ప్రకటించాయి. దీంతో తదుపరి ప్రధానిగా ఐసెన్‌కోట్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెరుగయ్యాయి. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఎవరిని ఆహ్వానించాలనే అంశంపై అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వరుసగా రెండోరోజు రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపు తున్నారు. నెతన్యాహు, ఐసెన్‌కోట్ స్పష్టమైన మెజారిటీ సాధించ లేదు. ప్రభుత్వ ఏర్పాటుకు ఎవరికి ఆహ్వానించాలనే అధికారం అధ్యక్షుడికి ఉన్నా.. సంప్రదాయంగా అత్యధిక మంది ఎంపిల మద్దతు ఉన్న నేతకు అవకాశం కల్పిస్తారు. గత నెల 27న జరిగిన ఇజ్రాయెల్ ఎన్నికల్లో అరబ్ కూటమి 19 సీట్లు సాధించాయి. ఈ నేపథ్యంలో తదుపరి ప్రభుత్వ ఏర్పాటులో అవి కింగ్ మేకర్లుగా నిలిచాయి. ఐసెన్‌కోట్‌కు అరబ్ పార్టీలు మద్దతు ప్రకటించినా.. ఆయన నేతృత్వంలోని ప్రభుత్వంలో అవి భాగస్వాములవుతాయా అనే అంశంపై స్పష్టత లేదు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఐసెన్‌కోట్‌కు అవకాశం కల్పించాలని అధ్యక్షుడు హెర్జోగ్‌కు సిఫారసు చేస్తామని 11 స్థానాలు గెలుచుకున్న జాయింట్ లిస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ కూటమిలోని మూడు వర్గాలు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని వెల్లడించింది. నెతన్యాహు మళ్లీ ప్రధాని కాకుండా చూడాలన్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. ఎనిమిది స్థానాలు సాధించిన రామ్ పార్టీ కూడా ఐసెన్‌కోట్‌కు మద్దతు ప్రకటించింది. తాజా మద్దతుతో ఆయనకు 67 మంది ఎంపిల మద్దతు లభించినట్లయింది. 120 మంది సభ్యులున్న ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ఇది మెజారిటీకి మించిన సంఖ్య కావడం గమనార్హం. ప్రభుత్వ ఏర్పాటుకు అధ్యక్షుడు హెర్జోగ్ ఒక ఎంపికి అధికారికంగా బాధ్యతలు అప్ప గించిన తర్వాత.. ఆ ఎంపి 28 రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

అర్హులైన చెంచులందరికీ ఉపాధితోపాటు మరిన్ని పనిదినాలు

చెంచు గ్రామాల్లో మేట్ల నియామకంతో ఉపాధి పనులను విస్తరిస్తాం: మంత్రి సీతక్క

హైదరాబాద్,నవంబరు 6,ప్రభాతవార్త: చెంచు గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తున్నామని, అవసరమైన మేరకు మరిన్ని పనిదినాలు అందిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే చెంచు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీల సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్నారు. కూలి కోసం కూటీ కోసం చెంచుల వలస బాట అని ఓ దిన పత్రికలో వచ్చిన కథనానికి మంత్రి సీతక్క స్పందిం చారు. వెంటనే సంబంధిత అధికారు లతో మాట్లాడి వివరాలు తెప్పించు కున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో గ్రామంలో సగటున 39 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతుండగా, చెంచు ప్రాంతాల్లోని పద్రా మండలంలో గ్రామానికి సగటున 94 మంది, బల్మూరులో 46 మంది, పెద్ద కొత్తపల్లిలో 45 మంది, అమ్రా బాద్‌లో 42 మంది, కొల్లాపూర్‌లో 39 మంది, అచ్చంపేటలో 37 మంది, లింగాలలో 31 మంది కూలీలు పనులకు హాజరవు తున్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చెంచు గ్రామాల్లో ఉపాధి అవకాశాలను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి అధికా రులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో మేట్లను నియ మించి, ఉపాధి పనుల గుర్తింపు, కూలీల సమీకరణను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక అవసరాలకు అను గుణంగా పనులను గుర్తించి, ఏడాది పొడవునా ఉపాధి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద అర్హులైన చెంచు కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించడంతో పాటు, జలసిరి కార్య క్రమం ద్వారా నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ వంటి పనులను చేపట్టి స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచుతున్నామని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఇప్పటికే ఆమోదం పొందిన పనులను వేగంగా ప్రారంభించేలా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. చెంచు కుటుంబాలు ఉపాధి కోసం తమ గ్రామాలను విడిచి వలస వెళ్లాల్సిన పరిస్థితి రాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థానికంగానే పని కల్పిస్తూ, అవసరమైన మేరకు అదనపు పనిదినాలు అందిస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

పంచాయతీల సొంత ఆదాయం నేరుగా ఆ శాఖ ఖాతాల్లోనే

చట్ట సవరణ అమలుకు ఉత్తర్వులు జారీ

పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలక ముందడుగు : మంత్రి సీతక్క

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: గ్రామపంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయం ఇకపై ట్రెజరీలో జమ కాకుండా నేరుగా గ్రామపంచాయతీల సొంత ఖాతాల్లోనే జమ అయ్యేలా చేసిన చట్ట సవరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ (నాలుగో సవరణ) చట్టం-2026ను అక్టోబర్ 9, 2026 నుంచి అమల్లోకి తీసుకొస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 43ను శుక్రవారం జారీ చేసింది. అత్యవసర పారిశుద్ధం, తాగు నీరు, వీధిలైట్లు, రహదారులు, ఇతర స్థానిక అవసరాల కోసం గ్రామ పంచాయతీలు నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామా ల అవసరాలకు అనుగుణంగా సొంత ఆదాయాన్ని వేగంగా విని యోగిం చుకునేలా ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. మంత్రి సీతక్క చొరవతో గ్రామపంచాయతీలకు ఆర్థిక స్వావలంబన పెంచే దిశగా తీసుకున్న ఈ నిర్ణ యానికి ఇప్పుడు అమలు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామపంచాయతీల సొంత ఆదాయం నేరుగా వాటి ఖాతాల్లోనే జమ కావడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వేగంగా వినియో గించుకునే అవకాశం ఏర్పడనుంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది. గ్రామాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలే మరింత బాధ్యతతో నిర్ణయాలు తీసుకునేలా, స్థానిక సం స్థలకు ఆర్థిక స్వేచ్ఛను పెంచేదిశగా చట్టసవరణ కీలకఅడుగుగా ప్రభుత్వం పేర్కొంది. చట్ట సవరణ ఉత్తర్వులు వెలువడటం పట్ల మంత్రి సీతక్క హర్షం చేశారు. పల్లెల ఆర్థిక స్వావలంబనకు కీలకముందడుగని వ్యాఖ్యానించారు.

అధిష్టానానికి మంత్రి, ఎమ్మెల్యే వివాదంపై నివేదిక సిద్ధం చేస్తున్న పిసిసి చీఫ్ మహేశ్

హైదరాబాద్,నవంబరు 6,ప్రభాతవార్త: ఎఐసిసి నిర్వహించిన ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రి దామోదర రాజనర్సింహ జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతం హోటల్‌లో గొడవ పడి రచ్చరచ్చ చేసిన ఇద్దరి వ్యవహార శైలిపై కాంగ్రెస్ అదిష్టానంకు సమగ్ర నివేదిక పంపేందుకు టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సిద్ధమవుతున్నారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మంత్రి దామోదర రాజనర్సింహ జుక్కల్ ఎమ్మెల్యే మధ్య జరిగిన వివాదంతోపాటు ఇతర కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్రమవుతున్న వర్గపోరును చాలా ప్రాధాన్యత కలిగిన అంశగా స్వీకరించారు. కాంగ్రెస్‌పార్టీలో క్రమశిక్షణ పాదుకొలిపేందుకు ఆయన గాంధీభవన్‌కు ఆ ఇద్దరినేతలను రావాలని ఆదేశించారు. మంత్రి ఎమ్మెల్యేలు పొట్లాడుకొన్నారని సిసిటివి ఫుటేజ్‌లు ఇస్తానంటూ దాడికి గురైన నాయకుడు ఫిర్యాదు చేస్తుండటంతో ఢిల్లీ పంచాయతీ తెలంగాణ గల్లీలో పార్టీ పరువును ప్రతిష్టను దిగజార్చుతూ ప్రజల్లో పలుచన అవుతుండటంతో వారిని గాంధీభవన్‌కు రావాలని టిపిసిసి చీఫ్ ఆదేశించారు. గురువారం ఉదయం మంత్రితో మధ్యాహ్నం ఎమ్మెల్యేతో మాట్లాడటానికి షెడ్యూల్ ఖరారు చేశారు,. టిపిసిసి చీఫ్ గాంధీ భవన్‌కు చేరుకొన్నాక చివరి నిమిషంలో రాజనర్సింహ రావడంలేదని సమాచారం ఇచ్చారు. దామోదర రాజనర్సింహ రాకపోవడంతో మహేశ్ కుమార్‌గౌడ్ అసహనంకు గురైనారు. అయితే దామోదర రాజనర్సింహ కూడా మహేష్ కుమార్ గౌడ్ స్థాయి ఏంటో తెలుసుకోవాలని, సిడబ్ల్యుసి శాశ్వత సభ్యుడిని టిపిసిసి విచారణకు పిలవడం ఏంటని తన సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే నిన్న విచారణకు హాజరు కాలేదని ఆయన సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు. దామోదర రాజనర్సింహ విచారణకు హాజరు కాకపోవడంతో తానెందుకు విచారణకు రావాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతం సైతం రాలేదు. ఇద్దరూ రాకపోవడంతో చేసేదేమీ లేక మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ నుంచి నిరాశగా వెళ్లిపోయాడు. క్రమశిక్షణతో ఉండాల్సిన నాయకులు విచారణకు హాజరు కాకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న మహేష్‌కుమార్ ఇదే అంశాన్ని చూపుతూ పూర్తి నివేదికను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. ఇద్దరి ప్రవర్తనపై సమగ్ర సమాచారంతో కూడిన నివేదికను ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపించనున్నట్లుగా పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్లకు సిఎస్ సంజయ్‌జాజు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్లు మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని,



శుక్రవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

తద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం, ప్రభుత్వ ప్రతిష్ట మరింత పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పిలుపు నిచ్చారు. విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, భూసేకరణ తదితర శాఖలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై శుక్రవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షి ంచారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లా డుతూ, కలెక్టర్లు జిల్లాల్లోని విద్యాసంస్థలు, ఆసు పత్రులు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలిం చాలని సూచిం చారు. ప్రభుత్వ పథకాల అమలులో కలెక్టర్లు అద్భుతంగా పనిచేస్తు న్నారని అభినందించారు. ఇటీవల తుఫాను ప్రభావంతో చోటుచేసు కున్న ప్రమాద సమయం లో ఖమ్మం జిల్లా కలెక్టర్ సకాలంలో స్పందించి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రక్షించిన తీరును ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

ఎల్‌నినో నేపథ్యంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 565 మండలాల్లో ఆవాసాల వారీగా నీటి ఎద్దడి పరిస్థితులను అంచనా వేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిన నేపథ్యంలో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.120 కోట్లు కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఎన్నడూ లేని విధంగా వీబీజీ రామ్ జీ పథకం కింద ప్రస్తుతం రోజుకు రికార్డు స్థాయిలో 5.38 లక్షల పనిదినాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొంటూ, అన్ని పనులను వచ్చే జూన్ మాసాంతంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్రంలో చేయూత పథకం కింద వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులకు సంబంధించి మొత్తం 5.9 లక్షల దరఖాస్తులు అందాయని, వీటిలో 38 వేల దరఖాస్తులు మినహా మిగిలిన అన్నింటి పరిశీలన పూర్తయిందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనను నవంబర్ రెండో వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా మంజూరు చేసిన 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని తెలిపారు.



శుక్రవారం అమెరికన్ కాన్సులేట్ ఉన్నతస్థాయి అధికారులతో చర్చిస్తున్న సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి

కీలక ఖనిజ రంగంలో అమెరికన్ సంస్థలతో సింగరేణి భాగస్వామ్యం

సంస్థ సిఎండితో కాన్సులేట్ ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: కీలక ఖనిజ రంగంలో అమెరికన్ సంస్థలతో కలసి పనిచేసేందుకు సింగరేణి ముందుకొచ్చింది. అమెరికన్ కాన్సులేట్‌కు చెందిన పొలిటికల్, ఎకనామిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్ సారథ్యంలోని ఉన్నత స్థాయి అధికారుల బృందం శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగానికి సంబంధించి ఇప్పటికే పలు దేశాలతో ఉమ్మడి భాగస్వామ్యం, సాంకేతిక సహకారంపై చర్చిస్తోందని వివరించారు. దీనిపై అమెరికన్ బృందం స్పందిస్తూ తమ దేశంలో కీలక ఖనిజ రంగంలోని పలు సంస్థలతో కలిసి పని చేయడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సింగరేణి సంస్థ ఇటీవల కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన జియో సైన్స్ ల్యాబొరేటరీలో ఉన్న సౌకర్యాలు, ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ లో దాగి ఉన్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి అంశాలపై కూడా అమెరికన్ బృందం ఆసక్తి చూపించింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, సహకారంతో సింగరేణి కీలక ఖనిజ రంగంలో ముందుకువెళ్తోందని సిఎండి పేర్కొన్నారు. కీలక ఖనిజ రంగంలో విదేశీ పెట్టుబడులను, సాంకేతిక మరియు పరిశోధన సంస్థల భాగస్వామ్యాన్ని సింగరేణి సంస్థ కోరుతోందని తెలిపారు. అమెరికాలో పలు సంస్థలు ఇటువంటి ఆసక్తిని కలిగి ఉన్నాయని కాన్సులేట్ సభ్యులు తెలియజేశారు. నేటి ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను శోధిస్తున్నామని, తెలంగాణలో సింగరేణి ప్రాంతంలో కూడా వీటి ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని అమెరికన్ ప్రతినిధులు తెలిపారు. మూతపడిన ఓపెన్ కాస్ట్ గనులను సద్వినియోగం చేసేందుకు పలు ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, డాటా సెంటర్లకు పీక్ అవర్స్ లో నిరంతరాయ విద్యుత్ అందించటం కోసం ఈ ప్లాంట్ లు ఉపయోగపడతాయని సింగరేణి అధికారులు వివరించారు. తగిన పెట్టుబడి, భాగస్వామ్యంతో ఈ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే సమీపంలో గోదావరి నది నుండి కూడా నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే పలు అమెరికన్ కంపెనీలు డాటా సెంటర్ లు ఏర్పాటు చేశాయని, మరికొన్ని కంపెనీలు కూడా వీటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు.

గాంధీ మెడికల్ కాలేజీలో నాలుగు ఎండి ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు మంజూరు

ప్రభుత్వ వైద్య వ్యవస్థలో మరో మైలురాయి

హెచ్‌ఒడి డాక్టర్ కె.సునీల్‌కుమార్

హైదరాబాద్ (సికిందరాబాద్), నవంబరు 6, ప్రభాతవార్త: సికిందరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక గాంధీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌కు 4 ఎండి ఎమర్జెన్సీ మెడిసిన్ (ఎమర్జెన్సి మెడిసిన్) పీజీ సీట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా పూరి స్థాయి అత్యవసర వైద్య సేవలు ప్రారంభమయ్యాయని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్, హెచ్‌ఒడీ డాక్టర్ కె. సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. వరంగల్, రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీల తర్వాత ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌ను (ఇఎండి) సాధించిన తెలంగాణలోని మూడో ప్రభుత్వ మెడికల్ కాలేజీగా గాంధీ మెడికల్ కాలేజ్ నిలిచిందని డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి ఉన్న ప్రాముఖ్యత

అత్యవసర పరిస్థితుల్లో వచ్చే బాధితుల ప్రాణాలను కాపాడటంలో ఈ విభాగం ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని డాక్టర్ సునీల్‌కుమార్ వివరించారు. గోల్డెన్ అవర్ వైద్యంలో రోడ్డుప్రమాదాలు, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, తీవ్ర మైన శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మొదటి కొద్దినిమిషాల్లోనే (గోల్డెన్ అవర్) తక్షణ అత్యవసర వైద్యం అందించడం ద్వారా ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య నిపుణులు 24 గంటలూ అందుబాటులో ఉండి, అత్యవసర చికిత్సలను వేగవంతంగా, అత్యుత్తమ ప్రమాణాలతో అందిస్తారు.

గాంధీభవన్ చేరిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపి వంశీకృష్ణ గొడవ

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధిపత్య పోరు



మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నాయకులు వర్గాలు విడిపోయి పోట్లాడుకొంటూ గాంధీభవన్ వరకు వారి పంచాయతీని తీసు కొచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఇద్దరు మంత్రులు కేంద్రంగా ప్రజాప్రతినిధులు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసు కొంటూ పార్టీ పరువును బజారు కీడుస్తున్నారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ కుటుంబంకు, మంత్రి శ్రీధర్ బాబు మధ్య వివాదం మరింత ముదురుతోంది. మంథని నియోజకవర్గ కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న సస్పెన్షన్ల వ్యవహారంను ఎంపి వంశీకృష్ణ ఎత్తి చూపుతూ గత నెల 30న ఢిల్లీలో నిర్వహించిన ఎఐసిసి ర్యాలీకి దుమ్మా కొట్టిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఎమ్మెల్యేలపై ఏలాంటి చర్య తీసుకోవద్దని పెద్దపల్లి ఎంపి వ్యంగ్యంగా రాసిన లేఖ తాజా వివాదంకు కేంద్రంగా మారింది. అంతటితో ఆగకుండా గాంధీభవన్‌లో శ్రీధర్‌బాబుపై ఫిర్యాదులు చేసుకొనే వరకు వివాదంను తారాస్థాయికి తీసుకొచ్చారు. ఎంపి వంశీకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్నారని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే తమను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ ఎంపి వంశీకృష్ణ అనుచరులు గాంధీభవన్‌లో పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. మల్లారం గ్రామంలో నిరుపేద పిల్లలకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసే సేవా కార్యక్రమం లో పాల్గొన్నందుకు తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఏమిటని బాధిత నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు లేఖ రాశారు. ఎలాంటి షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా, తమ వివరణ తీసుకోకుండానే సస్పెన్షన్ విధించడం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు.మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తమకు సస్పె న్షన్ విషయాన్ని తెలియ జేస్తూ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారని లేఖలో ఆరో పిం చారు. స్థానిక రాజకీయాలు, తప్పుడు సమా చారం తోనే తమపై కక్ష పూరితంగా చర్యలు తీసు కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తూ, కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడిన్న అన్‌లైన కార్యకర్తలను సస్పెండ్ చేయడం సరికాదని వంశీకృష్ణ అనుచరులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు

ఆరు ప్రాంతాల్లో 12 ట్రాక్‌లు ఏర్పాటు

రవాణా శాఖ ప్రైవేటు సంస్థ మారుతి సుజుకితో ఒప్పందం

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియలో పారదర్శకత, పరీక్షల్లో కచ్చితత్వం పెంపునకు తెలంగాణ రవాణా శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఇప్పటికే ఒప్పందం చేసుకున్న మారుతీ సుజుకీ సంస్థతో తెలంగాణ రవాణా శాఖ డీల్ కుదుర్చుకుంది. సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో 12 టెస్ట్ ట్రాక్‌లు ఏర్పాటు చేయనుంది. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కొండాపూర్, మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడ్చల్, నాగోల్‌తోపాటు కరీంనగర్‌లో ఈ టెస్ట్ ట్రాక్‌లను ఏర్పాటు చేయ నుంది. సంబంధిత ఆర్టీవో కార్యాలయాల వద్ద ఈ ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్రాంతంలో రెండు చొప్పున మొత్తం 12 ట్రాక్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ట్రాకులను మూడేళ్లపాటు ఒప్పందం చేసుకున్న ప్రైవేటు సంస్థ నిర్వహించనుంది. ఈ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులను అందుబాటులోకి తెచ్చిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఈ ట్రాకులకు కావాల్సిన ఆటోమేషన్, నిర్వహణ చూసేలా ఒప్పందం కుదిరింది. మరోవైపు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకులలో మానవ ప్రమేయం ఉండదు. నైపుణ్యం కలిగిన వ్యక్తులే డ్రైవింగ్ లైసెన్సులు పొందేలా ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు.

నమ్మిన భర్తే కాలయముడయ్యాడు!

బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లికి దక్కని ఓదార్పు.. చివరకు ప్రాణాలే తీసిన భర్త

సంచిలో కట్టి గోదావరిలో పడేసిన వైనం

కొత్తగూడెం క్రైమ్, నవంబరు 6, ప్రభాతవార్త: ప్రేమించింది.. నమ్మింది.. జీవితాంతం తోడుంటాడని కుటుంబాన్ని సైతం కాదని పెళ్లి చేసుకుంది. కష్టసుఖాల్లో అండగా ఉంటాడని భావించిన భర్తే చివరకు ఆమె పాలిట కాలయముడయ్యాడు. కడదాకా తోడుంటానని ఏడడుగులు నడిచిన వ్యక్తే ఆమె ప్రాణాలను బలిగొన్నాడు. ప్రేమించి పెళ్లాడిన భార్య భవాని (30)ని భర్త, ఏఆర్ కానిస్టేబుల్ నరేందర్ హత్య చేసిన ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. భవాని, నరేందర్‌ల పరిచయం సోషల్ మీడియా వేదికగా మొదలైంది. పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరూ రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కుటుంబాన్ని కాదని ఒక్కటైన ఈ జంట కొత్తగూడెంలోని ప్రగతినగర్‌లో కాపురం పెట్టారు. ఎన్నో ఆశలతో కొత్త జీవితాన్ని ప్రారంభించిన భవాని జీవితం చివరకు విషాదాంతంగా ముగుస్తుందని ఎవరూ ఊహించలేదు.



భవాని (ఫైల్)

కన్నబిడ్డను కోల్పోయిన కడుపుకోత

వివాహమైన కొంతకాలానికి భవాని తల్లి అయింది. అయితే ఎనిమిది నెలల క్రితం పుట్టిన బిడ్డ మరణించడంతో ఆమె తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కన్నబిడ్డను కోల్పోయిన తల్లి బాధ వర్ణనాతీతం. అలాంటి సమయంలో భార్యకు ధైర్యం చెప్పి అండగా నిలవాల్సిన భర్తే వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూడు రోజుల క్రితం హత్య.. గోదావరిలో మృతదేహం

గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు, వేధింపులు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం భవానిని హత్య చేసిన నరేందర్, ఆమె మృతదేహాన్ని సంచిలో మూటకట్టి భద్రాచలం వద్ద గోదావరి నదిలో పడేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.నదిలో కొట్టుకొచ్చిన భవాని మృతదేహం బూర్గంపాడు సమీపంలోని గొమ్మూరు ఇసుక రాంప్ వద్ద ఒడ్డుకు చేరింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు ఆపేస్తారా?

నల్ల మల్లారెడ్డి స్కూల్‌పై గద్వాల విజయలక్ష్మి సీరియస్

హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 6,ప్రభాతవార్త: ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు ఆపేస్తారా? నల్ల మల్లారెడ్డి స్కూల్‌పై గద్వాల విజయలక్ష్మి సీరియస్ అయ్యారు. 10వ తేదీలోగా విద్యార్థినుల సర్టిఫికెట్లు అందేలా చూడాలని. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించ బోమని, ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని సిఎం ప్రజా వాణి రాష్ట్ర స్థాయి ఇన్ చార్జి గద్వాల విజయ లక్ష్మి హెచ్చరించారు. ఫీజులు చెల్లించినప్పటికీ ఇద్దరు మైనర్ విద్యార్థి నుల అకడమిక్ సర్టిఫి కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఫిర్యాదుపై ఘట్కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ వ్యవహారంపై రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్‌చైర్‌పర్సన్, సిఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జి గద్వాల విజయలక్ష్మి తీవ్రంగా స్పందించారు.



సిఎం ప్రజావాణి రాష్ట్రస్థాయి ఇన్‌చార్జి గద్వాల విజయలక్ష్మిని కలిసిన బాలికలు.

సీఎం ప్రజావాణిని ఆశ్రయించిన ఇద్దరు బాలికలు తమకు అవసరమైన సర్టిఫికెట్లు అందక చదువు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని గద్వాల విజయలక్ష్మిని కలిసి ఆవేదన వ్యక్తంచేశారు. ఆమె వెంటనే స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ సోమిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఫీజులు చెల్లించిన తర్వాత కూడా పిల్లల సర్టిఫికెట్లు ఎందుకు నిలిపి వేస్తున్నారు. 10వ తేదీలోగా వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు కూడా ఆమె అధికారికంగా లేఖ రాశారు.

సిఎం రేవంత్‌పై అభిమానంతో 350 కి.మీ. పాదయాత్ర

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుసుకోవాలన్న బలమైన ఆకాంక్షతో ఓ అభిమాని ఏకంగా కర్నూలు జిల్లా ఆదోని నుంచి కాలినడకన హైదరాబాద్ చేరుకున్నారు. ఆదోనికి చెందిన తాయన్న దాదాపు 350 కి.మీ. మేర కాలినడకన ప్రయాణించి, జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రిని కలుసుకుని తన అభిమానాన్ని చాటుకున్నారు. అక్టోబర్ 29న కర్నూలు జిల్లా ఆదోని నుంచి బయలుదేరిన తాయన్న, 9 రోజుల పాటు కాలినడకన ప్రయాణించి నేడు హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తాయన్నకు శాలువా కప్పి ఆత్మీయంగా అభినందించారు

శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం

నాగోల్ శ్రీచైతన్య నీట్ ఆకాడమిలో నిర్వహణ

600 మందికిపైగా సిబ్బంది స్వచ్ఛంద రక్తదానం

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: సమాజ శ్రేయస్సులోనూ మేము సైతం అంటూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకున్నాయి. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా శుక్రవారం నాగోల్ శ్రీచైతన్య మెట్రో క్యాంపస్ లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరియు ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్ నగర్ జోన్ పరిధిలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్స్ మరియు కళాశాలలకు చెందిన 600 మందికి పైగా సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. సామాజిక సేవ పట్ల తమకున్న నిబద్ధతను చాటుతూ ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉప్పల్ జోన్ ఎడిషనల్ డీసీపీ ఎన్. వెంకట రమణ, ఏసీపీ వై. వెంకటరెడ్డి, ఎస్.హెచ్.ఓ. వై. రామ లింగారెడ్డితో పాటు ప్రముఖ సినీ నటుడు దిల్ రమేష్ పాల్గొని ఈ బృహత్తర కార్యక్రమంలో రక్తదానం చేసిన శ్రీచైతన్య సిబ్బందిని అభినందించారు. విద్యారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలను సాధిస్తూ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యతో పాటు సామాజిక సేవలోనూ ఎల్లప్పుడూ ముందుంటున్నాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ పలు సహాయక కార్యక్రమాలను చేపట్టి సమాజం పట్ల



తమ బాధ్యతను చాటుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ, "41 ఏళ్ల క్రితం డాక్టర్ బీఎస్ రావు నాటిన చిన్న విద్యావిత్తనం నేడు మహావృక్షంగా ఎదిగి. ప్రపంచం గర్వించే మేధావులను అందించే స్థాయికి చేరడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రస్థానం వెనుక ఆయన అంకితభావం, దూరదృష్టితో పాటు శ్రీ చైతన్య బోధన, బోధనేతర సిబ్బంది కృషి వెలకట్టలేనిది. డాక్టర్ బీఎస్ రావు భౌతికంగా మన మధ్య లేకపోయినా. ఆయన ఆశయాలు ఎల్లప్పుడూ మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఆ విజయపరంపరను కొనసాగిస్తున్న మా కుమార్తెలు, అకడమిక్ డైరెక్టర్లు సుష్మ, సీమలను అభినందిస్తున్నాను. నా జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న శ్రీచైతన్య కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు.శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ, "శ్రీ చైతన్య విద్యాసంస్థలు ఈ స్థాయికి చేరుకోవడం వెనుక మా తల్లిదండ్రుల త్యాగం, కృషి ఎంతో ఉన్నాయి. ఆమె జన్మదిన శుభసందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని తమ సామాజిక బాధ్యతను చాటుకోవడం ఎంతో అభినందనీయం' అని అన్నారు. శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యా సంస్థలు విద్యారంగంలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఎప్పుడూ ముందుంటాయి. మా అమ్మగారు డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో వందలాది మంది సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణలో ఇంటింటికీ ఇంటర్నెట్‌కు లైన్‌క్లియర్

రాష్ట్రానికి రానున్న కేంద్ర నిధులు రూ.3,185 కోట్లు

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: తెలంగాణలో ఇంటింటికీ ఇంటర్నెట్‌కు లైన్ క్లియర్ అయింది. కేంద్రంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ ద్వారా ఒప్పందం కుదిరింది. ఢిల్లీలో జరిగిన భేటీలో ఒప్పంద పత్రాలపై అనుదీప్ దురిశెట్టి సంతకాలు చేశారు. కార్యక్రమం కింద రాష్ట్రానికి అదనంగా రూ.3,185 కోట్ల కేంద్ర నిధులు రానున్నాయి. కేంద్రం, రాష్ట్రం కలిసి ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు కానుంది. దీనికి సీఈవోగా టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ వ్యవహరిస్తారు.

దూదిమెట్ల బాలరాజు క్షయాదవ్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నా: కెటిఆర్

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు.ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుడిని అరెస్టు చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదు.అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం అని తప్పుపట్టారు..అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు. బాలరాజు యాదవ్‌పై కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాయలేరు అని పేర్కొన్నారు.


కెపిహెచ్‌బి కాలనీలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్

కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి భూములను అమ్మొద్దు

ప్రజాప్రయోజనాలకు వినియోగించండి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), నవంబరు 6, ప్రభాతవార్త: ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన భూములను అమ్ముకోవడం మానుకోవాలని అధికార ప్రభుత్వంపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం కెపిహెచ్‌బి భూముల అమ్మకాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి ప్రాంతాల్లో సుమారు రూ.2,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు వంటి అనేక ప్రజా అవసరాల సదుపాయాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అలాంటి ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం దురదృష్టకరమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన భూములను అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతమ్ వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను అమ్మేస్తే భవిష్యత్ తరాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మియాపూర్ భూముల విషయంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్‌బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అసోసియేషన్ సభ్యులు స్థానికప్రజలు పాల్గొన్నారు.

కొల్లూరు మూకాంబికా దేవిని దర్శించుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొల్లూరు శ్రీ మూకాంబికా దేవిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, ఎన్.వి. సుభాష్ కూడా అమ్మవారి దర్శనంలో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు గారు మాట్లాడుతూ.. జగన్మాత మూకాంబికాదేవి కృపాకటాక్షాలతో తెలంగాణ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే దీపావళి వెలుగులు ప్రజల జీవితాల్లో ఆనందాలు నింపాలని ఆకాంక్షిస్తూ, యావత్ తెలంగాణ ప్రజానీకానికి ఆయన ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



ముచ్చింతల్‌లో ఘనంగా చినజీయర్‌స్వామి 70వ జన్మదిన వేడుకలు

రేపటి నుంచి 12 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

హైదరాబాద్ (శంషాబాద్), నవంబరు 6, ప్రభాతవార్త : శంషాబాద్ ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యతీంద్ర సప్తతి పేరుతో ఈనెల 8 నుంచి 12 వరకు ఐదు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం సమతామూర్తి ప్రాంగణంలో నిర్వాహకులు మాట్లాడుతూ. సమతామూర్తి ప్రాంగణంలో జరిగే ఈ వేడుకల్లో దేశంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు, సాధువులు, ఆధ్యాత్మిక ప్రముఖులు పాల్గొననున్నారు.8న సుందరకాండ పారాయణం, ప్రత్యేక పూజలు, జీయర్ పురస్కారాల ప్రదానం నిర్వహిస్తారు. 9న సుందరకాండ పారాయణంతో పాటు ఆచార్య వైభవం, 108 దేవాలయాల ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి.

10న లోకశాంతి కోసం విష్ణు సహస్రనామ పారాయణం, మంగళ తరంగిణి, నరసింహ స్వామికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని 11న దేశానికి విశిష్ట సేవలందించిన 70 మంది ప్రముఖులకు సమతా పురస్కారాలు అందజేయడంతో పాటు, సమాజ సేవలో ప్రత్యేక గుర్తింపు పొందిన 70 మంది మహిళా సాధకులను మాతృ సవనంతో సత్కరించనున్నట్లు తెలిపారు12న శ్రీకోదండ రామాలయంలో ఏకోత్తర సహస్ర కలశాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భక్తులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

ఆదాయంపై ప్రత్యేక దృష్టి.. వనరుల బలోపేతానికి సమగ్ర కార్యాచరణ

నిర్ణీత గడువుల్లో లక్ష్యాలను సాధించాలి

ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ

ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగం

మంత్రివర్గ ఉపసంఘంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త : రాష్ట్రానికి అదనపు ఆదాయం వేగవంతంగా సమకూరడంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను గుర్తించాలన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు డి శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావుతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువుల్లో సాధించేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు, పారిశ్రామిక లేఅవుట్లు, ల్యాండ్ పూలింగ్, భూముల వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు స్పష్టమైన లక్ష్యాలు, శాఖల మధ్య సమన్వయం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి శాఖ వారాలవారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పారిశ్రామిక లేఅవుట్లు, పాత పారిశ్రామికవాడల్లో భూముల వినియోగం, క్రమబద్ధీకరణ ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో యూనిట్లవారీగా భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని సూచించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి సమకూరే భూ వనరులను అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని, అదనపు ఆదాయం సమకూర్చే మార్గాలను గుర్తించాలన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వ వాటాగా లభించే భూములను నిర్దిష్ట ప్రజా అవసరాలకు వినియోగించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన అంశాలను చట్టపరమైన నిబంధనలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలను మంత్రివర్గ పరిశీలనకు సమర్పించాల తెలిపారు. వేలానికి అనువైన లేఅవుట్లను గుర్తించాలని, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం, అభివృద్ధికి అవకాశాలు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూముల వేలం ప్రక్రియను దశలవారీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, లేఅవుట్ల అభివృద్ధి, వేలం సంబంధిత కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్‌బోర్డ్ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తుల విలువను పెంచడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించడం, ఆదాయ సమీకరణకు కొత్త మార్గాలను గుర్తించడం ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల పిలుపునిచ్చారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

హాకీంపేటలో మెగా రైతు మేళా

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇందులో భాగంగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హాకీంపేటలో మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ 7న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ఈ మేళా ప్రారంభం కానుందని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రిగారు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చలు జరపడమే కాకుండా పారిశ్రామిక వేత్తలతోనూ సమావేశమ వుతారని వివరించారు.

రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను పరిచయం చేయడమే మెగా రైతు మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఈ కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని చెప్పారు. మెగా రైతు మేళాలో ఏర్పాటు చేస్తున్న 150 ప్రదర్శన స్టాళ్ల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన సాగు పద్ధతులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. సాగు ఖర్చులు తగ్గించి, రైతులు పండించిన పంటలకు మంచి ధర, విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన రైతు అభ్యున్నతి సాధ్యమవుతుం దన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్ డిమాండ్‌ను గుర్తించి పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పు ధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.

మిస్‌యూనివర్స్ పోటీలకు కేరళ ముద్దుగుమ్మ కజియా లిజ్‌మేజో

న్యూఢిల్లీ, నవంబరు 6: మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటాన్ని కైవసం చేసుకున్న కేరళకు చెందిన 19 ఏళ్ల వయసు అందాల తార కజియా లిజ్ మేజో ఇప్పుడు ఏకంగా ప్రపంచ వేదికపై తలపడేందుకు విమానం ఎక్కేసారు. ప్రతిష్టాత్మక 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో మన దేశం తరఫున త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించడానికి ప్యూర్టో రికోకు బయలుదేరిన ఈ ముద్దుగుమ్మకు ఢిల్లీ విమానాశ్రయంలో అభిమానులు నీరాజనాలు పట్టారు. దేశం మొత్తం గర్వపడేలా గ్లోబల్ స్టేజ్‌పై సత్తా చాటేందుకు ఆమె అడుగుపెడుతున్న తీరు యువతలో అంతులేని ఉత్సాహాన్ని నింపుతోంది. అంతర్జాతీయ వేదికపై అడుగుపెడుతున్న వేళ కజియా ధరించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ డిజైనర్ సమంత్ చౌహాన్ తీర్చిదిద్దిన ముదురు ఎరుపు (డీప్ మెరూన్) రంగు చీరలో ఆమె రాజసంగా కనిపించారు. చీరపై మెరిసే బంగారు దారపు కుట్లు, అప్లిక్ డిజైన్లు ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేశాయి. తలపై మిస్ యూనివర్స్ ఇండియా కిరీటంతో, మెడలో అందమైన చోకర్‌తో ఆమె ఎయిర్‌పోర్ట్‌లో నడుచుకుంటూ వస్తున్న తీరు చూసేవారికి కనువిందు చేసింది.

ఒబిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 6: ఓబీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో మార్చిలో ఇచ్చిన తీర్పుతో తలెత్తిన వివాదానికి సుప్రీంకోర్టు ఇవాళ ముగింపు పలికింది. ఉద్యోగాల్లో ఓబీసీ రిజర్వేషన్ల వర్తింపు కోసం క్రిమీలేయర్ (అభివృద్ధి చెందిన వారికి రిజర్వేషన్ వర్తింపచేయకపోవడం) అమలుకు తండ్రి వేతనం, వ్యవసాయ ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మినహాయించాలని సుప్రీంకోర్టు మార్చి 11న తీర్పు ఇచ్చింది. అయితే దీన్ని అమలు చేయాలంటే గతంలో జరిగిన నియామకాలన్నింటినీ పరిశీలించాలని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనికోసం సమగ్ర విధానాన్ని అమల్లోకి తేవాలంటే రెండేళ్ల గడువు ఇవ్వాలని కేంద్రం సుప్రీంకోర్టును కోరింది. దీనిపై సుప్రీం స్పష్టత ఇచ్చింది. ఈ ఏడాది మార్చి 11న ఓబీసీ క్రిమిలేయర్ ఖరారు కోసం తల్లితండ్రుల వేతనం, వ్యవసాయ ఆదాయాన్ని పిల్లల విషయంలో మినహాయించాలంటూ యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రోహిత్ నాథన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అంతకు ముందు కేంద్రం ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ఉద్యోగుల పిల్లల విషయంలో ఈ రెండు ఆదాయాల్ని మినహాయించింది. అయితే ప్రైవేటు విషయంలో మాత్రం ఈ మినహాయింపు లేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అన్యాయం జరుగుతోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు అన్న తేడా లేకుండా అందరికీ వారి క్రిమీలేయర్ స్టేటస్ ఖరారులో తల్లితండ్రుల వేతనాలు, వ్యవసాయ ఆదాయాన్ని మినహాయించాలంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

పుష్కర పనుల్లో జాప్యం వద్దు

నిర్దేశిత గడువులో పనులు పూర్తి

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

సాంఘిక సంక్షేమ మంత్రి లక్ష్మణ్‌కుమార్

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: గోదావరి పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కరాల సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతోపాటు, పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రాకపోకలకు అనుగుణంగా రహదారులు, పుష్కర ఘాట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్తు, వైద్య సదుపాయాలు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర మౌలిక వసతులను సమగ్రంగా కల్పించాలని సూచించారు. ఒక శాఖ పనుల వల్ల మరో శాఖ పనులకు ఆటంకం కలగకుండా ముందస్తు కార్యాచరణతో అన్ని శాఖలూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దుపుష్కరాల కోసం చేపడుతున్న ప్రతి పనికి సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతి, ఇంకా ప్రారంభం కావాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం, పూర్తి చేయాల్సిన గడువులతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులు తరచూ పర్యటిస్తూ పనుల నాణ్యతను పరిశీలించాలని, కాంట్రాక్టర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యేకించి పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సురక్షితంగా పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు ప్రత్యేక మార్గాల రూపకల్పనపై దృష్టి సారించాలని సూచించారు.

పుష్కరాల సమయంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, గోదావరి నది పరిశుభ్రతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, ఆహారం, విశ్రాంతి కేంద్రాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

ఫ్యూచర్ రిటైల్ కిశోర్ బియానీపై సిబిఐ కేసు నమోదు

రూ.904.32 కోట్ల బ్యాంకు మోసం ఆరోపణలు

కిషోర్ బియానీ నివాసాల్లో సోదాలు



ముంబయి, నవంబరు 6: ఫ్యూచర్ రిటైల్ సంస్థతో పాటు ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ బియానీపై రూ.904.32 కోట్ల మేర బ్యాంకు మోసానికి సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో భాగంగా శుక్రవారం ముంబైలో కిషోర్ బియానీకి సంబంధం ఉన్న పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. కిషోర్ బియానీ సోదరుడు రాకేశ్ బియానీ పేరును కూడా సీబీఐ చేర్చింది. మోసం చేసేందుకు నేరపూరిత కుట్రకు పాల్పడటం, అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్3, ముంబై ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఫ్యూచర్ రిటైల్ లిమిటెడ్, దాని ప్రమోటర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, హామీదారులైన కిషోర్ బియానీ, రాకేశ్ బియానీలతో పాటు గుర్తుతెలియని ప్రభుత్వ అధికారులు, ఇతరులపై కేసు నమోదు చేసినట్లు సీబీఐ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో వెల్లడించారు.



నీటి వినియోగంలో దుబారా నియంత్రించండి

నరెడ్‌కో ఆధ్వర్యంలో ఎల్‌నినోపై వర్క్‌షాపు

హైదరాబాద్, నవంబరు 6,ప్రభాతవార్త: నీటి వినియోగంలో దుబారాను నియంత్రించుకోవాలని నారెడ్‌కో ఆధ్వర్యంలో ఎల్‌నినోపై జరిగి వర్క్‌షాపులో వక్తలు అన్నారు. శుక్రవారం నారెడ్‌కో తెలంగాణ క్రెడాయిహైదరాబాద్ ఎల్‌నినో కాంటినిజెన్సీ అంశాలపై వర్క్‌షాప్‌ను నిర్వహించాయి, ఇందులో జిహెచ్ఎంసి, హైడ్రా,హెచ్ఎండబ్ల్యు ఎస్ఎస్ బి మున్సిపల్ కార్పొరేషన్ల సీనియర్ అధికారులు మాట్లాడారు. ఎల్‌నినో కారణంగా హైదరాబాద్‌లో గురువారం రెండులక్షల ఇరువైవేల వాటర్ ట్యాంకర్లు బుక్‌చేయబడ్డాయని ఇది గత సంవత్సరంతో పోల్చితే 60శాతం అధికమని తెలిపారు. పరిస్థితి అదుపు తప్పకుండా భూగర్భ జలాలలను పరిక్షణ చేసుకోవానలి వారు కోరారు. పట్టణప్రాంతాల్లో భూగర్బజల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. ముఖ్యంగా కార్లు,విలాస అంశాలకు నీటిని వినియోగం తగ్గించాలని ప్రతి మనిషి రోజుకు తాగునీరు కాకుండా 10 లీటర్ల కంటే అధికంగా నీరు వినియోగించకుండా స్వీయ నియంత్రణచేసుకొనాలని సూచించారు.


సోషల్‌మీడియాలో మార్ఫింగ్ ఫోటోలు, విడియోలు పెడ్తామంటూ

ఎమ్మెల్సీని బ్లాక్‌మేయిల్ చేసిన ముఠా

రూ.5.కోట్లు డిమాండ్.. రూ.5.లక్షలు వసూలు

ఆరుగురు ముఠా సభ్యుల రిమాండ్

హైదరాబాద్ (నార్సింగి), నవంబరు 6, ప్రభాతవార్త : రూ.5.కోట్ల డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు పెడ్తామని ఏకంగా శాసన మండలి సభ్యుడు మీర్జా రహ్మత్‌బేగ్‌ను ఓ ముఠా బ్లాక్‌మేయిల్ చేసింది. రూ.5లక్షలు వసూలు చేసి, మరో 5.లక్షలు కావాలని బ్లాక్‌మేయిల్‌కు దిగడంతో సదరు ఎమ్మెల్సీ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రూ.4.లక్షల 70.వేలు తీసుకుంటుండగా సదరు ముఠాలోని 6.గురు సభ్యులను పట్టుకొని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి నగదుతో పాటు రెండు ఆటోలు, 6.మొబైల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 5.వ,తేదీన ఫాతిమా బేగం అలియాస్ రీమా(ఎ-3) మరో నలుగురితో కలిసి ఇబ్రహీంబాగ్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంకు వెళ్లింది. అక్కడ ఎమ్మెల్సీ నుంచి నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుంది. ఎమ్మెల్సీ ఫిర్యాదు మేరకు మాటు వేసిన నార్సింగి పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి ఫాతిమాతో పాటు మహ్మద్ మోహసీన్‌ఖాన్(35), మహ్మద్ సమీర్(20), మహ్మద్ జమీర్(20), మహ్మద్ ఇమ్రాన్(18), సయ్యద్ రెహాన్(20)లను అరెస్టు చేశారు. వీరంతా చంద్రాయణగుట్ట, బండ్లగూడ ప్రాంతానికి చెందిన వాళ్లు. వీరు త్వరగా డబ్బులు సంపాదించాలని, ఆర్థిక ఇబ్బందులను తొలగించుకోవాలని దుష్ట పన్నాగం పన్నారు. అందరూ కలిసి ఓ ముఠాగా ఏర్పడి ఎమ్మెల్సీ మీర్జా రహ్మద్‌బేగ్‌ను బ్లాక్‌మేయిల్ చేయడం ప్రారంభించారు. ముందుగా రూ.5.కోట్లు డిమాండ్ చేశారు. రూ.5లక్షల వసూలు చేసుకున్నారు. మళ్లీ రూ.5.లక్షలు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో మీ ఫొటోలు, వీడియోలు పెట్టి రాజకీయ ప్రతిష్టకు భంగం కలిగిస్తామని, ప్రాణహాని తలపెడ్తామని హెచ్చరించి, పోలీసుల వలకు చిక్కారు. ఈ ముఠాలోనే ఉన్న ఎ-1, ఎ-4 నుంచి ఎ-9, ఎ-14లు పరారీలో ఉన్నారని, వీరిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలి పారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.


మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలతో ఎమ్మెల్సీని బ్లాక్‌మేయిల్ చేసిన ముఠా సభ్యులు వీరే.

ప్రజలకు సైబరాబాద్ పోలీసుల విజ్ఞప్తి

మార్ఫింగ్ ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోల పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే భయపడవద్దని, వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. తప్పుడు, మార్ఫింగ్, డీప్‌ఫేక్ కంటెంట్‌లను ఇతరులకు ఫార్వర్డ్ చేయడం, ప్రచారం చేయడం చట్టపరమైన చర్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

బిసి స్టడీ సర్కిల్ విద్యార్థులకు స్టైపెండ్ పెంపు

హైదరాబాద్,నవంబరు6,ప్రభాతవార్త: రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్టైపెండ్ పెంచినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్ విద్యార్థులకు నెలవారీ స్టైఫండ్‌ను రూ.5 వేల నుంచి రూ.7 వేలకు, ఫౌండేషన్ కోర్సు విద్యార్థులకు రూ.1,000 నుంచి రూ.1,500కు పెంచినట్లు చెప్పారు. ఈ పెంపు నవంబర్ నుంచి అమల్లోకి వస్తుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్స్ విద్యార్థులకు వార్షిక బుక్ ఫండ్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచినట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ చరిత్రలో తొలిసారిగా గత రెండేళ్లలో సివిల్స్ కోచింగ్ పొందిన పూర్వ విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా తిరిగి ప్రవేశం కల్పించి, స్టైఫండ్ సౌకర్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి కేంద్రంలో స్టడీ రూమ్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించేందుకు నిరంతర అధ్యయనం, క్రమబద్ధమైన సాధన అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కమిషనర్ బాలమాయాదేవి, బీసీ స్టడీ సర్కిళ్ల డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

అండర్ 19 ఆసియా కప్.. భారత్ ఘన విజయం





10 వికెట్ల తేడాతో నేపాల్ చిత్తు

మస్కట్: అండర్ 19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. నేపాల్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. టీమిం డియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్(52 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 70 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నేపాల్ అండర్ 19 టీమ్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. దర్ష్ సోనార్(93 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 43) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్(3/18), అర్జున్ రాజ్‌పుత్(3/8) మూడేసి వికెట్లు తీయగా, యశ్వీర్ గౌడ్(2/25) రెండు వికెట్లు పడగొట్టాడు. కావ్య, మనాల్ చౌహాన్ తలో వికెట్ తీసారు. అనంతరం భారత అండర్ 19 టీమ్ 19.1 ఓవర్లలో 129 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఆర్యవీర్ సెహ్వాగ్‌తో పాటు, కెప్టెన్ లక్ష్య రాయ్‌చందని (63 బంతుల్లో 7 ఫోర్లతో 53నాటౌట్) రాణించాడు. ఈ ఇద్దరూ అజేయంగా 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారీ సిక్స్‌లతో విరుచుకుపడిన ఆర్యవీర్ సెహ్వాగ్ 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన లక్ష్య రాయ్‌చందని 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ విజయంతో భారత అండర్ 19 టీమ్ గ్రూప్ ఏ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వే ద్రవిడ్ కూడా ఆడగా అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్థాన్‌తో ఆడనుంది.

చైనా ఛాంపియన్ షిప్‌లో..
ప్రణవి విజయం



షెన్‌జెన్ (చైనా): షెన్‌జెన్‌లోని మిషన్ హిల్స్ చైనాలో జరుగుతున్న 2026 చైనా ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శుక్రవారం ప్రణవి ఉర్స్ తన రెండవ తొమ్మిది హోల్స్ మొత్తం వరుస పార్ స్కోర్లతో కట్ లైన్‌ను నిలబెట్టుకుని, విజయంతో చివరి రెండు రౌండ్లకు అర్హత సాధించింది. మొదటి రోజు ఈవెన్ పార్ 73 స్కోర్ చేసిన ప్రణవి, 36 హోల్స్ తర్వాత 1అండర్ 72 స్కోర్‌ను జోడించి, మొత్తం 1 అండర్ స్కోర్‌తో వారాంతపు పోటీలకు అర్హత సాధించింది. ఆసియా క్రీడల విజేత, గత నెలలో జరిగిన మహిళల ఇండియన్ ఓపెన్‌లో నాలుగో స్థానంలో నిలిచిన ప్రణవి, ప్రస్తుతం సంయుక్తంగా 58వ స్థానంలో ఉంది. ప్రణవి బ్యాక్ నైన్‌ను తన మొదటి రెండు హోల్స్ అయిన 10వ, 11వ హోల్స్‌లో బర్డీలతో ప్రారంభించింది. కానీ 12వ, 14వ హోల్స్‌లో ఆ రెండింటినీ కోల్పోయింది. పార్5 18వ హోల్‌లో బర్డీతో ఒక షాట్ తిరిగి సాధించి, ఆ తర్వాత రెండవ తొమ్మిది హోల్స్ మొత్తాన్ని పార్ చేసింది. చైనాకు చెందిన లికి జెంగ్ 36 హోల్స్ ముగిసేసరికి 12అండర్‌పార్ స్కోరుతో స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నారు. జెంగ్ తన రౌండ్‌ను 10వ హోల్‌లో హోల్‌అవుట్ ఈగిల్‌తో ప్రారంభించి, 13వ హోల్‌లో ఆ రోజు తన మొదటి బర్డీని సాధించింది. ఈ చైనీస్ స్టార్ నాలుగో హోల్‌లో ఒక షాట్ కోల్పోయినప్పటికీ, ఆరు, ఏడు హోల్స్‌లో వరుసగా బర్డీలు సాధించి, తొమ్మిదో హోల్‌లో మరో షాట్‌ను కోల్పోయి, 69 (4) స్కోరుతో రౌండ్‌ను ముగించి, 12అండర్‌పార్ స్కోరుతో ఆధిక్యంలో నిలిచింది.

ఉత్కంఠ పోరులో..
హైదరాబాద్ హ్యాట్రిక్ విక్టరీ
చత్తీస్‌గఢ్‌పై ఒక్క వికెట్ తేడాతో గెలుపు



రాయపూర్: ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026-27లో హైదరాబాద్ దుమ్మురేపుతోంది. నాలుగు మ్యాచ్‌లు పూర్తయ్యేసరికి ఓటమెరుగని జట్టుగా ఎలైట్ గ్రూప్ బి టాపర్‌గా నిలిచింది. చత్తీస్‌ఘడ్‌తో జింఖాన మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఒక్క వికెట్ తేడాతో గెలుపొందింది. 259 పరుగుల లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన హైదరాబాద్, 79.4 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగులు చేసి గెలుపొందింది. టెయిలెండర్స్ అనికేత్‌రెడ్డి(56 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 39 నాటౌట్), రక్షన్‌రెడ్డి(66 బంతుల్లో సిక్స్‌తో 15 నాటౌట్) అద్వితీయమైన బ్యాటింగ్ చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు. ఈ ఇద్దరూ ఆఖరి వికెట్‌కు 39 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వరుణ్‌గౌడ్(55), అభిరత్‌రెడ్డి(68 హాఫ్ సెంచరీలతో రాణించారు. ఈ మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌటైంది. అనంతరం చామ మిలింద్ సారథ్యంలోని హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు చేసింది. రాహుల్ రాదేశ్(72), హిమతేజ(46) టాప్ స్కోరర్లుగా నిలిచారు. 4 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చత్తీస్‌ఘడ్ రెండో ఇన్నింగ్స్‌లో 254 పరుగులకు ఆలౌటైంది. దాంతో హైదరాబాద్ ముందు 259 పరుగుల లక్ష్యం నమోదు కాగా కష్టపడి ఛేదించింది.

భారీ వర్ష సూచనతో..
భారత్, న్యూజిలాండ్ రెండో వన్డే డౌట్



వెల్లింగ్టన్: ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్-న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన రెండో వన్డే రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శనివారం వెల్లింగ్టన్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ వర్షంతో టాస్ పడకుండానే తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం వెల్లింగ్టన్‌లో భారీ వర్షం కురుస్తోంది. దాంతో శుక్రవారం జరగాల్సిన ప్రాక్టీస్ సెషన్‌ను భారత్ రద్దు చేసుకోగా, న్యూజిలాండ్ ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసింది. శనివారం తొలి అర్ధ భాగంలో 60 శాతం, సెకండాఫ్‌లో 55 శాతం వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేకు కూడా వర్షం అంతరాయం కలిగించిన సంగతి తెలిసిందే. వర్షం కారణంగా 10 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్ ఆ తర్వాత రెండు సార్లు అంతరాయం కలిగించడంతో 40 నిమిషాల ఆట తుడిచిపెట్టుకుపోయింది. దాంతో భారత్ లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్దతి ప్రకారం రెండు సార్లు కుదించారు. చివరకు భారత్ విజయం సాధించి ఈ సిరీస్‌లో శుభారంభంతో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇదే జోరులో రెండో వన్డేలోనూ విజయం సాధించాలని భావిస్తున్న భారత్‌కు వరణుడు అడ్డంకిగా మారాడు. తొలి వన్డే తరహాలో ఓవర్లను కుదించి ఆడించే పరిస్థితి కూడా వెల్లింగ్టన్‌లో కనిపించడం లేదు. మూడో వన్డే ఈ నెల 10న హామిల్టన్ వేదికగా నాలుగో వన్డే, ఐదో వన్డే 13, 15 తేదీల్లో మౌంట్ మోంగనుయి వేదికగా జరగనుంది.

ఆసియా ఛాంపియన్స్..
ఛాంపియన్‌గా భారత్
4-1 తేడాతో జపాన్ పరాజయం



పంజాబ్: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2026 ఫైనల్‌లో భారత పురుషుల హాకీ జట్టు జపాన్‌ను 4-1 తేడాతో ఓడించింది. దీంతో భారత్ తమ టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుని, రికార్డు స్థాయిలో ఆరో ఛాంపియన్‌షిప్‌ను నమోదు చేసింది. పోటీ అంతటా అజేయంగా నిలిచిన భారత్, ఫైనల్ పోరులో జపాన్‌ను ఓడించింది. మూడవ నిమిషంలో కజుమాసా మత్సుమోటో ద్వారా జపాన్ ఆధిక్యం సాధించిన తర్వాత, మూడవ నిమిషంలో జపాన్ తొలిగోల్ చేయడంతో మ్యాచ్ ప్రారంభమైంది. కజుమాసా మత్సుమోటో స్కోరింగ్‌ను ప్రారంభించి, హాఫ్ టైమ్ వరకు జపాన్ తన 10 ఆధిక్యాన్ని నిలుపుకోవడంలో సహాయపడ్డాడు. అయితే, రెండవ భాగంలో భారత్ చాలా బలంగా ప్రారంభించింది. ఆతిథ్య జట్టు వరుసగా 4గోల్స్ చేసి ఆటను పూర్తిగా తమ వైపు తిప్పుకుని ఏకపక్షంగా మార్చేసింది. భారత జట్టు కేవలం 12 నిమిషాల్లో 4 గోల్స్ చేసి, తమ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠభరితమైన పునరాగమనాలలో ఒకటిగా నిలిచి 4-1 తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. జపాన్ ప్లేయర్ కజుమాసా మత్సుమోటో 3వ నిముషంలో గోల్ చేయగా, భారత్ జట్టులోని శిలానంద్ లక్రా 42వ నిముషంలో, దిల్‌ప్రీత్ సింగ్ 48వ నిముషంలో, జుగ్రాజ్ సింగ్ 53వ నిముషంలో, చివరిగా వివేక్‌సాగర్ ప్రసాద్ 54వ నిముషంలో గోల్ చేసి భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపారు.

రెట్టింపు ధరకు మాక్స్‌వెల్ షేర్లు
ఇష్యూ ధర కంటే ప్రీమియంలో ర్యాలీ




ముంబయి, నవంబరు 6: మ్యాక్స్‌వెల్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ ఐపీఓ ఇన్వెస్టర్లకు మంచి లాభాలను అందించింది. స్టాక్ మార్కెట్లో ఈ కంపెనీ షేర్లు ఇష్యూ ధరతో పోలిస్తే ఏకంగా 90 ప్రీమియంతో రూ.300.20వద్ద లిస్ట్ అయ్యాయి. ఐపీఓలో ఒక్కో షేరు ధరను రూ.158గా నిర్ణయించారు. లిస్టింగ్ తర్వాత కూడా షేర్లలో కొనుగోళ్ల జోరు కొనసాగింది. ఈ ఐపీఓలో ఒక్కో లాట్‌కు 800 షేర్లను కేటాయించారు. కనీసం రెండు లాట్లకు దరఖాస్తు చేయాల్సి రావడంతో రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం రూ.2,52,800 పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. రెండు లాట్లు అంటే 1,600 షేర్లు అలాట్ అయిన వారికి లిస్టింగ్ సమయంలో పెట్టుబడి విలువ రూ. 4,80,320కు చేరింది. అంటే ఒక్కో షేరుపై రూ.142.20లాభం చొప్పున మొత్తం రూ. 2,27,520 లాభం వచ్చింది. మార్కెట్లో లిస్ట్ అయిన తర్వాత కూడా మ్యాక్స్‌వెల్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ షేర్లలో ర్యాలీ కొనసాగింది. ప్రారంభ ట్రేడింగ్‌లోనే 4 శాతానికి పైగా పెరిగి ఇంట్రాడే గరిష్ఠంగా రూ.314.80 స్థాయిని తాకాయి. దీంతో ఐపీఓలో షేర్లు పొందిన ఇన్వెస్టర్లలో ఉత్సాహం నెలకొంది. ఈ కంపెనీ ఐపీఓ పరిమాణం రూ.57.64 కోట్లు. మొత్తం 36.48 లక్షల కొత్త షేర్లను విడుదల చేసింది. ప్రస్తుత వాటాదారులు తమ వద్ద ఉన్న ఒక్క షేరునుకూడా విక్రయించలేదు. ఐపీఓలో 536.80 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం ఐపీఓ అందుబాటులో ఉండగా, వారి నుంచి కంపెనీ రూ.16.18 కోట్లు సమీకరించింది. కొత్త యంత్రాలు, ల్యాబ్ పరికరాలు, ఇతరసామగ్రి కొనుగోలుకు రూ.18 కోట్లు ఖర్చు చేయనుంది. కొత్త కార్యాలయ భవనం, తయారీ కేంద్రం నిర్మాణానికి రూ.6.50 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ఉన్న రుణాలను పూర్తిగా లేదా పాక్షికంగా చెల్లిం చేందుకు రూ.4.30 కోట్లు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు రూ.14 కోట్లు వినియోగించనుంది. సాధారణ కార్పొరేట్ అవసరాలకోసం రూ. 7.06 కోట్లు కేటాయించగా, ఐపీఓ నిర్వహణ ఖర్చులురూ.7.78 కోట్లను కూడా ఈ నిధుల నుంచే సర్దుబాటు చేయనుంది.

ఎఫ్‌డిలపై వడ్డీరేట్లు సవరించిన బ్యాంకులు



ముంబయి, నవంబరు 6: ఆర్బీఐ రెపో రేటు పెంచడంతో పలు ఎన్బీఎఫ్సీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు, ప్రభుత్వ బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించాయి. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి సంస్థలు వడ్డీ రేట్లను సవరిం చాయి. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎఫ్‌డీ వడ్డీ రేట్లను సవరించింది. ఈ బ్యాంకు 666 రోజుల ప్రత్యేక కాలపరిమితి గల డిపాజిట్లపై సాధారణ వినియోగదారులకు 8.10 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం గరిష్ట వడ్డీ రేటును అందిస్తోంది. రెండు సంవత్సరాల నుంచి మూడు సంవ త్సరాల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై, సాధారణ వినియోగదారులు 7.50 శాతం, సీనియర్ సిటిజన్లు 7.90 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. హెచ్ డీఎఫ్సీ బ్యాంక్ కూడా కొన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను సవ రించింది. ఇందులో గరిష్టంగా 50 బేసిస్ పాయింట వరకు పెంపు ఉంది. 371 రోజుల నుంచి 665 రోజుల మధ్య కాలపరిమితి గల డిపాజిట్లపై ఈ రేట్లు 7.25 శాతం నుంచి 7.65 శాతం వడ్డీ చెల్లిస్తోంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ నవంబర్ 4, 2026 నుంచి కొన్ని నిర్దిష్ట కాలపరిమితులపై తన నీదీ వడ్డీ రేట్లను సవరించింది. ప్రస్తుతం ఈ బ్యాంకు రెండు సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై సాధారణ వినియోగదారులకు గరిష్టంగా 6.80 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.55 శాతం వడ్డీని అందిస్తోంది. గతంలో ఈ బ్యాంకు సాధారణ వినియోగదారులకు గరిష్టంగా 6.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.25 శాతం వడ్డీని అందించేది. హెచ్ డీఎఫ్సీ బ్యాంక్ కూడా కొన్ని నిర్దిష్ట కాలపరిమితుల కోసం తన ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను సవరించింది. ఇందులో గరిష్టంగా 50 బేసిస్ పాయింట్ల వరకు పెంపు ఉంది. సీనియర్ సిటిజన్లు 3 సంవత్సరాల 1 రోజు నుంచి 5 సంవత్సరాల కాలపరిమితి గల నీదీలపై గరిష్టంగా 7.20 శాతం వడ్డీని పొందవచ్చు. సాధారణ వినియోగదారుల విషయానికి వస్తే 3సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై గరిష్టంగా 6.60 శాతం వడ్డీ లభిస్తుంది. యాక్సిస్ బ్యాంక్ ఎంపిక ఎఫ్‌డిలపై వడ్డీ రేట్లను సవరించింది. ఈ బ్యాంక్ రెండు సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై సాధారణ వినియోగదారులకు గరిష్టంగా 6.60 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. ఐదు సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లు 7.35 శాతం వరకు వడ్డీని పొందవచ్చు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ తన 444రోజుల ప్రత్యేక ఎఫ్డీ పథకంపై సాధారణ డిపాజిటర్లకు గరిష్టంగా 6.60 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. 666 రోజుల డిపాజిట్లపై ఈ బ్యాంక్ సాధారణ వినియోగదారులకు 6.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 7 శాతం వడ్డీని అందిస్తోంది. మూడు సంవత్సరాల కంటే ఎక్కువ నుంచి 1,203 రోజుల వరకు కాలపరిమితి గల డిపాజిట్లపై పంజాబ్ నేషనల్ బ్యాంక్ సాధారణ డిపాజిటర్లకు 6.35 శాతం, సీనియర్ సిటిజన్లకు 6.85 శాతం వడ్డీని అందిస్తోంది. మెచ్యూరిటీ వ్యవధిని బట్టి, సాధారణ కస్టమర్ల కోసం దీని ఎఫ్డీ రేట్లు 3 శాతం నుంచి 6.60 శాతం వరకు ఉంటాయి.

ఏడో రోజూ లాభాల్లోనే సెన్సెక్స్, నిఫ్టీ
1,718 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్
25,000మార్క్‌పైన ముగిసిన నిఫ్టీ



ముంబయి, నవంబరు 6: ప్రపంచ మార్కెట్లలో టెక్నాలజీ షేర్ల ఒత్తిడి ఉన్న ప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభా లను నమోదు చేశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల భారీ పెట్టు బడులు, ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరిన రూపాయి విలువ, ముడి చమురు ధరలు తగ్గుతాయన్న అంచనాలు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. ఒక్కరోజే విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్లలో రూ.14,975 కోట్ల పెట్టుబడులు పెట్టారు. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 93.90కు చేరడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. దీపావళి పండుగ నేపథ్యంలో నెలకొన్న ఆశావాదం కూడా కొనుగోళ్లకు ఊతమిచ్చింది. ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లతో నిఫ్టీ 25,000 పాయింట్ల ఎగువన ముగిసింది. మీడియా రంగ షేర్లు మాత్రం నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,718.01 పాయింట్లు పెరిగి 81,028.02 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 493.75 పాయింట్లు లాభపడి 25,030.35 వద్ద స్థిరపడింది. వరుసగా ఏడు సెషన్లలో సెన్సెక్స్ 10.62 శాతం, నిఫ్టీ 10.27 శాతం చొప్పున పెరిగాయి. నిఫ్టీ పెరుగుదలకు ప్రధానంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు దోహదపడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 4.75 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.72 శాతం, భారతి ఎయిర్‌టెల్ 2.45శాతం లాభపడ్డాయి. మరోవైపు, నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.09 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.85 శాతం చొప్పున నష్టపోయాయి. ఎన్ఎస్ఈ లో మొత్తం 1,438 షేర్లు లాభాల్లో ముగియగా, 2,141 షేర్లు నష్టాలను నమోదు చేశాయి. మరో 127 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. దీపావళి లక్ష్మీ పూజ సందర్భంగా నవంబర్ 8, ఆదివారం భారతీయ స్టాక్ ఎక్స్చేంజీలు ప్రత్యేక ముహూర్త ట్రేడింగ్ నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 2:05 నుంచి 2:20 వరకు ఉంటుంది. ముహూర్త ట్రేడింగ్ మధ్యాహ్నం 2:20 నుంచి 3:30 వరకు ఉంది. ఈ ప్రత్యేక ట్రేడింగ్‌తో సంవత్ 2083 ప్రారం భం కానుంది. ముడి చమురు డిసెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 70 సెంట్లు తగ్గి 97.59 డాలర్లకు చేరింది. భారత 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి 0.22 శాతం పెరిగి 7.185 శాతానికి చేరింది. గత సెషన్ ముగింపు వద్ద ఇది 7.192 శాతంగా నమోదైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పెరిగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 94.4100 వద్ద ముగిసిన రూపాయి, ప్రస్తుతం 93.9000 స్థాయికి చేరింది. డిసెంబర్ 4, 2026 డెలివరీకి సంబంధించిన ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.29 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,42,242 వద్ద నమోదైంది. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 0.23 శాతం పెరిగి 4.841 శాతానికి చేరింది.

ఎల్ఐసి నికరలాభం రూ.12,115 కోట్లు: అయినా మార్కెట్‌లో షేర్లు డౌన్



ముంబయి, నవంబరు 6: జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండో త్రైమాసికంలో ఎల్ఐసీకి ఏకంగా రూ.12,115 కోట్ల ఏకీకృత నికర లాభం వచ్చింది. అయినప్పటికీ ఆర్థిక ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నవంబర్ 6వ తేదీన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో ఎల్ఐసీ షేరు ధర దాదాపు 4 శాతం మేర క్షీణించింది. కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 20 శాతం మేర వృద్ధి చెందినప్పటికీ, నూతన వ్యాపర విలువ అంచనాలను అందుకోవడంలో వెనుకబడటం ఇన్వెస్టర్ల సెంటిమెంటును ప్రభావితం చేసినట్లు బ్రోకరేజీలు చెబుతున్నాయి. బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ ఎల్ఐసీ టార్గెట్ ధరను స్వల్పంగా తగ్గించింది. ప్రస్తుత మార్కెట్ ధరతో పోలిస్తే ఇది ఇప్పటికీ దాదాపు 25 శాతం ముందస్తు రాబడి అవకాశాన్ని సూచిస్తోంది. ఎల్ఐసీ షేరుపై తమ బై రేటింగ్‌ను కొనసాగించడానికి జెఫరీస్ పలు కారణాలను చెప్పింది. కంపెనీ తన నిర్వాహణ ఖర్చుల నిష్పత్తిని 10.26 శాతం తగ్గించుకోవడం ద్వారా నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించుకుంది. నిబంధనల పరిమితి కంటే చాలా ఎక్కువ సాల్వెన్సీ నిష్పత్తి 2.35 ఉండడం వల్ల కంపెనీ వద్ద తగినంత మిగులు మూలధనం అందుబాటులో ఉంది. మార్కెట్ క్షీణతలో ఎల్ఐసీ షేరు ఆకర్షణీయమైన వాల్యుయేషన్ వద్ద లభిస్తుండడం, అదనంగా ఏజెంట్ నెట్‌వర్క్ పునర్నిర్మాణం ద్వారా దీర్ఘకాలిక ప్రీమియం వృద్ధి సాధించే అవకాశం ఉంది. రెండో త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.12,115 కోట్లుగా చూపించింది. వార్షిక ప్రాతిపదికన చూసుకుంటే గతేడాది ఇదే సమయంలో కంపెనీకి వచ్చిన లాభంతో పోలిస్తే ఈసారి లాభం 20 శాతం మేర పెరిగింది. అలాగే నెట్ ప్రీమియం ఇన్‌కమ్ 16 శాతం మేర పెరిగి రూ.1.47 లక్షల కోట్లుగా నమోదు చేసింది. సింగిల్ ప్రీమియం కలెక్షన్లు పెరగడంతో ఇది సాధ్యమైంది. షేర్ హోల్డర్ల ఖాతాలో నికర పెట్టుబడి ఆదాయం ఏకంగా 38 శాతం పెరిగి రూ.2,855 కోట్లకు పెరిగింది. నవంబర్ 6వ తేదీ స్టాక్ మార్కె ట్ ట్రేడింగ్‌లో ఎల్ఐసీ షేరు దాదాపు 4 శాతం పడిపోయింది. క్రితం రోజు ముగింపు ధర రూ.408తో పోలిస్తే ఈరోజు రూ.404 వద్ద నష్టాల్లో ట్రేడింగ్ మొదలు పెట్టింది. ఒక దశలో 4 శాతం వరకు నష్టపోయి రూ.392 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత కాస్త కోలుకుంది. ఈ వార్త రాసే సమయానికి 3.15 శాతం నష్టంతో రూ.395.15 వద్ద ట్రేడవుతోంది. ఈ స్టాక్ గత నెల రోజుల్లో 1 శాతం మాత్రమే పెరిగింది. గత ఆరు నెలల్లో 2 శాతం నష్టపోయింది. గత ఏడాది కాలంలో 11 శాతం, గత నాలుగేళ్లలో 5 శాతం పడిపోయింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.2.51 లక్షల కోట్లుగా ఉంది.

కుప్పకూలిన అమెరికా మార్కెట్లు



న్యూయార్కు, నవంబరు 6: అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ పతనం నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై పెట్టుబడులు, వాటి నుంచి ఆశించిన లాభాలపై ఆందోళనలు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. దీనికితోడు అమెరికా ఎన్నికల ఫలితాలు కూడా భారీగా ప్రభావం చూపించాయి. ముఖ్యంగా టెక్నాలజీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. నాస్‌డాక్ సూచీ భారీగా పడిపో యింది. 2020లో కరోనా సంక్షోభం తర్వాత ఇంతటి పతనం ఇదే తొలి సారి. అమెరికాలో నెలకొన్న ప్రభావం ఆసియా మార్కెట్లకూ పాకింది. గురు వారం ట్రేడింగ్‌లో నాస్‌డాక్100 సూచీ 6శాతానికి పైగా పతనమైంది. ఎస్ అండ్‌పీ 500 సూచీ 4.4శాతం నష్టపోయింది. చిప్ కంపెనీల షేర్లను ప్రతిబింబించే ఫిలడెల్ఫియా సెమీకండక్టర్ సూచీ ఏకంగా 12శాతం పడిపోయింది. డోజోన్స్‌లోని మొత్తం 30కం పెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఉన్న ఎన్వి డియా షేరు9శాతానికి పైగా పడిపోయింది. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు ఆ కంపెనీకి వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. డేటా సెంటర్ల నిర్మాణం, విద్యుత్ వినియోగంపై కొత్త ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకు రావచ్చని మదుపర్లు భావిస్తున్నారు. దీంతో ఏఐరంగంలో పెట్టుబడుల వేగం తగ్గే అవకాశం ఉందన్న ఆందోళనలు పెరిగాయి. అమెరికా మార్కెట్ల పతనం ఆసియానూ తాకింది. దక్షిణ కొరియా కోస్పి సూచీ భారీగా పడిపోవడంతో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. జపాన్ నిక్కీకూడా గణనీయంగా నష్టపోయింది. మరోవైపు మదుపర్లు సురక్షిత పెట్టుబడిగా భావించే అమెరికా ప్రభుత్వ బాండ్ల వైపు మొగ్గుచూపారు.

ఈ వారం మార్కెట్‌లోకి ఆరు కొత్త ఫండ్ ఆఫర్లు

ముంబయి, నవంబరు 6: దేశీయ ఈక్విటీ ఇన్వెస్టర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న క్రమంలో వివిధ మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు సరికొత్త పెట్టుబడి అవకాశాలను ముందుకు తెచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో వివిధ కేటగిరీలకు చెందిన 6 కొత్త మ్యూచువల్ ఫండ్ ఆఫర్లు ఇన్వెస్టర్ల సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఇన్వెస్కో ఇండియా సిల్వర్ ఈటీఎఫ్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ లతో పాటు పలు థీమాటిక్, సెక్టోరల్, డెట్ కేటగిరీల ఫండ్లు ఉన్నాయి. కొత్త ఫండ్లలో రూ.10 ప్రారంభ ఎన్ఏవీతో పెటుబడి. ఇన్వెస్కో ఇండియా ఏఎంసీ నుంచి 2 ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ ఇన్వెస్కో ఇండియా మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు న్యూ ఫండ్‌ఆఫర్స్ లాంచ్ అయ్యాయి. ఇన్వెస్కో ఇండియా సిల్వర్ ఈటీఎఫ్, ఇన్వెస్కో ఇండియా సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ అవగా 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో కనీస పెట్టుబడి వరుసగా రూ.5000, రూ.1000 నుంచి మొదలవుతున్నాయి. ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఎడెల్వీస్ నిఫ్టీ ఎనర్జీ ఈటీఎఫ్ అనే న్యూ ఫండ్ ఆఫర్ లాంచ్ అయింది. నవంబర్ 13వ తేదీ వరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.